PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 42 సంచిక : 327 | విజయవాడ, బుధవారం 28 జూన్ 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Wednesday 28 June 2023 | Rs

వాగ్నర్‌పై క్రిమినల్ కేసు ఉపసంహరణ

- ఎఫ్ఎస్‌బి వెల్లడి
- దేశ ప్రజలకు పుతిన్ కృతజ్ఞతలు

లోపలి పేజీలో..



వన్డే ప్రపంచకప్ షెడ్యూల్ విడుదల

- అక్టోబర్ 5న ఇంగ్లండ్-న్యూజిలాండ్ మ్యాచ్‌తో షురూ
- 15న అహ్మదాబాద్‌లో భారత్-పాకిస్తాన్ మ్యాచ్
- ఉప్పల్‌లో మూడు మ్యాచ్‌లు

లోపలి పేజీలో..

సీడ్ సబ్సిడీకి కోత

- 40 కోట్లు తగ్గింపు
- పంపిణీ చేసే విత్తనాలు, లబ్ధిదారులు కుదింపు



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

రైతులకు పంపిణీ చేసే విత్తనాల రాయితీని ప్రభుత్వం ఈ ఏడాది కుదించింది. ముందుగా వేసిన అంచనాలో దాదాపు రూ.40 కోట్లు తగ్గించింది. తొలుత విత్తన సబ్సిడీకి రూ.240 కోట్లు కావాలనుకోగా, అనంతరం రూ.200 కోట్లకే పరిమితం కావాలని దిశా నిర్దేశం చేసింది. వాస్తవ అంచనాలను కాకుండా ఉజ్జాయింపుగా వేసే బడ్జెట్ ప్రతిపాదనలను దృష్టిలో ఉంచుకోవాలని ఆదేశించినట్లు తెలిసింది. ప్రభుత్వం భరించే సబ్సిడీ నిధులు తగ్గినపక్షంలో ఆ మేరకు రైతులకు పంపిణీ చేసే విత్తనాల పరిమాణం తగ్గుతుంది. లబ్దిదారుల సంఖ్యకూ కోత పడుతుంది. తగ్గిన విత్తనాలను బయట కొనుగోలు చేయాల్సి రావడంతో ఆ వారా రైతులు ఆర్థిక భారం మోయాల్సి వస్తుంది. అసలే సంక్షోభంలో ఉన్న రైతన్నలు ఈ అదనపు భారంపై ఆందోళన చెందుతున్నారు.

చిక్కిపోతున్న రాయితీ

జాతీయ ఆహార భద్రత మిషన్, నూనెగింజలు, పప్పుధాన్యాలు, చిరుధాన్యాల సాగు ప్రోత్సాహం ఇత్యాది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల కింద రైతులకు ప్రతి ఏటా ఖరీఫ్, రబీలో సబ్సిడీపై విత్తనాలిస్తున్నారు. ప్రభుత్వం రైతులకు అన్ని పంటల విత్తనాలనూ సరిపడా పంపిణీ చేయట్లేదు. మొత్తం అవసరంలో 30 శాతం కూడా రాయితీ విత్తనాలుండవు. కొన్ని పంటల విత్తనాలకే 50 శాతం సబ్సిడీ. వేరుశనగ సహా పలు పంటలకు 40 శాతమే. పంపిణీ చేసే విత్తనాల పరిమాణం అంతకంతకూ తగ్గుతోంది. 2020-21 ఖరీఫ్‌లో 6.99 లక్షల క్వింటాళ్లు, 2021-22లో 6.17 లక్షల క్వింటాళ్లు, నిరుడు 5.35 లక్షల క్వింటాళు పంపిణీ చేశారు. తుపాన్లు, వరదలు, కరువు వంటి ప్రత్యేక సందర్భాల్లో కంటింజెన్సీ ప్లాన్ల కింద రబీలో అరకొర విత్తనాలిస్తున్నారు. ఖరీఫ్, రబీ కలుపుకొని 2020-21లో రూ.216 కోట్లు, 2021-22లో రూ.265 కోట్లు, నిరుడు రూ.175 కోట్లు సబ్సిడీ ఇచ్చారు. ఆ క్రమంలోనే ఈ సంవత్సరం రెండు సీజన్లూ కలుపుకొని రూ.200 కోట్లు మాత్రమేనంటున్నారు. ఒక వైపు అమ్మకపు ధర (సేల్ ప్రైస్) పెంచేసి మరోవైపు ప్రభుత్వం భరించే రాయితీ అమౌంట్ తగ్గిస్తే అంతిమంగా రైతుపైనే భారం పడుతుంది. వేరుశనగ సేల్ ప్రైస్ నిరుటికంటే క్వింటాలుకు రూ.850 పెంచారు. సబ్సిడీని కుదించడంతో గతేడాది రైతుకు గరిష్టంగా 150 కిలోలు (ఐదు మూటలు) ఇవ్వగా ఈ తడవ 90 కిలోలకు (మూడు మూటలు) తగ్గించారు.

ఇండెంట్లకు కత్తెర

సర్కారు సరఫరా చేసే విత్తనాల్లో 70 శాతం వరకు వేరుశనగ విత్తనాలే. వాటి పంపిణీ సైతం ఏడాదేడాది తగ్గిపోతోంది. ఈ సంవత్సరం ఖరీఫ్ కోసం చివరి నిమిషంలో ఆదరాబాదరాగా టెండర్లపై వ్యాపారుల నుంచి సేకరించారు. పెద్దగా నిబంధనలేమీ పాటించలేదు. ఇంకా వర్షాలు జోరందుకోకముందే విత్తన పంపిణీ పూర్తి చేశారు. రాష్ట్రం మొత్తానికి 2.92 లక్షల క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు పంపిణీ చేయాలనుకోగా అందులో 30 వేల క్వింటాళ్లు పంపిణీ చేయలేదని తెలుస్తోంది. వేరుశనగ అధికంగా సాగు చేసే ఉమ్మడి అనంతపురం జిల్లాలో తొలుత 1.88 లక్షల క్వింటాళ్లు పంపిణీ చేయాలనుకోగా లక్ష్యం ఇంకా చేరకుండానే పంపిణీ నిలిపేశారని ఆరోపణలొస్తున్నాయి. ఆర్‌బికెలలో డి-క్రిషి యాప్‌లో సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేయాలని చెప్పి, ఆఫ్‌లైన్‌కు కూడా అనుమతిచ్చారు. దాంతో పంపిణీ లెక్కలు తారుమారయ్యాయని, కాగితాలపై పేర్కొన్న మేరకు కూడా రైతులకు విత్తనాలు చేరలేదని విమర్శలొస్తున్నాయి. వరి, పప్పులు, గ్రీన్ మెన్యూర్ ఇలా అన్ని పంటల విత్తనాలూ ఇంతేనని అన్నదాతలు వాపోతున్నారు.

ఉమ్మడి సివిల్ కోడ్‌పై మోడీ రాగం

అఫిడవిట్‌లో అంశాలనే అప్పజెప్పిన వైనం • కోర్టు తీర్పులకు వక్రభాష్యాలు

న్యూఢిల్లీ : త్వరలో ఎన్నికలు జరగనున్న మధ్య ప్రదేశ్‌లో ప్రధాని నరేంద్ర మోడీ ఉమ్మడి పౌర స్మృతి పేరుతో మత విద్వేషాలను రగిల్చే యత్నం చేశారు. మంగళవారం భోపాల్‌లో మాట్లాడుతూ సుప్రీం కోర్టులో న్యాయమంత్రిత్వశాఖ వేసిన అఫిడవిట్‌లోని అంశాలనే మక్కీకి మక్కీగా వల్లెవేశారు. కొద్ది నెలల కిందట సుప్రీం కోర్టులో కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ దాఖలుచేసిన అఫిడవిట్ వివిధ మతాలు, వివిధ తెగలకు చెందిన పౌరులు వివిధ ఆస్తి, వివాహ చట్టాలను పాటించడం జాతి ఐక్యతకు భంగకరమని పేర్కొంది. దానినే మోడీ చిలుక పలుకుల్లా వల్లించారు. సుప్రీం కోర్టు మతానికి, రాజకీయాలకు సంబంధం ఉండరాదని స్పష్టంగా పలు సందర్భాల్లో ఇచ్చిన తీర్పులకు ఆయన తనదైన శైలిలో వక్ర భాష్యాలు చెప్పారు. తనకు అనుకూలమైన అంశాలను మాత్రమే తీసుకుని అదే కోర్టు తీర్పు అన్నట్టుగా నమ్మబలికే యత్నం చేశారు. ఇటీవల న్యాయమంత్రిత్వ శాఖ దాఖలు చేసిన అఫిడవిట్‌లో తన పౌరులకు యుసిసి వుండేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి వుందని, అందుకోసం ప్రయత్నించాలని రాజ్యాంగంలోని 44వ అధికరణ పేర్కొందని చెప్పింది. ఉమ్మడి పౌర స్మృతిని తీసుకురావడానికి కృషి చేయాల్సిందిగా 2019లో, సుప్రీం కోర్టు డివిజన్ బెంచ్ ప్రభుత్వానికి సూచించింది. 1956లో హిందూ చట్టాన్ని క్రోడీకరించినప్పటికీ తన పౌరులకు యుసిసిని సాధించడంలో వరుసగా వచ్చిన ప్రభుత్వాలు విఫలమవడాన్ని ప్రస్తావించింది. 1985లో షా బానో కేసులో ఈ కోర్టు ప్రబోధించినప్పటికీ ప్రభుత్వం ఉమ్మడి పౌర స్మృతిని తీసుకురావడానికి చేసిందేమీ లేదని కోర్టు పేర్కొంది. భరణం పొందేందుకు ముస్లిం మహిళలకు గల హక్కును సమర్ధించిన షా బానో కేసు యుసిసి అమలు దిశగా ఒక ముందడుగుగా పరిగణించబడింది.

"ప్రభుత్వ విధాన ఆదేశిక సూత్రాల గురించి తెలిపే రాజ్యాంగంలోని 44వ అధికరణలో నాల్గవ భాగం వ్యవస్థాపకులు భారతదేశంలోని అన్ని ప్రాంతాల్లో ప్రజల కోసం ఉమ్మడి పౌర స్మృతిని తీసుకువచ్చేందుకు ప్రయత్నించాలని ఆశించారు, భావించారు. కానీ ఇందుకు సంబంధించి ఇంతవరకు ఎలాంటి చర్యతీసుకోలేదు." అని సుప్రీం కోర్టు జోస్ పాల్ కౌంటినో తీర్పులో వ్యాఖ్యానించింది.

యుసిసి అమలును పరిశీలించేందుకు కమిటీని ఏర్పాటు చేసేందుకు రాజ్యాంగం కింద రాష్ట్ర ప్రభుత్వానికి గల అధికారాన్ని ఇటీవల సుప్రీం కోర్టు సమర్ధించింది. ఈ నిర్ణయం, యుసిసిపై తన స్వంత కమిటీని వేసేందుకు బిజెపి పాలిత రాష్ట్రమైన ఉత్తరాఖండ్ ప్రభుత్వం తీసుకున్న చర్యకు సవాలుగా మారింది.

యుసిసి గురించి నొక్కి చెబుతూ సుప్రీం కోర్టు తీసుకున్న నిర్ణయాలను, వ్యాఖ్యలను ప్రధాని మోడీ తన ప్రసంగంలో ప్రస్తావించారు. యుసిసికి సంబంధించిన కార్యాచరణలో జాప్యానికి ప్రతిపక్షాల ఓటు బ్యాంక్ రాజకీయాలే కారణమని విమర్శించారు.

అయితే, "మతాన్ని, ప్రభుత్వ అధికారాన్ని మిళితం చేయడం" గురించి కూడా సుప్రీం కోర్టు, ఎస్.ఆర్.బొమ్మై వర్సెస్ కేంద్ర ప్రభుత్వం కేసులో రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పులో హెచ్చరించింది.

"మతాన్ని, ప్రభుత్వ అధికారంతో మిళితం చేయడానికి రాజ్యాంగం అనుమతించదు, పైగా గుర్తించదు కూడా. ఆ రెండు అంశాలు విడివిడిగా వుండాలి. అది రాజ్యాంగ నిషేధం. ఈ రాజ్యాంగం ఈ దేశాన్ని పాలించినంత కాలమూ ఎవరూ మరో రకంగా చెప్పలేరు. రాజకీయాల్లోకి మతాన్ని ప్రవేశపెట్టడమంటే శరీరంలోకి అనుమతి లేని అంశాన్ని ప్రవేశపెట్టడమే కాగలదు. ఇది, మన రాజ్యాంగ వ్యవస్థను

మిగతా 7లో



భోపాల్‌లో మంగళవారం జరిగిన సభలో వందేభారత్ రైలును ప్రారంభిస్తున్న ప్రధాని మోడీ

ఒక దేశంలో రెండు చట్టాలా!

- భోపాల్ సభలో మోడీ
- పాట్నా సమావేశంపైనా అక్కసు

భోపాల్ : దేశంలో ఉమ్మడి పౌర స్మృతి (యుసిసి)ని అమలు చేయాల్సి వుందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. సున్నితమైన ఈ అంశంపై ముస్లింలను రెచ్చగొడుతున్నారని అన్నారు. పాట్నా సమావేశం కేవలం గ్రూపు ఫోటో కోసం జరిగిందేనని తన అక్కసు వెళ్లగక్కారు.. సుప్రీం కోర్టు కూడా యుసిసిని అమలు చేయాలని పేర్కొంటుండగా, బుజ్జగింపు, ఓటు బ్యాంక్ రాజకీయాలకు పాల్పడేవారు మాత్రం దీన్ని వ్యతిరేకిస్తున్నారని నిందించారు. ఒక దేశంలో రెండు చట్టాలు ఎలా వుంటాయని ఆయన ప్రశ్నించారు. భోపాల్‌లో పార్టీ కార్యకర్తలనుద్దేశించి ప్రధాని మాట్లాడుతూ, ప్రతిపక్షాలపైనా విసుర్లు విసిరారు. వారు కేవలం అవినీతికి మాత్రమే 'హామీ' ఇవ్వగలరని అన్నారు. రూ.20లక్షల కోట్ల విలువ చేసే కుంభకోణాల్లో వారు ఇరుక్కున్నారని విమర్శించారు. పాట్నాలో ఈ నెల 23న జరిగిన సమావేశం కేవలం డజనుకుపైగా పార్టీలు ఫోటో షూట్ కోసం జరిపిన సమావేశమని వ్యంగ్యంగా అన్నారు.. ఓటు బ్యాంక్ రాజకీయాలను, బుజ్జగింపుల పంథాను తమ పార్టీ అనుసరించబోదన్నారు. భోపాల్‌లో బిజెపి నిర్వహించిన "మేరా బూత్ సబ్సే మజ్‌బూత్" ప్రచార కార్యక్రమంలో ప్రధాని పార్టీ కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించారు. ముస్లింలలో వెనుకబడిన తరగతి అయిన పస్‌మందా ముస్లింలను కనీసం వారితో సమానంగా గుర్తించడం లేదని, ఓటు బ్యాంక్ రాజకీయాలే ఇందుకు కారణమని అన్నారు. మూడుసార్లు తలాక్ చెప్పే పద్ధతికి మద్దతివ్వడమంటే ముస్లిం ఆడపిల్లలకు తీవ్రంగా అన్యాయం చేయడమేనని అన్నారు. కుటుంబ రాజకీయాలు, కుటుంబం నడిపే పార్టీలంటూ కాంగ్రెస్, సమాజ్‌వాదీ, బిఆర్ఎస్, డిఎంకె, ఆర్‌జెడి, ఎన్‌సిపి, నేషనల్ కాన్ఫరెన్స్‌పై విమర్శలు గుప్పించారు..

పోరుయాత్రకు విశాల మద్దతు

- ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ సహా పలువురు సంఘీభావం

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి, కుక్కునూరు, బుట్టాయగూడెం

పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండాగా చేపట్టిన పోరుకేక మహా పాదయాత్రకు విశాల మద్దతు లభిస్తోంది. వివిధ సంఘాల నాయకులు, వైసిపి సహా అన్ని పార్టీల నాయకులూ సంఘీభావం ప్రకటిస్తున్నారు. యాత్రలోనూ, బహిరంగ సభలోనూ పాల్గొని సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నారు. ఎనిమిదో రోజు మంగళవారం ఏలూరు జిల్లా కుక్కునూరు, జీలుగుమిల్లి మండలాల్లో సాగిన యాత్రలో ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్, పినపాక మాజీ ఎమ్మెల్యే, ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ చందా లింగయ్యదొర, టిడిపి కుక్కునూరు మండల అధ్యక్షులు ఎం.నాగు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు మలిశెట్టి యుగంధర్, సిపిఐ నాయకులు కె.లక్ష్మయ్య తదితరులు యాత్రలో పాల్గొన్నారు. యాత్రకు ఎక్కడిక్కడే స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు.

రాష్ట్రంపై కేంద్రం కక్ష తీర్చుకుంటోంది

కేంద్ర ప్రభుత్వం నీచ, నికృష్టంగా ఎపిపై కక్ష తీర్చుకుంటోందని ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్ విమర్శించారు.


కుక్కునూరు మహా పాదయాత్రలో వి శ్రీనివాసరావు, చలసాని శ్రీనివాస్, చందా లింగయ్యదొర తదితరులు

పోలవరం పోరుకేక యాత్రకు సంఘీభావం తెలిపేందుకు ఆయన కుక్కునూరు వచ్చారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కలిసి పాదయాత్రలో పాల్గొన్నారు. ఆ గ్రామంలో జరిగిన బహిరంగ సభలో చలసాని శ్రీనివాస్ మాట్లాడుతూ 25 ఎంపి సీట్లు ఇస్తే కేంద్రం మెడలు వంచుతామని చెప్పి, నేడు ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వం మెడలు వంచుతోందని విమర్శించారు. గతేడాది వరదలకు నిర్వాసిత ప్రజలు 25 రోజులపాటు కొండలపైనే ఉన్నారన్నారు. నిర్వాసితులను ముంచి ఆ ఫలాలు పొందేందుకు రాష్ట్ర ప్రజలు ఎవరూ సిద్ధంగా లేరని తెలిపారు. ఉద్యమం ప్రజల కోసమేనని, ఏ పార్టీ కోసమూ కాదని అన్నారు. ప్రజల్లో చైతన్యం రావాలని పిలుపునిచ్చారు. కొద్దిపాటి నిధులిచ్చి కేంద్రం చేతులు దులుపుకోవాలని చూస్తోందని, పునరావాసం బాధ్యత నుంచి తప్పుకోవాలని చూస్తోందని విమర్శించారు. పూర్తి స్థాయిలో నిధులివ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ నిర్వాసితుల పట్ల మాట్లాడిన తీరు ఏ మాత్రమూ బాగోలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విధానం నిర్వాసితులను గోదారిలో ముంచేసేలా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వచ్చే నెల నాలుగున

మిగతా 2లో

విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు గనుల లీజు పునరుద్ధరించాలి

- ముఖ్యమంత్రికి సిపిఎం లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఉన్న భారీ పరిశ్రమ, ఉత్తరాంధ్ర అభివృద్ధికి కీలకమైన విశాఖ స్టీల్‌ప్లాంట్ గనుల లీజును పునరుద్ధరించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మంగళవారం సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లేఖ రాశారు. స్టీల్ ప్లాంట్‌ను కేంద్ర బిజెపి ప్రభుత్వం అమ్మాలని నిర్ణయించింది మొదలు ఏ విధంగానూ సహకరించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నదని, కేటాయించిన గనులను కూడా రద్దుచేసి ఉత్పత్తిని తగ్గించిందని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేసిందని, వైఎస్ఆర్ అనుబంధ ట్రేడ్ యూనియన్ కూడా ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ఉందని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్నా స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి అవసరమైన మైన్స్ లీజు పొడిగించకుండా రాష్ట్ర ప్రభుత్వం తాత్సారం చేయడం విస్మయానికి గురిచేసిందని తెలిపారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు అనుకూలంగా ఉన్నారనే భావం కార్మికుల్లో, కార్మిక సంఘాలకు కలిగే అవకాశం ఉందని, కేంద్ర ప్రభుత్వం అనుసరించిన తీరుగానే రాష్ట్ర ప్రభుత్వమూ వ్యవహరించడం సరైంది కాదని సూచించారు. ఈ చర్య కేంద్ర ప్రభుత్వం తీసుకున్న వైఖరికి తోడ్పడినట్లవుతుందని హెచ్చరించారు. స్టీల్‌ప్లాంట్‌కు విజయనగరం జిల్లాలోని గర్భాం వద్ద మాంగనీస్ గనులు, అనకాపల్లి జిల్లాలో కింతాడలో క్వార్ట్జ్ గనులు వున్నాయి. వాటి నుంచి మాంగనీస్, క్వార్ట్జ్, ఇసుకను విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ వినియోగించుకుంటోందని, గతంలో ఈ గనులకు ఆటోమేటిక్‌గా గడువు పొడగింపు జరుగుతుండేదని అన్నారు. ఈ మధ్య గడువు పొడగించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, దీనివల్ల విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రయివేటుగా అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో ప్లాంట్ పూర్తిస్థాయిలో నడిపేందుకు అవసరమైన సహకారం అందించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం గనుల లీజు గడువు పొడిగించకుండా ఇబ్బందులకు గురిచేయడం అన్యాయమని తెలిపారు. దేశంలో అన్ని ప్రభుత్వ, ప్రయివేటు స్టీల్‌ప్లాంట్లకు సొంత గనులు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకపోవడంతో ఉత్పత్తి ఖర్చు అధికంగా వున్న విషయం మీకు తెలుసని ముఖ్యమంత్రికి రాసిన లేఖలో పేర్కొన్నారు. దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వమూ గడువు పొడిగించకపోవడంతో విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌పై మరింత ఆర్థిక భారం పడుతోంది. దీనిపై జోక్యం చేసుకొని స్టీల్‌ప్లాంట్‌కు సంబంధించిన గనుల లీజు గడువు పొడగింపునకు తక్షణమే ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో నడిపించేందుకు తగిన సహకారం అందించాలని కోరారు.



సోలిపేట రామచంద్రారెడ్డి ఇకలేరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన రాజ్యసభ మాజీ సభ్యులు సోలిపేట రామచంద్రారెడ్డి (92) మంగళవారం ఉదయం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో కన్నుమూశారు. గత కొంతకాలంగా వయోభారం కారణంగా ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. రామచంద్రారెడ్డికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మంగళవారం సాయంత్రం జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో రామచంద్రారెడ్డి అంత్యక్రియలు ముగిశాయి. సిద్దిపేట జిల్లాలోని ఆయన స్వగ్రామం చిత్తాపూర్ నుంచి సమితి అధ్యక్షుడిగా రాజకీయ జీవితం ప్రారంభించిన ఆయన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, దొమ్మాట ఎమ్మెల్యేగా సేవలందించారు. టిడిపి నుంచి రాజ్యసభ సభ్యులుగా ఎన్నికై ఆ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా పనిచేశారు. రామచంద్రారెడ్డి మృతిపై సిఎం కెసిఆర్ సంతాపం వ్యక్తం చేశారు. తొలితరం కమ్యూనిస్టు నేతగా, నాటి తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొన్న సోలిపేట జీవితం ఆదర్శవంతమైందని కొనియాడారు.

బేతవోలు రామబ్రహ్మంకు సాహిత్య అకాడమీ భాషా సమ్మాన్ అవార్డు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



పశ్చిమగోదావరి జిల్లా నల్లజర్ల గ్రామానికి చెందిన ప్రొఫెసర్ బేతవోలు రామబ్రహ్మంకు సాహిత్య అకాడమీ భాషా సమ్మాన్ అవార్డు వరించింది. ఇటీవల న్యూఢిల్లీలోని రవీంద్ర భవన్‌లో అకాడమీ అధ్యక్షులు మాధవ్ కౌశిక్ అధ్యక్షతన సాహిత్య అకాడమీ ఎగ్జిక్యూటివ్ బోర్డు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సంప్రదాయ, మధ్యయుగ సాహిత్యంలో ప్రొఫెసర్ బేతవోలు రామబ్రహ్మం చేసిన అమూల్యమైన కృషికి గుర్తింపుగానూ ఆయనకు భాషా సమ్మాన్‌ను ఆమోదించారు. భాషా సమ్మాన్ నగదు బహుమతిగా రూ.లక్ష నగదు, రాగి ఫలకం, ప్రశంసా పత్రం అందజేయనున్నారు. దీనికి జ్యూరీ సభ్యులుగా ప్రొఫెసర్ కెఎస్ రవికుమార్, ప్రొఫెసర్ వీరేష్ బడిగేర్, డాక్టర్ ముక్తేవి భారతి వ్యవహరించారు.


గోధుమపిండి ప్యాకెట్‌ను ఆవిష్కరించిన మంత్రులు కారుమూరి, బొత్స

జులై నుంచి ఫోర్టిఫైడ్ గోధుమపిండి పంపిణీ

- రాష్ట్ర పౌర సరఫరాల శాఖామంత్రి కారుమూరి నాగేశ్వర్రావు

ప్రజాశక్తి-విజయనగరం

ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టుగా గోధుమ పిండిని పంపిణీ చేశామని, అది విజయవంతం కావడంతో జులై ఒకటి నుంచి రాష్ట్రంలోని అన్ని పట్టణ ప్రాంతాల్లో ఫోర్టిఫైడ్ గోధుమ పిండిని పంపిణీ చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖమంత్రి కారుమూరి వెంకట నాగేశ్వర్రావు తెలిపారు. కార్డుకు ఒక కిలోచొప్పున రూ.16కు సరఫరా చేస్తామన్నారు. రేషన్ డిపోల ద్వారా పంపిణీ చేస్తున్న సరుకులన్నింటినీ కలిపి ఒక కిట్ రూపంలో అందజేయాలని ముఖ్యమంత్రి భావిస్తున్నారని తెలిపారు. చిరుధాన్యాలు, ధాన్యం సేకరణపై ఉత్తరాంధ్ర జిల్లాల జాయింట్ కలెక్టర్లు, పౌర సరఫరాలు, విజిలెన్స్, తూనికలు కొలతలు, వ్యవసాయ శాఖాధికారులతో విజయనగరం కలెక్టరేట్‌లో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. నిత్యావసరాలు, ఆహార పదార్థాలను కల్తీ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, కల్తీ నిరోధానికి ఫుడ్ సేఫ్టీ, విజిలెన్స్, తూనికలు కొలతల శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ బృందాలు విస్తతంగా తనిఖీలు నిర్వహించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటాయని తెలిపారు. రాయలసీమ జిల్లాల్లో జొన్నలను, ఉత్తరాంధ్ర ప్రాంతంలో రాగులను పంపిణీ చేయాలని నిర్ణయించామన్నారు. గిరిజనులు పండించే రాగులను, వారి పొలాల వద్దకే వెళ్లి కొనుగోలు చేస్తామని, మూడు, నాలుగు రోజుల్లోనే వారి ఖాతాల్లో నగదు జమ చేస్తామని చెప్పారు. పౌర సరఫరాల శాఖను గత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సుమారు రూ.13500 కోట్లు అప్పు మిగిలిస్తే, తమ ప్రభుత్వ హయాంలో ఆ అప్పును తీర్చామని తెలిపారు. పూర్తి పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని తెలిపారు.

'అమ్మ ఒడి'పై విలీన ప్రభావం

- డ్రాప్ అవుట్స్ ప్రభావంతో భారీగా తగ్గుదల
- బియ్యం కార్డుల తొలగింపు కారణమంటున్న అధికారులు



ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో 3, 4, 5 పాఠశాలల విలీనం, ఎయిడెడ్ పాఠశాలల మూసివేత, విద్యా వ్యవస్థలో గతేడాది కాలంలో జరిగిన మార్పుల వల్ల ఈ ఏడాది అమ్మఒడి లబ్ధిదారుల సంఖ్య గణనీయంగా తగ్గింది. అంతేగాక ఆరు సూత్రాల విధానం వల్ల బియ్యం కార్డుల రద్దు ప్రభావమూ లబ్ధిదారుల కుదింపుపై పడింది. మొత్తంగా గతేడాది కన్నా ఈ ఏడాది 1.34 లక్షల మంది విద్యార్థుల తల్లులు అమ్మఒడికి దూరం కావాల్సి వచ్చింది. గుంటూరు జిల్లాలో గతేడాది 1.64 లక్షల మంది అమ్మఒడి కింద లబ్ధి పొందారు. ఈ ఏడాది 1.59 లక్షల మందికి మాత్రమే ఆ అవకాశం దక్కింది. మరోవైపు ఆదివారం వలంటీర్లకు జాబితాలు పంపి సోమవారం రాత్రిలోగా తల్లుల వద్ద బయోమెట్రిక్ ద్వారా అథంటిఫికేషన్ తీసుకోవాలని చెప్పడంతో కొంతమంది అందుబాటులోలేక ఆథరైజేషన్ ఇవ్వలేకపోయారని సమాచారం. ఇకెవైసి సమస్య, ఇతర సాంకేతిక కారణాలతో వందలాదిమంది తల్లులు ఈ పథకానికి దూరం అయ్యే పరిస్థితి ఏర్పడింది. గతేడాది పాఠశాలల నుంచి దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వం ఈ ఏడాది పాఠశాలలు పున:ప్రారంభానికి ముందే జిల్లా అధికారుల నుంచి వివరాలు సేకరించి జాబితాలను ఆమోదించింది.

వీటిని సోషల్ ఆడిట్‌కు పంపిన విద్యా శాఖ ఉన్నతాధికారులు తల్లుల నుంచి ఇకెవైసిని సచివాలయ అధికారులు వలంటీర్ల ద్వారా నమోదు చేయించారు. ఈ ప్రక్రియ కేవలం 48 గంటల ముందు చెప్పడంతో కొంతమందికి ఇకెవైసి జరగలేదని సమాచారం. గత విద్యా సంవత్సరంలో ఎయిడెడ్ వ్యవస్థలో మార్పులు, పాఠశాలల విలీనం ప్రభావంతో చాలామంది పేద విద్యార్థులు చదువుకు దూరం అయ్యారు. ప్రతి జిల్లాలో డ్రాప్ అవుట్స్ పెరిగాయి. పాఠశాలలకు దూరం అయిన వారిని చాలా ఆలస్యంగా అధికారులు గుర్తించి తిరిగి పాఠశాలలకు రప్పించేసరికి వారు దాదాపు రెండు నెలలు అటెండెన్సును కోల్పోయారు. 75 శాతం అటెండెన్సు నిబంధన వల్ల కొంతమంది ఈ పథకానికి దూరం అయ్యారు. విలీనం సమస్య వల్ల కొంతమంది విద్యార్థులను పాఠశాలలకు పంపకపోవడం వల్ల హాజరు శాతం తగ్గిందని పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు. ఆరు సూత్రాల విధానం పేరుతో ప్రతి జిల్లాలో కనీసం ఐదు నుంచి ఆరు వేల వరకు బియ్యం కార్డులు తగ్గించారు. కొన్ని కార్డులు తగ్గించినా మళ్లీ అదే స్థాయిలో కార్డులు ఇచ్చామని చెబుతున్నా, అమ్మఒడి లబ్ధిదారుల సంఖ్య ఈ ఏడాది తగ్గింది. విద్యుత్ వినియోగం 300 యూనిట్లపైన ఉండే వారిని అనర్హులుగా పేర్కొన్నారు. నాలుగు చక్రాల వాహనం, పట్టణాల్లో వెయ్యి అడుగులపైన ఇల్లు, ఇన్‌కంటాక్సు రిటర్నులు దాఖలు చేసే వారిని, ఆధార్, బ్యాంకు ఖాతాలకు లింకు కానీ వారిని అమ్మఒడికి అర్హులుగా పరిగణించలేదు.



సిఎంతో బంగ్లాదేశ్ డిప్యూటీ హై కమిషనరు భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో బంగ్లాదేశ్ డిప్యూటీ హై కమిషనరు షెల్లీ సలేహీన్ మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయంలో మంగళవారం వీరు భేటీ అయ్యారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై షెల్లీ సలేహీన్ ఆరా తీశారు. రాష్ట్రంలో వ్యవసాయం, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ఆయనకు సిఎం వివరించారు. ఈ సందర్భంగా షెల్లీ సలేహీన్‌ను సిఎం జగన్ సత్కరించారు. ఈ సమావేశంలో సిఎం స్పెషల్ సిఎస్ పూనం మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ట్రిపుల్ ఐటిల్లో ప్రవేశాలకు 38 వేల దరఖాస్తులు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు, ఇడుపులపాయ, శ్రీకాకుళం, ఒంగోలు ట్రిపుల్ ఐటిల్లో 2023-24 విద్యాసంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తు గడువు ముగిసిందని, మొత్తం 38 వేల దరఖాస్తులు అందాయని ప్రవేశాల కన్వీనర్ ఆచార్య గోపాలరాజు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్క సీటుకు తొమ్మిది మంది విద్యార్థులు పోటీ పడుతున్నారన్నారు. త్వరలోనే కౌన్సిలింగ్ ప్రక్రియ ప్రారంభిస్తామని తెలిపారు.

శ్రీచైతన్య విద్యార్థులు అదృశ్యం

- ఆలస్యంగా వెలుగులోకి

ప్రజాశక్తి -గాజువాక, కె.కోటపాడు, విశాఖ

విశాఖ జిల్లా గాజువాకలోని శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ముగ్గురు విద్యార్థులు అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అనకాపల్లి జిల్లా కె.కోటపాడుకు చెందిన పిల్లల దిలీప్ గాజువాక ప్రియదర్శిని కాలనీలో సంరక్షకుని ఇంటి వద్ద ఉండి శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. గాజువాక నవాబునగర్‌కు చెందిన గంద్రెడ్డి ఉమేష్‌పవన్, యు.దంతతేశ్వర్‌తో కలిసి దిలీప్ ఈ నెల 24న కళాశాలకు బయలుదేరారు. అయితే కళాశాలకు వెళ్లకుండా ముగ్గురూ దిలీప్ స్వగ్రామమైన కె.కోటపాడుకు వెళ్లారు. సాయంకాలం తిరిగి గాజువాకకు బయలుదేరారు. రాత్రి అయిన ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేయకుండా పోలీసులు తాత్సారం చేయడంతో రోజూ స్టేషన్ చుట్టూ తల్లిదండ్రులు తిరుగుతున్నారు. ఈ విషయం మీడియాకు తెలియడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నవంబర్‌లో రవాణా కార్మికుల చలో పార్లమెంట్

- ఎఐఆర్‌టిడబ్ల్యుఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య

ప్రజాశక్తి-గుంటూరు


రవాణా రంగ కార్మికుల సమస్యలపై నవంబర్‌లో పెద్ద ఎత్తున చలో పార్లమెంట్ నిర్వహిస్తున్నామని ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మయ్య తెలిపారు. ప్రభుత్వ విధానాలను రవాణా కార్మికులు భరించే పరిస్థితి కోల్పోయారని పేర్కొన్నారు. గుంటూరులో మంగళవారం యూనియన్ జిల్లా సమావేశానికి హాజరైన ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా కోవిడ్ కాలంలో పెట్రోలు ఉత్పత్తులపై రెండు దఫాలుగా ఎక్సైజ్ డ్యూటీ పెంచి, మూడు నెలల కాలంలో లీటరు డీజిల్‌పై రూ.16 భారం మోపారని, ఇన్సూరెన్స్ ప్రీమియంలు పెంచుతున్నారని అన్నారు. చిన్న చిన్న యజమానుల్ని ఈ రంగం నుంచి తొలగించి, కార్పొరేట్లకు అప్పగించడానికి 2019లో మోటారు వాహన చట్టానికి సవరణ చేశారని విమర్శించారు. ఈ నేపథ్యంలో రవాణా రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటుందన్నారు. జిడిపిలో నాలుగు శాతం ఈ రంగం నుంచి వస్తోందన్నారు. వ్యవసాయం తర్వాత అతిపెద్ద ఉపాధి రంగమని తెలిపారు. వీరికి ఎలాంటి చట్టబద్ధమైన హక్కులూ లేవని, ఏ వాతావరణ పరిస్థితిలోనైనా వాహనాలు నడపాల్సిన పరిస్థితి ఉందన్నారు. వీరి సంక్షేమానికి ప్రభుత్వం ఇప్పటివరకూ ఎలాంటి చర్యలూ తీసుకోలేదని విమర్శించారు. రవాణా మూడింటిపై తామే ప్రత్యేకంగా డాక్యు మెంట్లు తయారు చేసి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తామని చెప్పారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్‌లో దేశ వ్యాప్తంగా పెద్ద క్యాంపెయిన్ నిర్వహించి, నవంబర్‌లో ఛలో పార్లమెంట్ చేపడతామన్నారు. సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి లక్ష్మణరావు, నన్నపనేని శివాజీ, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్‌కె మస్తాన్‌వలి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మయ్య

కార్మికులకు సామాజిక సంక్షేమ చట్టం చేయాలని, దానికి విధి విధానాలను యూనియన్‌గా డ్రాఫ్ట్ తయారు చేస్తున్నామన్నారు. ఈ రంగాన్ని కాపాడడానికి మోటారు వాహన చట్టంలో సవరణలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఉబర్, వోలా, ర్యాపిడోలు కార్మికులు, ప్రయాణికుల రక్తాన్ని తాగుతున్నాయని, వీటికి ప్రత్యామ్నాయంగా యాప్ తయారు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ



మహిళలతో మాట్లాడుతున్న నారా లోకేష్

ఇసుకాసురుల భరతం పడతాం

- 'యువగళం' పాదయాత్రలో నారా లోకేష్

ప్రజాశక్తి - చిట్టమూరు (తిరుపతి జిల్లా)

'టిడిపి అధికారంలోకి రాగానే ఇసుకాసురుల భరతం పడతాం' అని యువనేత నారా లోకేష్ అన్నారు. నదులలో అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు జరిపి తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు తరలిస్తున్నారని ఆరోపించారు. దీంతో తీరప్రాంత ప్రజలు తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.

లోకేష్ చేపట్టిన పాదయాత్ర మంగళవారం 138వ రోజు గూడూరు నియోజకవర్గంలోని చిట్టమూరు మండలం గునపాటిపాలెంలోకి ప్రవేశించింది. నియోజకవర్గ ఇన్‌ఛార్జి పాశం సునీల్‌కుమార్, మండల కన్వీనర్ కిషోర్‌నాయుడు ఆధ్వర్యంలో లోకేష్‌కు అపూర్వ స్వాగతం లభించింది. నారా లోకేష్ చిత్రపటానికి క్రేన్‌తో పూల మాల వేసి డ్రోన్ సాయంతో పాలాభిషేకం చేశారు. గుణపాటిపాలెం మీదుగా పెళ్లకూరు, తిమ్మారెడ్డి వాగు, ఎల్లసిరి, తాడివేడు క్రాస్ రోడ్డు వద్ద రాత్రి విడిదికి చేరుకున్నారు. కొత్తగుంట రోడ్డుషోలో నారా లోకేష్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో ఇసుక దాహంతో లక్షలాది ప్రజల ప్రయోజనాలను పణంగా పెట్టారన్నారు. తాము అధికారంలోకి వస్తే ఆక్వా రైతులకు సబ్సిడీలు, ప్రోత్సాహకాలు అందించి ఆదుకుంటామన్నారు. దోబీలకు దోబీఘాట్ నిర్మిస్తామని, చేపల వేటలో గిరిజనులకూ అవకాశం కల్పిస్తామని విమర్శించారు. కలుజు సప్లై ఛానల్ వద్ద వంతెన నిర్మాణం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి నెలవల సుబ్రమణ్యం, మాజీ మంత్రి పరసా రత్నం పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను, ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయండి

- ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులు, ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వాన్ని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ కోరింది. ఈ మేరకు మంగళవారం అమరావతిలోని సచివాలయంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరి వై శ్రీలక్ష్మి, డైరెక్టరు కోటేశ్వరరావుకు ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు, నాయకులు ముత్యాలరాజు, పి వెంకటరెడ్డి, అప్పారావు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వంలోని కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసినట్లుగా మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను, ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టు ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలన్నారు. కార్మికులకు సంబంధించిన వేతనం, అలవెన్స్‌ల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. విధి నిర్వహణలో వుంటూ మృతిచెందిన కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. రాజధాని అమరావతి పరిధిలోని పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.



స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న కె ఉమామహేశ్వరరావు, వెంకటరెడ్డి తదితరులు

తూర్పు కాపుల అభివృద్ధికి కృషి

- రాజకీయాల్లో జవాబుదారీతనం ఉండాలి : జనసేన అధినేత పవన్ కల్యాణ్

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్రంలో తూర్పు కాపులు 46 లక్షల మంది ఉన్నారని ఆ సంఘం నేతలు చెబుతుంటే గత టిడిపి ప్రభుత్వం 26 లక్షల మంది ఉన్నారని, వైసిపి ప్రభుత్వం కేవలం 16 లక్షల మంది మాత్రమే ఉన్నారని లెక్కలు చూపుతున్నాయని, ఏ ప్రాతిపదికన ఈ లెక్కలు వేశారో చెప్పాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. 2024లో జనసేన అధికారంలోకి వస్తే కులగణాంకాలు తీస్తామని, బిసి గణాంకాలు ఎంతో విలువైనవని చెప్పారు. తూర్పు కాపులకు జనసేన అండగా ఉండి వారి అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. వారాహి యాత్రలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పెదఅమిరంలోని నిర్మల ఫంక్షన్ హాలులో తూర్పుకాపు సంఘం నేతలను పవన్ భేటీ అయ్యారు. ఆల్ ఇండియా తూర్పుకాపు సంక్షేమ సంఘం అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ ఆధ్వర్యంలో తూర్పు కాపు ముఖ్య నాయకులు పవన్ సమక్షంలో జనసేనలో చేరారు. తూర్పుకాపుల సమస్యలను వారు పవన్ దృష్టికి తీసుకొచ్చారు. ఉత్తరాంధ్ర మినహా ఇక ఎక్కడా తూర్పుకాపులకు ఒబిసి పత్రాలు ఇవ్వడం లేదన్నారు. ఆర్థిక బలం లేక 75 శాతం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. భీమవరం తనకు బలమైన జ్ఞాపకాలను ఇచ్చిందని, ప్రజా సమస్యలను తెలుసుకునే జనవాణి కార్యక్రమం ఇక్కడి నుంచే ప్రారంభించానని గుర్తు చేశారు. వంశధార ప్రాజెక్టు నిర్మాణానికి భూములు ఇచ్చిన నిర్వాసితులు ఎక్కువ మంది తూర్పు కాపులేనన్నారు. వారికి కనీసం నష్టపరిహారం కూడా ఇవ్వలేదని చెప్పడం బాధ కలిగించిందని తెలిపారు. వ్యవస్థలు సక్రమంగా పని చేయకపోవడం వల్లే న్యాయం కోసం కుల భావన బలంగా పెరిగిందన్నారు. బిసి గణాంకాలు విలువైనవని, ప్రస్తుతం వాటి అవసరం ఎంతో ఉందని చెప్పారు. రాజకీయాల్లో జవాబుదారీతనం రావాలని, దీనికి జనసేన కట్టుబడి ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్, జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు (చినబాబు), ముఖ్యనేత కనకరాజు సూరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న జనసేన అధినేత పవన్ కల్యాణ్

పవన్‌కు స్వల్ప అస్వస్థత

జనసేన అధినేత పవన్ కల్యాణ్ వారాహి యాత్రలో భాగంగా సోమవారం రాత్రి నరసాపురం నుంచి భీమవరం చేరుకున్నారు. అప్పటికే ఆయన కొంత అస్వస్థతకు గురైనట్లు సమాచారం. జ్వరతీవ్రత పెరగడంతో మంగళవారం ఉదయం కార్యక్రమాలను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. మధ్యాహ్నం నుంచి షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



నారాయణ కళాశాల వద్ద ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

'నారాయణ'లో పుస్తకాల వ్యాపారం

- ఎస్ఎఫ్ఐ ధర్నా - దాడికి యత్నం
- పుస్తకాలు, యూనిఫామ్ సీజ్ చేసిన ఆర్ఐ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ, విశాఖ

విశాఖపట్నం ఆశీలుమెట్టలో ఉన్న నారాయణ ఐఐటి అకాడమీ, నారాయణ జూనియర్ కాలేజీల్లో నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, యూనిఫామ్ విక్రయించడంపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన మంగళవారం ధర్నా నిర్వహించారు. ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులపై నారాయణ కాలేజీ ప్రతినిధులు దాడికి యత్నించారు. దీంతో ఎస్ఎఫ్ఐ నాయకులు ఇంటర్ బోర్డు ఆర్ఐఒ ఆర్.సత్యనారాయణకు ఫోన్ ద్వారా సమాచారమందించారు. దీనిపై స్పందించిన ఆర్ఐఒ ఘటనా స్థలానికి చేరుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అనధికారంగా విక్రయిస్తున్న స్కూల్ యూనిఫాం, నారాయణ పేరుతో ముద్రించిన స్టడీ మెటీరియల్‌ను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆర్ఐఒ మీడియాతో మాట్లాడుతూ.. నారాయణ కళాశాలలో బాలుర యూనిఫాం రూ.1,500, బాలికల యూనిఫాం రూ.1700కు విక్రయిస్తున్నారని, ఐఐటి స్టడీ మెటీరియల్‌కు రూ.12 వేలు వసూలు చేస్తున్నారని తెలిపారు. దీనిపై విశాఖపట్నం జిల్లా కలెక్టర్‌కు, విద్యాశాఖ కమిషనర్‌కు నివేదిక అందిస్తామని, వారి నుంచి ఆదేశాలు వచ్చే వరకు యూనిఫాం, స్టడీ మెటీరియల్‌ను సీజ్ చేసి ఉంచుతున్నామని పేర్కొన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేట్, ప్రయివేటు విద్యా సంస్థలు ఇష్టానుసారంగా యూనిఫాం, షూ, పుస్తకాలను విక్రయిస్తూ పెద్దఎత్తున వ్యాపారం చేస్తున్నాయన్నారు. జిల్లాలోని శ్రీచైతన్య, నారాయణ, ఫిట్జీ, తిరుమల, శ్రీవిశ్వ, భాష్యం, రవీంద్రభారతి, పెన్ స్కూల్, విజ్ఞాన్, గాయత్రి, ఆకాష్, పొలాక్స్, లిటిలేంజిల్స్, హరగోపాల్, వాగ్దేవి, బివికె, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ తదితర పాఠశాలలు, కళాశాలల్లోనూ ఈ వ్యాపారం సాగుతోందని, ప్రభుత్వ అధికారులు తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జి.అజయ్, ఎయు కార్యదర్శి పి.సూర్య, తులసీరాం, ఆజయ్, సాయితేజ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌కు ఎక్సలెన్స్ ఇన్ కాస్ట్ మేనేజ్‌మెంట్‌లో నేషనల్ అవార్డు

ప్రజాశక్తి-విశాఖపట్నం

ఖర్చు నిర్వహణలో అత్యుత్తమ చర్యలకు గాను 18వ జాతీయ అవార్డులు-2022కు సంబంధించి నేషనల్ అవార్డు ఫర్ ఎక్సలెన్స్ ఇన్ కాస్ట్ మేనేజ్‌మెంట్‌లో విశాఖ స్టీల్‌ప్లాంట్ మొదటి స్థానాన్ని గెలుచుకుంది. అనేక వ్యయ తగ్గింపు కార్యక్రమాలు, వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం, టెక్నో-ఎకనామిక్స్‌ను మెరుగుపరచడం, ఉత్తమ వ్యయ నిర్వహణ పద్ధతులను అమలు చేసినందుకు గుర్తింపుగా ఈ అవార్డును అందిస్తారు. ఈ అవార్డును ఈ నెల 23న న్యూ ఢిల్లీలో భారత కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సంజయ్ బహ్ల్ నుంచి స్టీల్‌ప్లాంట్ సిజిఎం వి.శాంతకుమార్, డిజిఎం డి.చిన్నారావు అందుకున్నారు. జాతీయ స్థాయిలో మొదటి బహుమతిని గెలుచుకున్నందుకు విశాఖ స్టీల్‌ప్లాంట్ సిబ్బందిని సిఎండి అతుల్‌భట్ అభినందించారు. 2019లో "తయారీ -పబ్లిక్ - మెగా కేటగిరీ" కింద విశాఖ స్టీల్‌ప్లాంట్ మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది.



అవార్డుతో విశాఖ స్టీల్‌ప్లాంట్ సిఎమ్‌డి అతుల్‌భట్ తదితరులు



దీక్షా శిబిరంలో స్టీల్‌ప్లాంట్ కార్మికులకు సంఘీభావం తెలుపుతున్న టిడిపి నాయకులు

ఉక్కు కార్మికులకు టిడిపి నేతల సంఘీభావం

ప్రజాశక్తి-ఉక్కునగరం, విశాఖ

విశాఖ ఉక్కు కార్మికుల దీక్షా శిబిరాన్ని టిడిపి నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 866వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్, కనస్ట్రక్షన్, ఆర్ఎండి విభాగాల కార్మికులు కూర్చున్నారు. భవిష్యత్తు గ్యారంటీ యాత్రలో భాగంగా పాతగాజువాక జంక్షన్ నుంచి టిడిపి మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని దీక్ష శిబిరం వద్దకు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. శిబిరంలో కూర్చుని కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ.. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ప్రకటన సమయంలో మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తొమ్మిది రోజుల పాటు నిరవధిక నిరాహారదీక్ష చేశారని గుర్తుచేశారు. చంద్రబాబు హామీ మేరకు దీక్ష విరమించారని తెలిపారు. భవిష్యత్తులోనూ ఉక్కు కార్మికుల పోరాటానికి టిడిపి మద్దతు ఉంటుందన్నారు.



అంగన్‌వాడీల పోరుయాత్రలో మాట్లాడుతున్న జి.బేబిరాణి

సమస్యలు పరిష్కరించకపోతే సర్కారుకు గుణపాఠం

- అంగన్‌వాడీల పోరు యాత్రలో బేబిరాణి

ప్రజాశక్తి - గోకవరం(తూర్పుగోదావరి)

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించకపోతే వచ్చే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జి.బేబిరాణి హెచ్చరించారు. యూనియన్ ఆధ్వర్యంలో తూర్పు గోదావరి జిల్లాలో చేపట్టిన అంగన్‌వాడీల పోరుయాత్ర 2వ రోజైన మంగళవారం గోకవరం చేరుకుంది. ఈ సందర్భంగా గోకవరం దేవీచౌక్ సెంటర్ వద్ద నిర్వహించిన సభలో బేబిరాణి పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయన్నారు. అందులో భాగంగానే నూతన విద్యా విధానం పేరుతో అంగన్‌వాడీ కేంద్రాలను పాఠశాలల్లో విలీనం చేస్తున్నారని, ఐసిడిఎస్‌కి బడ్జెట్‌లో నిధులు తగ్గిస్తున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను జగన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, వేతనంతో కూడిన మెటర్నిటీ లీవ్‌లు ఇవ్వాలని, వేతనంలో సగం పెన్షన్‌గా అందించాలని కోరారు. ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. యాప్‌ల పేరుతో పనిభారం పెంచడం సరికాదన్నారు. ఈ సమస్యలను పరిష్కరించకుంటే సర్కారుకు గుణపాఠం తప్పదన్నారు. ఈ యాత్రకు మద్దతుగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, జిల్లా అధ్యక్షులు ఎం.సుందరబాబు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.మాణిక్యాంబ, కె.బేబిరాణి, జిల్లా ఉపాధ్యక్షులు అన్నపూర్ణ పాల్గొన్నారు.

నాలుగేళ్ల వైసిపి పాలనలో దాడులూ, దౌర్జన్యాలే..

- మాలల ఆత్మీయ సమావేశంలో అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి నాలుగేళ్ల పాలనలో మాలలపై దాడులు, దౌర్జన్యాలు పెరిగిపోయాయని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. అందరూ ఏకతాటిపైకి రావాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్‌ను సిఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్వీర్యం చేశారని విమర్శించారు. మంగళగిరిలోని టిడిపి కార్యాలయంలో మంగళవారం మాజీ మంత్రి నక్కా ఆనందబాబు అధ్యక్షతన టిడిపి మాలల ఆత్మీయ సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని మాల పల్లెలన్నీ తిరిగి జాతిని చైతన్యం చేయాలని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే బాధ్యత టిడిపి తీసుకుంటుందన్నారు. అంబేద్కర్ విదేశీ విద్య పేరు మార్చి జగన్ తన పేరు పెట్టుకోవడానికి సిగ్గుగా లేదా? అని ఆయన ప్రశ్నించారు. అంబేద్కర్ పేరు మార్చినప్పుడు దళిత సంఘాలు ఏమయ్యాయన్నారు. శాసనసభ మాజీ స్పీకరు ప్రతిభా భారతి మాట్లాడుతూ.. ఎన్‌టిఆర్ ప్రభుత్వంలోనూ, చంద్రబాబు కేబినెట్‌లోనూ మంత్రిగా చేశానన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చే వరకూ మాలలందరూ పోరాటం చేయాలన్నారు. ఈ సమావేశంలో నక్కా ఆనందబాబు, తెనాలి శ్రావణ్‌కుమార్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర జిడిపిలో సిఐఐ పాత్రను మరింత పెంచుతాం

- ఎపి సిఐఐ ఛైర్మన్ లక్ష్మీప్రసాద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దేశ జిడిపి పెంచడంలో కీలకపాత్ర పోషించినట్లే రాష్ట్ర జిడిపి పెంచడంలో కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) ఆంధ్రప్రదేశ్ విభాగం కృషి చేస్తుందని ఎపి సిఐఐ ఛైర్మన్ ఎం లక్ష్మీప్రసాద్ తెలిపారు. విజయవాడలో ఆయన సిఐఐ వైస్ ఛైర్మన్ వి మురళీకృష్ణ, విజయవాడ జోన్ ఛైర్మన్ దాసరి రామకృష్ణ, వైస్ ఛైర్మన్ డివి రవీంద్రనాథ్, బి శ్రీనివాస్ సతీష్‌తో కలిసి మంగళవారం మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ రూపకల్పనలో సిఐఐ నుంచి ఎన్నో సూచనలను తీసుకుంటుందని తెలిపారు. దేశవ్యాప్తంగా సిఐఐకి 9 వేల సభ్యత్వం వుందన్నారు. దేశం జిడిపిలో 30 శాతం వాటా దక్షిణాదిన ఐదు రాష్ట్రాల వాటాగా వుందని తెలిపారు. వ్యవసాయం, సముద్ర ఉత్పత్తులతో దేశవ్యాప్త సగటు జిడిపి కంటే ఆంధ్రప్రదేశ్‌లో ఎక్కువగా వుందన్నారు. ఆహార పంటలు, తృణధాన్యాలను పండించడంలో రాష్ట్రం ముందంజలో వుందని పేర్కొన్నారు. రాష్ట్ర అవసరాలకు సంబంధించి వంటనూనెలకు ఎక్కువగా దిగుమతులపై ఆధారపడుతున్నామని, మిగిలిన ఉత్పత్తుల్లో ఎగుమతులు ఆశాజనకంగా వున్నాయని అన్నారు. అలాగే విద్యారంగంలో మార్పులు అవసరమని అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం బాగా అందుబాటులోకి వచ్చాక ఉత్పత్తి గణనీయంగా పెరుగుతోందన్నారు. విశాఖపట్నంలో 2018లో ఏర్పాటు చేసిన మెడ్‌టెక్ జోన్‌లో వైద్యరంగానికి అవసరమైన ఎక్విప్‌మెంట్ చౌకగా ఇక్కడే లభిస్తోందని తెలిపారు. తిరుపతిలో ఉత్పాదక రంగంలో, విజయవాడ కేంద్రంలా వ్యవసాయ ఉత్పత్తుల పరంగా మెరుగైన ఫలితాలు వస్తున్నాయని చెప్పారు. రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి కోసం సిఐఐ కూడా తన వంతు కృషి చేస్తుందని తెలిపారు.

పోరుయాత్రకు విశాల మద్దతు

మొదటి పేజీ తరువాయి

విజయవాడలో జరిగే మహా ధర్నాకు అందరూ తరలిరావాలని, అప్పుడే భావితరాలకు న్యాయం జరుగుతుందని అన్నారు.

నిర్వాసితుల సమస్యలపై రాజకీయాలకతీతంగా పోరాటం : మాజీ ఎంఎల్ఎ చందా లింగయ్య

ఈ సభలో మాజీ ఎంఎల్ఎ చందా లింగయ్య మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరూ నిర్వాసితుల సమస్యలపై పోరాడాలని కోరారు. 2013 భూ సేకరణ చట్టప్రకారం పరిహారం, భూమికి భూమి, ప్రతి కుటుంబానికీ ఉద్యోగం, ఇల్లు, పునరావాస ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వానికి నిర్వాసితుల సమస్యలు పట్టడం లేదు : టిడిపి, జనసేన పార్టీ నాయకులు

వైసిపి ప్రభుత్వం పోలవరం నిర్వాసితుల గురించి కనీసం పట్టించుకోవడం లేదని, గతేడాది వరద పరిహారం ఇప్పటికీ ఇవ్వలేదని అన్నారు. పార్టీలకతీతంగా అంతా కలిసికట్టుగా పోరాడాలని పాదయాత్రకు తాము పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని టిడిపి కుక్కునూరు మండల అధ్యక్షులు ఎం.నాగు, జనసేన మండల అధ్యక్షులు మలిశెట్టి యుగంధర్, సిపిఐ నాయకులు కె.లక్ష్మయ్య పేర్కొన్నారు. కుక్కునూరు బహిరంగ సభలో వారు మాట్లాడుతూ సిఎం జగన్ నిర్వాసితుల పరిహారంపై బటన్ నొక్కి న్యాయం చేయాలని, రోడ్లు, ఆస్పత్రులు వంటి వాటిని అభివృద్ధి చేయాలని కోరారు. వైసిపి ఎంఎల్ఎ తెల్లం బాలరాజు నిర్వాసితులను కనీసం పట్టించుకోవడం లేదని విమర్శించారు.

ప్రతిపైసా పునరావాసానికే కేటాయించాలి

- 37 మీటర్లకే మునిగే గ్రామాలూ 45.72 కాంటూరులో
- కేంద్ర ప్రాజెక్టు పోలవరంపై మోడీ బాధ్యతా రాహిత్యం : వి శ్రీనివాసరావు



కుక్కునూరులో వి శ్రీనివాసరావుకి బొట్టు పెట్టి స్వాగతం పలుకుతున్న మహిళ

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి, కుక్కునూరు, బుట్టాయగూడెం

పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ముందుగా ప్రతి పైసా పునరావాసానికే ఖర్చు చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండాగా ఈ నెల 20న అల్లూరి సీతారామరాజు జిల్లా నెల్లిపాకలో ప్రారంభమైన పోలవరం పోరుకేక మహా పాదయాత్ర ఎనిమిదో రోజు మంగళవారం ఏలూరు జిల్లా కుక్కునూరు, జీలుగుమిల్లి మండలాల్లో కొనసాగింది. ఉదయం కుక్కునూరు మండలం దాచారం గ్రామంలో ప్రారంభమై కుక్కునూరు చేరుకుంది. అనంతరం ఆ గ్రామంలో సిపిఎం మండల కార్యదర్శి వై.నాగేంద్రరావు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ గతేడాది జులైలో వరదల సమయంలో తాను ఇక్కడకు వచ్చానని, గోదావరి వరద బాధితులకు తాగునీరు అందించడంలో కూడా ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఆ సమయంలో ఇళ్లు ఖాళీ చేసి పునరావాస కాలనీలకు వెళ్లినవారిలో చాలామంది ఇప్పటికే అక్కడే ఉన్నారని తెలిపారు. వరదలకు ఇళ్లు కోల్పోవడంతో వాటిని నిర్మించుకొనే ఆర్థిక పరిస్థితిలేక ఇక్కడకు వచ్చే పరిస్థితి లేకుండాపోయిందన్నారు. 37 మీటర్లకు మునిగిపోయే గ్రామాలను 45.72 కాంటూరులో చేర్చడం నిర్వాసితులకు తీవ్ర అన్యాయం చేయడమేనని తెలిపారు. పోలవరం నిర్వాసిత కాలనీల్లో కనీస వసతులు కరవయ్యాయన్నారు. పోలవరం ప్రాజెక్టు ముంపుపై పనికిమాలిన లెక్కలు చెబుతున్నారని విమర్శించారు. పునరావాస గ్రామాలేవో ఇప్పటికీ తెలియని పరిస్థితి ఉందన్నారు. వివాదాస్పద భూములు, రాళ్ల, రప్పలు, రికార్డుల్లోలేని భూములను నిర్వాసితులకు ప్రభుత్వం ఇచ్చిందని, వీటివల్ల ఎటువంటి ఉపయోగమూ లేదని తెలిపారు. ప్రాజెక్టు కట్టడం వల్లే వర్షాలకు గ్రామాలు మునిగిపోయాయన్నారు. సిపిఎంతోసహా అనేక ప్రజాసంఘాలు వరద బాధితులకు అండగా నిలిచాయని గుర్తు చేశారు. ప్రభుత్వం మాత్రం సరిగా పట్టించుకోలేదని విమర్శించారు. మళ్లీ వరదలు రానున్నాయని తెలిపారు. ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు చేపట్టకపోతే ఈసారి ప్రజలు క్షమించబోరని హెచ్చరించారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు అని, దీనిపై ప్రధాని మోడీ బాధ్యతా రాహిత్యంగా వ్యవహరిస్తున్నారని వి.శ్రీనివాసరావు దుయ్యబట్టారు. కేంద్రం మెడలు వంచాల్సిన రాష్ట్ర ప్రభుత్వం లొంగిపోతోందని, కేసులు మాఫీ చేస్తాం తప్ప, నిధులు ఇచ్చేదిక లేదన్నట్లు కేంద్ర ప్రభుత్వ పెద్దలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇప్పటికే పదేళ్లు కావొస్తోందని, ప్రభుత్వం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా పునరావాసానికే ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి పార్టీలకతీతంగా అందరూ ఏకతాటిపైకి వచ్చి పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే నెల నాలుగో తేదీన విజయవాడలో మహా ధర్నా జరగనుందని, అప్పటికీ ప్రభుత్వం దిగిరాకపోతే భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ప్రతి గ్రామాన్నీ సమర క్షేత్రంగా మారుస్తామన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ పోలవరంలో ముంపునకు గురవుతున్న ఎనిమిది మండలాల్లో దాదాపు లక్షా ఐదు వేల కుటుంబాలు నిర్వాసితులవుతున్నాయని తెలిపారు. వారికి భూమికి భూమి, 18 ఏళ్లు నిండిన వారికి పునరావాస పరిహారం, వ్యవసాయ కార్మికులకు ప్యాకేజీ, కుటుంబానికో ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీటి గురించి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాచన్నగూడెం పోరాటాల గడ్డని, నిర్వాసితులకు అండగా నిలవాలని కోరారు. గతేడాది వచ్చిన గోదావరి వరద మోడీ, జగన్ తెచ్చిందేనని విమర్శించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.రమాదేవి మాట్లాడుతూ పోలవరం పోరుకేక పాదయాత్ర నిర్వాసితులు బతికేందుకు దారి చూపాలని కోరుతోంది. ప్రాజెక్టు బాధ్యత మాదని చెప్పిన కేంద్రం పూర్తిగా నిధులివ్వడం లేదని, అయినా, రాష్ట్ర ప్రభుత్వం అడగలేని స్థితిలో లేదని అన్నారు. 90 శాతం హామీలు అమలు చేశామని చెబుతున్న జగన్... ముంపు మండలాల పరిస్థితి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాస్, పినపాక మాజీ ఎమ్మెల్యే, ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ చందా లింగయ్యదొర, పలువురు టిడిపి, జనసేన నాయకులు పాల్గొని ప్రసంగించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి, మంతెన సీతారాం, వి.వెంకటేశ్వరరావు, కె.లోక్‌నాథం, ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు ప్రభావతి, సిపిఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి. నేతలు తెల్లం రామకృష్ణ, నాగమణి, డిఎన్‌విడి.ప్రసాద్, గుడిపాటి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పలువురు నిర్వాసితులు మహా పాదయాత్ర బృందానికి తమగోడు వెల్లబోసుకున్నారు. వాటి పరిష్కారానికి కృషి చేయాలని నాయకులను కోరారు.



ఉత్సాహంగా ముందుకు సాగుతున్న మహా పాదయాత్ర

మునిగిపోయినా ముంపులో లేవంటున్నారు



గత వరదలకు మా గ్రామం మొత్తం మునిగిపోయింది. ఇక్కడ 60 గిరిజన కుటుంబాలు ఉన్నాయి. మా గ్రామం ముంపులో లేదంటున్నారు. పరిహారం రాదని చెబుతున్నారు. మాకు న్యాయం చేయండి.

-సున్నం సీత, నల్లకుంట గ్రామం, కుక్కునూరు మండలం

ఇళ్లు కూలినా సాయం అందలేదు



గత వరదలకు ఇల్లు పడిపోయింది. ఒక్క రూపాయి సాయం అందించలేదు. వరదలకు గ్రామంలో ఐదు అడుగుల మేర నీళ్లు వచ్చాయి. కానీ ముంపులో లేదంటున్నారు. మా పరిస్థితి అయోమయంగా తయారైంది.

-కె.అర్జున్, వనజావారిగుంపు గ్రామం, కుక్కునూరు మండలం



కుక్కునూరులో బహిరంగ సభ వద్ద కళాకారుల ప్రదర్శన

పోలవరం నిర్వాసితులకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలి

- నష్ట పరిహారం ఇవ్వాలి
- సిఎంకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పోలవరం ముంపు గ్రామాల ప్రజలకు నష్టపరిహారం చెల్లించాలని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను యథావిధిగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు కోరారు. ఈ నెల 20 నుంచి ముంపు గ్రామాల్లో స్వయంగా పాదయాత్ర నిర్వహిస్తున్న ఆయన 24, 25 తేదీల్లో చింతూరు మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన దృష్టికి వచ్చిన అనేక అంశాలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంగళవారం లేఖ రాశారు.

చింతూరు మండల పరిధిలోని గ్రామాల ప్రజల్లో తీవ్రమైన ఆందోళన ఉందని, ఏది ముంపు గ్రామం, ఏది కాదు అనే విషయంలో స్పష్టత లేదని పేర్కొన్నారు. చింతూరు మండలంలో 45 కాంటూరులో ఉన్న ఐదు గ్రామాలను మొదట ప్రాధాన్యత గ్రామాల్లో చేర్చారని, 2022 జులై నెలలో వచ్చిన వరదల్లో మునిగిన 22 గ్రామాలను కూడా 41.15 కాంటూరులో చేర్చి తక్షణమే 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం ఇవ్వాలని, పునరావాసం కల్పించాలని కోరారు. మొదటి ప్రాధాన్యత గ్రామాలు అని చెప్పిన చోట్ల మూడు ఆప్షన్లు ఇచ్చి వాటి ప్రకారం ఇల్లు లేదా ఇంటి స్థలము లేదా నగదు మొత్తం రూ.3.75 లక్షలు విలువచేసే ప్యాకేజీ ప్రకటిస్తున్నారని, ఇది అన్యాయమని తెలిపారు. పునరావాసం కోసం రూ.10 లక్షలు ఇస్తామని చేసిన ప్రకటన ఇంత వరకు అమలు కాలేదని పేర్కొన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ఆర్‌ఆర్ ప్యాకేజీ కింద ప్రతి కుటుంబానికి రూ.15 లక్షలు ఇవ్వాలని, దానితోపాటు ఇంటికి ఇల్లు, భూమికి భూమి కల్పించాలని కోరారు. ఈ ప్రాంతంలో గిరిజనుల అభివృద్ధి కోసం ఐటిడిఎ ఉన్నప్పటికీ ఒక ఐఎఎస్ అధికారిని కూడా ఇంతవరకు పిఒగా నియమించలేదని, నియమించిన వారినీ తరచుగా మారుస్తుండటం వల్ల ఈ ప్రాంత అభివృద్ధి దెబ్బతింటున్నదని వివరించారు. గత సంవత్సరం వచ్చిన వరదల్లో ప్రజలు పడ్డ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈసారి వరదల కన్నా ముందే గ్రామస్తులను అలర్ట్ చేయాలని, చాటింపు వేయించాలని, వరదలు వచ్చినప్పుడు ప్రభావితమయ్యే కుటుంబాలు సామాన్లను ప్రభుత్వమే తరలించాలని కోరారు. ముఖ్యంగా వరద సహాయక పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడంతోపాటు టార్పాలిన్, కిరోసిన్ కొవ్వొత్తులు, ఆహార ధాన్యాలు, నిత్యవసర వస్తువులను ముందుగానే స్టాక్ పెట్టుకొని వెంటనే సహాయం అందేటట్లు చూడాలని విజ్ఞప్తి చేశారు. మండలంలో చట్టి నుండి సింగన్నగూడెం, తులసిపాక నుండి కొండపల్లి, అల్లిగూడెం నుండి సూరన్నకు, మేకవారిగూడెం నుండి బురదగూడెం వరకు రహదారులు వేయాల్సిన అవసరం ఉందని వివరించారు.

మునక ప్రాంతాల పేరుతో అభివృద్ధి కార్యక్రమాలను, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం లేదని, గత సంవత్సరం పడిపోయిన ఇళ్లు ఇప్పటికే పూర్తిగా పునరుద్ధరించుకోలేని స్థితిలో ప్రజలున్నారని వివరించారు. పడిపోయిన ఇంటికి రూ.10,000 ఇస్తామని చేసిన వాగ్దానం 10-15 శాతం మాత్రమే అమలైందని 85 నుండి 90 శాతం మంది ప్రజలకు ఇప్పటికీ ఎటువంటి సహాయమూ అందలేదని పేర్కొన్నారు. రాబోయే వరదలను దృష్టిలో పెట్టుకుని ముందస్తు సహాయ చర్యలు చేపట్టాలని, మునిగిపోనున్న గ్రామాలకు తక్షణ సహాయం అందించేందుకు సన్నాహాలు చేయాలని, 2013 పునరావాస చట్టం ప్రకారం కాంటూరుతో నిమిత్తం లేకుండా గత వరదల్లో మునిగిన గ్రామాలన్నిటికీ కల్పించాలని సిఎంను కోరారు. తక్షణమే స్పందించి ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చర్యలు చేపడతారని ఆశిస్తున్నట్లు లేఖలో పేర్కొన్నారు.

బిల్డింగ్ బైలా మార్చేయండి

- 50 శాతమే ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయాలి
- సంస్కరణలపై కేంద్రం మార్గదర్శకాలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

బిల్డింగ్ బైలా మార్చేయాలని రాష్ట్రాలకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. స్వల్ప ఆర్థిక సాయానికే రాష్ట్రాలపై పెత్తనం చేసేలా కేంద్ర విధానాలు పెరిగిపోతున్నాయి. వంద కోట్ల రూపాయల సాయానికే వేల కోట్ల విలువైన కార్యక్రమాలు చేయాలంటూ ఆంక్షలు విధిస్తోంది. రూ.50 కోట్ల సాయానికే ఏకంగా 20 శాతం ఆస్తి పన్నును పెంచాలంటూ ఇటీవలే నిర్దేశించిన కేంద్రం తాజాగా వంద కోట్ల సాయానికి పట్టణాల్లో భారీ సంస్కరణలు చేయాలంటూ మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ తాజా మార్గదర్శకాల్లో కేంద్రం చేసిన సూచనలకు రూ.వేల కోట్లు కావాల్సి ఉంటుందని రాష్ట్ర అధికారులే అంటున్నారు. టౌన్ ప్లానింగ్, ల్యాండ్ పూలింగ్, భవనాల బైలాస్‌ను ఆధునీక'రించడం, పర్యావరణ సిస్టమ్స్‌పై దృష్టి పెట్టడం వంటి చర్యలు ఈ నిధులతో చేపట్టాల్సి ఉంటుంది. ఈ ఏడాదికి కేటాయించే నిధులను 2024 జనవరి 15లోగా వ్యయం చేయాల్సి ఉంటుంది.

పోస్టులపై ఆంక్షలు

ఈ మార్గదర్శకాల్లో పోస్టుల భర్తీపైనా కేంద్రం ఆంక్షలు విధించింది. సంస్కరణలు అమలు చేసే ప్రాంతాల్లో అనుమతి పొందిన పోస్టుల్లో ఖాళీగా ఉన్న వాటిని 50 శాతమే భర్తీ చేయాలని నిర్దేశించింది. ఈ నిబంధన అమలు చేస్తే ప్రోత్సాహకాలు వర్తిస్తాయని కేంద్రం పేర్కొంది. టౌన్ ప్లానర్లను కాంట్రాక్టు విధానంలో నియమించుకుని పనిచేయించుకున్నా కొంత పారితోషికాన్ని ఇవ్వనున్నట్లు పేర్కొంది. ఇందులో గ్రూప్-2లో 25 మంది ప్లానర్ల వరకు అవకాశమిస్తున్నట్లు తెలిపింది. ఈ రంగంలో నిపుణులను ప్రైవేటు రంగం నుంచి కూడా నియమించుకోవచ్చునని పేర్కొంది. ఇక టౌన్‌షిప్ పాలసీలు తయారు చేసుకోవాలని, పనులకు కావాల్సిన భూమిని కూడా సమీకరించుకోవాలని సూచించింది. అలాగే మురికివాడల అభివృద్ధి పేరుతో అక్కడున్నవారిని గుర్తించి, వారిని తరిమికొట్టే ప్రయత్నానికి రాష్ట్రాల సహకారంతో కేంద్రం పూనుకుంటోంది. ఇందులో భాగంగానే మురికివాడల్లో నోటిఫికేషన్ ఇవ్వాలని, అభివృద్ధి చేసే సంస్థలను టెండర్ల ద్వారా ఖరారు చేయాలని ఆదేశాలిచ్చింది. స్వల్ప సాయానికి గానూ రాష్ట్రాల్లోని నగరాలు, అభివృద్ధి కార్యక్రమాలపై కేంద్రం పట్టు పెంచుకునేందుకు ప్రయత్నిస్తోందన్న భావనను పలువురు వ్యక్తపరుస్తున్నారు.

విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం

- పేదలకు అందుబాటులో మెరుగైన వైద్యం : మంత్రి రజని



ఆస్పత్రి భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి విడదల రజని

ప్రజాశక్తి-ఉక్కునగరం, విశాఖ

విద్య, వైద్య రంగాలకు ఈ ప్రభుత్వం ఎంతగానో ప్రాధాన్యతనిస్తోందని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, వైద్య విద్య శాఖ మంత్రి విడదల రజని అన్నారు. విశాఖ జిల్లా గాజువాక మండల పరిధి జివిఎంసి 87వ వార్డు కణితి ఆర్‌హెచ్ కాలనీలో రూ.1.75 కోట్లతో నిర్మించిన డాక్టర్ వైఎస్ఆర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రజని మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో గ్రామం నుంచి టీచింగ్ ఆస్పత్రి వరకు అన్ని స్థాయిల్లో అద్భుతంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఈ ఆస్పత్రిలో ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు విధుల్లో ఉంటారని, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు, అటెండర్లు కాకుండా మొత్తం 14 మంది వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఇక్కడ 215 మందులు, 65 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తారని, 24 గంటలూ సేవలు అందిస్తుందని చెప్పారు. రాష్ట్రం మొత్తం మీద 1125 పిహెచ్‌సిల ఆధునీకరణ, నూతన భవనాల నిర్మాణం కోసం రూ.670 కోట్లు ఖర్చు చేశామన్నారు. జివిఎంసి మేయర్ గొలగాని హరి వెంకట కుమారి మాట్లాడుతూ, అన్ని వార్డులలో ప్రజలందరికీ వైద్యం అందించేందుకు పట్టణ ఆరోగ్య కేంద్రాలు నిర్మించినట్లు తెలిపారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ ఈ ఆరోగ్య కేంద్రాలు కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ఉన్నాయని, ప్రజలందరూ వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ ఎ మల్లికార్జున, డిఎం అండ్ హెచ్ఒ జగదీశ్వరరావు, ఆర్ అండ్ బి ఎస్ఇ కాంతిమతి పాల్గొన్నారు.

రాష్ట్రంలో కొత్తగా మూడు బిసి గురుకుల జూనియర్ కళాశాలలు

- ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతుల నిర్వహణకు కసరత్తు

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

రాష్ట్రంలో అదనంగా మరో మూడు కొత్త మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల గురుకులా జూనియర్ కళాశాలలకు ఇటీవల ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీటిల్లో రెండు బాలురు కోసం కాగా ఒకటి బాలికల కోసం. నంద్యాల జిల్లా డోన్ నియోజక వర్గం బేతంచర్ల, చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం నదుంలో బాలురు జూనియర్ కళాశాలలు, శ్రీకాకుళం జిల్లా ఆముదాలవలసలో బాలికల జూనియర్ కాలేజీని ఏర్పాటు చేసేందుకు అనుమతులు జారీ చేశారు. ఈ కళాశాలల్లో తొలుత ఎంపిసి, బైపిసి గ్రూపులను ఏర్పాటు చేయనున్నారు. కళాశాలకు మొత్తం 80 సీట్లను అనుమతించారు. వీటిల్లో ఎంపిసికి 40, బైపిసికి మరో 40 సీట్లు కేటాయించనున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచే ఈ మూడు కళాశాలలు అందుబాటులోకి రానున్నాయి. త్వరలో తరగతులు కూడా ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించిన విద్యార్థుల ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే వీటిని అద్దె భవనాల్లో నిర్వహించనున్నారు.

ప్రజల ఐక్యతను దెబ్బతీస్తున్న బిజెపి

- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్

ప్రజాశక్తి -బద్వేలు (కడప జిల్లా)

దేశంలో బిజెపి తన ప్రతిష్టను క్రమక్రమంగా కోల్పోతోందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ అన్నారు. కడప జిల్లా బద్వేలు పట్టణంలోని సుందరయ్య భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ ప్రజలలో ఐక్యతను దెబ్బతీసేలా బిజెపి నాయకుల మాటలు, పరిపాలన తీరు ఉన్నాయన్నారు. ఇలానే కొనసాగితే భవిష్యత్తులో బిజెపి తన ప్రతిష్టను క్రమక్రమంగా కోల్పోయి దేశంలో అధికారం కోల్పోనుందని పేర్కొన్నారు.

మైనార్టీలను, క్రైస్తవులను వ్యతిరేకిస్తూ పోతే కర్ణాటక రాష్ట్రంలో ఓడిపోయినట్లుగానే ఇతర రాష్ట్రాలలోనూ బిజెపి ఓడిపోతుందన్నారు. విభజన హామీలలోని ప్రత్యేక హోదా, రైల్వే జోన్, కడప ఉక్కు పరిశ్రమ, పోలవరం ప్రాజెక్టు లాంటివి ఏ ఒక్కటీ పూర్తి చేయలేదన్నారు. అలాంటి బిజెపికి రాష్ట్రంలోని టిడిపి, వైసిపి, జనసేన మద్దతుగా నిలబడడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. ఈ మూడు పార్టీలూ సొంత ప్రయోజనాల కోసం రాష్ట్రాభివృద్ధిని తాకట్టు పెట్టాయని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాలను గాలి కొదిలేశారని, భవిష్యత్ తరాలు వీరిని క్షమించవని అన్నారు. తెలంగాణతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాలలో వెనుకబడి ఉందని తెలిపారు. రాబోయే కాలంలో సిపిఎం ఆధ్వర్యంలో పోరాటాలు, ఉద్యమాలు చేస్తామన్నారు. కేంద్రంలో బిజెపి ఏ ఒక్క నిర్ణయం సొంతంగా తీసుకోలేదని, నిర్ణయాధికారం మొత్తం ఆర్‌ఎస్ఎస్ ఆధీనంలో ఉందని విమర్శించారు.

రాజకీయ నాయకులు, ప్రజలు దేశ, రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా బిజెపి పరిపాలనను వ్యతిరేకించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఐఎన్ సుబ్బమ్మ పాల్గొన్నారు.

చింతలూరు యువకుడు మృతిపై సమగ్ర విచారణ

- చంద్రబాబు డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తూర్పుగోదావరి జిల్లా చింతలూరు యువకుడు మృతిపై సమగ్ర విచారణ జరపాలని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ట్విట్టర్‌లో పోస్టు చేశారు. రెండు రోజుల క్రితం అనుమానాస్పద స్థితిలో శ్యామ్ అనే యువకుడు మరణించాడని, ఆయన మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆయన మృతిపై వైసిపి నేతల ప్రమేయం ఉందనే వాదన కూడా వినిపిస్తోందన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కడప జిల్లా ప్రొద్దుటూరులోని శ్రీ రాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో పాలిటెక్నిక్ తృతీయ సంవత్సరం చదువుతున్న సానియా ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. కడప నగర శివారులోని ఆలంఖాన్‌పల్లెకు చెందిన సానియా మంగళవారం ఉదయం కళాశాల భవనం రెండో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు ప్రయత్నించారు.తీవ్ర గాయాలవ్వడంతో కడప ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. విద్యార్థినికి వైద్య ఖర్చులు పూర్తిగా కాలేజీ యాజమాన్యం భరించాలని, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సునీల్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, ఆర్ఎస్ఒ అధ్యక్షులు జగన్ డిమాండ్ చేశారు.

టిటిడి ఇఒపై బిజెపికి ఎందుకంత ప్రేమ

- శ్రీవాణి ట్రస్ట్ కుంభకోణంలో సోముకు వాటా అందిందా? : జనసేన

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

టిటిడి నిర్వహిస్తున్న శ్రీవాణి ట్రస్ట్ లావాదేవీల్లో భారీ కుంభకోణం దాగి ఉందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ విమర్శించిన నేపథ్యంలో శ్రీవాణి ట్రస్టు విషయంలో ఎటువంటి తప్పులు జరగలేదని బిజెపి నేత భానుప్రకాష్‌రెడ్డి చెప్పడం ఏమిటని జనసేన పార్టీ తిరుపతి అసెంబ్లీ ఇన్‌ఛార్జి కిరణ్ రాయల్ ప్రశ్నించారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శ్రీవాణి ట్రస్ట్ నిధులు దారి మళ్లుతున్నాయని ఓవైపు జనసేన పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తుంటే మిత్రపక్షంగా ఉన్న భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్ రెడ్డి కలుగజేసుకొని శ్రీవాణి ట్రస్ట్ నిధులు ఎక్కడా దారి మళ్లడం లేదని చెప్పడంలో ఆంతర్యం ఏమిటో ప్రజలకు చెప్పాలన్నారు. తన టికెట్ల వ్యాపారం ఎక్కడ దెబ్బతింటుందోనని ఇఒ ధర్మారెడ్డికి, చైర్మన్ వైవి సుబ్బారెడ్డికి వత్తాసుగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. యాత్రికుల సొమ్ము విషయంలో మిత్రపక్షానైనా ప్రశ్నిస్తామని కిరణ్ రాయల్ స్పష్టం చేశారు. శ్రీవాణి ట్రస్ట్ కుంభకోణంలో సోము వీర్రాజుకు ఏమైనా వాటా అందుతుందా? అని ప్రశ్నించారు. భక్తుల సొమ్ము దుర్వినియోగం చేస్తుడడంపై జనసేన పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తుంటే టిటిడిపై గాని, ధర్మారెడ్డిపై గాని బిజెపి నేతలు ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం చూస్తుంటే పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. పవన్‌కల్యాణ్‌కు బిజెపి నేత భానుప్రకాష్‌రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాజారెడ్డి, హేమకుమార్, నాగరాజు రాయల్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులందరికీ పరిహారం

- నాలుగు నెలల్లో వెలుగొండ పూర్తి చేస్తాం: అంబటి రాంబాబు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల (ప్రకాశం జిల్లా)

వెలుగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల నిర్వాసితులందరికీ పరిహారం ఇస్తామని, నాలుగు నెలల్లో ప్రాజెక్టును పూర్తి చేసి నీళ్లిస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్‌తో కలిసి ఆయన వెలుగొండ సొరంగ మార్గం ద్వారా కొత్తూరుకు చేరుకున్నారు. అనంతరం పెద్దదోర్నాలలోని వెలుగొండ ప్రాజెక్టు గెస్ట్‌హౌస్‌లో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ.. 4.50 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే వెలుగొండ ప్రాజెక్టును చిత్తశుద్ధితో నిర్మిస్తున్నట్లు తెలిపారు. నాలుగు నెలల్లో ప్రాజెక్టును పూర్తి చేసి రైతాంగానికి నీరందిస్తామన్నారు. కేవలం రెండు గ్రామాలకే కాదని, ప్రాజెక్టు పరిధిలోని నిర్వాసితుల గ్రామాలన్నింటికీ ఆర్‌ఆర్ ప్యాకేజీ ద్వారా పరిహారం ఇచ్చిన తర్వాతనే నీళ్లు వదులుతామని చెప్పారు. పరిహారం అందించడంలో ఏ ఒక్క కుటుంబాన్నీ నిర్లక్ష్యం చేయబోమన్నారు. మొదటి టన్నెల్ పూర్తి అయ్యిందని, రెండో టన్నెల్ 1.2 కిలోమీటర్లు పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు. ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని 33 మండలాలకు తాగునీరు, సాగునీరు అందించేందుకు ఈ ప్రాజెక్టు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రాజెక్టును పూర్తి చేసి నీళ్లు వదిలిన తర్వాతనే ఎన్నికలకు వెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, వైసిపి యువ నేత ఆదిమూలపు విశాల్, ఇఎన్‌సి సిఇ మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

సంపాదకీయం

ఆకలి..


ప్రజాపంపిణీ వ్యవస్థ (పిడిఎస్) కోసం తప్ప, సంక్షేమ పథకాల అమలుకోసం బహిరంగ మార్కెట్‌లో అమ్మకం పథకం (ఒఎంఎస్-ఎస్) కింద రాష్ట్రాలకు బియ్యం, గోధుమలు విక్రయించవద్దంటూ ఎఫ్‌సిఐని కేంద్రం ఆదేశించడం అమానుషం. ఆహార భద్రత కల్పించేందుకు, సామాన్యులకు ఆహార ధాన్యాలు అందుబాటు ధరల్లో ఉంచేందుకు ఏర్పాటు చేసిన భారత ఆహార సంస్థ (ఎఫ్‌సిఐ) ఆ బాధ్యత నెరవేర్చకుండా అడ్డుపడటం బాధ్యతారాహిత్యం. కరోనాతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడిన సమయంలో కార్పొరేట్లకు లక్షల కోట్ల ప్యాకేజీ ఇచ్చిన కేంద్రం అయిష్టంగానే పేదలకు ఉచితంగా ఐదు కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేయడం ప్రారంభించింది. ప్రజలకు అంతకుముందున్న రేషన్ పథకాన్ని ఎత్తివేసింది. ప్రజలకు ఆహార భద్రత కల్పించడం, ప్రజాపంపిణీ వ్యవస్థ (పిడిఎస్) ద్వారా సరఫరా చేసేందుకు ఆహార ధాన్యాలను సేకరించి, నిలువ చేయడం, ఆయా రాష్ట్రాలకు పంపిణీ చేయడం, రైతులకు సరైన మద్దతు ధర కల్పించడం ఎఫ్‌సిఐ బాధ్యత.

మోడీ ఏలుబడిలో ఏటా ఆకలి సూచీలో దిగువకు పడిపోతూనే ఉంది. గత ఏడాది మరీ ఘోరంగా 121 దేశాలున్న సూచీలో 107వ స్థానానికి దిగజారింది. మన పొరుగునే ఉన్న పాకిస్తాన్, బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక, ఆఫ్ఘనిస్తాన్ సైతం మనకంటే మెరుగ్గా ఉన్నాయంటే... మన పరిస్థితిని అంచనా వేయొచ్చు. తిండి గలిగితే కండగలదోయ్.. కండ గలవాడే మనిషోయ్... అన్న స్ఫూర్తితో పేదలందరికీ ఆహార ధాన్యాలు అందేలా చర్యలు తీసుకుని, దేశాభివృద్ధికి నడుంకట్టాల్సిన పాలకులు అందుకు భిన్నంగా ఆలోచించడం క్షంతవ్యం కాదు.

ప్రజలందరికీ ఆహారం అందుబాట్లో ఉంచడమా? ఇథనాల్ తయారు చేసి అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడుతున్నామని ప్రచారం చేసుకోవడమా? అన్న ప్రశ్న వస్తే ప్రజాస్వామ్య పాలకులెవరైనా పేదలకు ఆహారం అందుబాట్లో ఉంచేందుకే మొగ్గుచూపుతారు. కానీ మోడీ సర్కారు రెండో అంశంవైపే మొగ్గుచూపింది. 2013 ఆహార భద్రతా చట్టం ప్రకారం దేశంలో 81.3 కోట్ల మంది లబ్ధిదారుల కోసం ఆరుకోట్ల టన్నుల బియ్యం, గోధుమలను కేంద్రం పంపిణీ చేయాల్సి ఉంది. ఈ ఏడాది జూన్ 1 నాటికి కేంద్రం వద్ద 41.4 మెట్రిక్ టన్నుల బియ్యం 31.4 మెట్రిక్ టన్నుల గోధుమలు నిల్వలు ఉన్నాయి. ఈ నిల్వలతో ఆహార సంక్షోభాన్ని రూపుమాపి, నిరుపేదలందరికీ ఆహార ధాన్యాలను అందించేందుకు రాష్ట్రాలతో కలిసి పనిచేయాల్సి ఉంది. అందుకు భిన్నంగా సమాఖ్య స్ఫూర్తినిసైతం తుంగలో తొక్కి రాష్ట్రప్రభుత్వాలకు ఆహార ధాన్యాలను సరఫరా చేయవద్దని ఎఫ్‌సిఐని ఆదేశించడం దారుణం.

పెట్రో ఉత్పత్తుల్లో 20 శాతం ఇథనాల్‌ను 2030 నాటికి కలపాలని మనదేశం లక్ష్యం కాగా, 2025-26 నాటికే ఆ లక్ష్యం చేరుకునేందుకు ప్రయత్నిస్తోంది. 2020-21లో 1.06 మెట్రిక్ టన్నులు, ఈ ఏడాది 1.5 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఇథనాల్ ఉత్పత్తి కోసం కేటాయించింది. చెరకు, మొక్కజొన్న, జొన్న, సజ్జలు, బియ్యం నూకలు, గోధుమల నుంచి ఇథనాల్ ఉత్పత్తి చేస్తారు. పేదలకు అందించేందుకు రాష్ట్రాలకు క్వింటాకు రూ.3,400 చొప్పున, ఇథనాల్‌కు క్వింటా రూ.2000 చొప్పున ఆహార ధాన్యాలను గతంలో ఎఫ్‌సిఐ విక్రయించేది. ఈ ధరలో వ్యత్యాసమే కేంద్రం కార్పొరేట్ ప్రాధాన్యతను, సంపన్న దేశాల ఆదేశాలకు మడుగులొత్తుతున్న విధానాన్ని తెలుపుతోంది. తాజాగా, ఇథనాల్‌కే ఆహార ధాన్యాలు విక్రయించాలని ఆదేశించడం ఈ ప్రభుత్వానికి పరిశ్రమ, పారిశ్రామికాధిపతులు తప్ప ప్రజలు, వారి ఆకలి ఏమాత్రం పట్టడం లేదని తేటతెల్లం చేస్తోంది. రోజురోజుకూ మానవాభివృద్ధి సూచీల్లో వెనుకబడుతూ, ఆకలి సూచీలో ముందుకెళ్తున్న దుస్థితిలో సంక్షేమ పథకాలకు మోకాలడ్డడం సరికాదు. రాష్ట్ర ప్రభుత్వాలకు బియ్యం అమ్మరాదని ఎఫ్‌సిఐని మోడీ ప్రభుత్వం ఆదేశించిన తీరు అత్యంత నిరంకుశమైనది, అప్రజాస్వామికమైనది. ఉపశమనం కలిగించేందుకు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా బిజెపియేతర ప్రభుత్వాలను అడ్డుకోవడం క్షమార్హం కాదు. సమాఖ్య విధానాలకు తూట్లుపొడిచే చర్యలకు స్వస్తి పలకకపోతే ప్రజలే బుద్ధిచెబుతారు.

మహనీయుని మాట



తెలివైన వారెప్పుడూ కాలాన్ని క్షణం కూడా వృథా చేసుకోకుండా సద్వినియోగం చేసుకుంటారు.
- జాన్ రస్కిన్

పుతిన్‌పై కిరాయి సేన విఫల తిరుగుబాటు - సమాధానం లేని ప్రశ్నలు!

అంతర్జాతీయం



ఎం. కోటేశ్వరరావు



తిరుగుబాటుకు తగినంత మద్దతు లభించకపోవటం, వాగ్నర్ దళంలోని కొందరు కమాండర్లు కూడా సిద్ధం కాలేదని వార్తలు వచ్చినందున నేత తోక ముడిచినట్లు చెబుతున్నప్పటికీ ఎక్కడా మిలిటరీ ఎందుకు ప్రతిఘటించలేదు, విఫలమైన తరువాత అణచివేయకుండా పుతిన్ రాజీకి ఎందుకు అంగీకరించాడు? ఒకవేళ శిక్షిస్తే ఇతర కిరాయి దళాలు తన పట్టు నుంచి జారతాయని భావించారా? పుతిన్ ఒక బూర్జువా, వాగ్నర్ కంపెనీని పెంచి పోషించటంలో అతగాడేమీ తక్కువ తినలేదు. పశ్చిమ దేశాలు చెబుతున్నట్లు పుతిన్-రక్షణ మంత్రి- మిలిటరీ అధికారుల మధ్య నిజంగానే సంబంధాలు సజావుగా లేవా? 'పుతిన్ మీద కాదు నా తిరుగుబాటు' అని చెబుతున్న ప్రిగోజిన్ ఎవరి మీద కుట్రకు తెర లేపినట్లు?

ఇరవై రెండు సంవత్సరాల పాటు రష్యాలో తిరుగులేని అధినేతగా ఉన్న వ్లదిమిర్ పుతిన్ నాయకత్వానికి తొలిసారిగా వాగ్నర్ కిరాయి సాయుధ మూక రూపంలో విఫల సవాలు ఎదురైంది. ఒక్క తూటా కూడా పేలకుండా తిరుగుబాటు ముగిసినప్పటికీ పుతిన్ బలహీనత వెల్లడైంది. తన లక్ష్యం పుతిన్‌ను అధికారం నుంచి తొలగించటం కాదని, తిరుగుబాటు నేత ఎవగెనీ ప్రిగోజిన్ సోమవారంనాడు ఒక ప్రకటనలో పేర్కొన్నాడు. ఈ ఉదంతానికి సంబంధించి అనేక ప్రశ్నలకు సమాధానం లేదు. దీని గురించి ఊహించిందే అన్నట్లుగా పశ్చిమ దేశాల స్పందన ఉంది.

మాస్కోను పట్టుకుంటామంటూ ఉక్రెయిన్ లోని రష్యా ఆధీనంలోని ప్రాంతాల నుంచి బయలు దేరిన ఈ ప్రైవేటు దండు (పిఎంసి) జూన్ 24 శనివారం నాడు ఒక్క తూటాను కూడా పేల్చకుండానే సరిహద్దులోని రష్యా నగరమైన రోస్టోవ్ అన్ డాన్‌లోని మిలిటరీ కేంద్రాన్ని స్వాధీనం చేసుకొన్నది. అక్కడి నుంచి మాస్కో నగరానికి 360 కిలోమీటర్ల దూరంలో ఉండగా (కొన్ని వార్తల ప్రకారం రెండు వందల కిమీ) నాటకీయ పరిణామాల మధ్య తన దళాలు వెనక్కు తిరుగుతున్నట్లు, తిరిగి ఉక్రెయిన్‌లో పోరు జరుగుతున్న ప్రాంతాలకు వెళ్లాలని వాగ్నర్ కంపెనీ అధిపతి ఎవగెనీ ప్రిగోజిన్ ప్రకటించాడు. రష్యా మిత్రదేశమైన బెలారస్ అధినేత అలెగ్జాండర్ లుకషెంకో మధ్యవర్తిత్వంలో కుదిరినట్లు చెబుతున్న రాజీ మేరకు వాగ్నర్ దళం, దాని అధిపతి మీద ఎలాంటి విచారణ ఉండదు. దళాలు తిరిగి ఉక్రెయిన్‌లో ఉన్న ప్రాంతానికి వెళతాయి. అధిపతి ప్రిగోజిన్‌కు బెలారస్ ఆశ్రయం కల్పిస్తుంది. వాగ్నర్ దళాలు తమ వద్ద ఉన్న ఆయుధాలను వెంటనే అప్పగిస్తే వారి మీద ఎలాంటి విచారణ ఉండదు. తిరుగుబాటులో పాల్గొనని వారిని మిలిటరీ కాంట్రాక్టు దళంలో సర్దుబాటు చేస్తారు. జులై ఒకటవ తేదీలోగా వారు దరఖాస్తు చేసుకోవాలి. రాజీ వార్త వెలువడిన కొద్ది గంటల్లోనే స్వాధీనం చేసుకున్న రోస్టోవ్ నగరం నుంచి వాగ్నర్ దళం వైదొలిగింది. ప్రిగోజిన్ శుక్రవారం నాడు ఒక ప్రకటన చేస్తూ అవసరం లేకున్నా ఉక్రెయిన్ మీద పుతిన్ పోరుకు దిగాడని, దాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్లు ప్రకటించాడు. తమ దళాల మీద రక్షణ మంత్రి సెర్గీ షోయిగు ఆదేశాల మేరకు రాకెట్లు, హెలికాప్టర్లు, ఫిరంగులతో మిలిటరీ దాడి చేసి రెండువేల మందిని హతమార్చినట్లు ఆరోపించాడు. తమ తిరుగుబాటుకు కారణం ఇదే అని చెప్పాడు. షోయిగుతో భేటీ తరువాత సైనిక దళాల చీఫ్ వాలెరె గెరాసిమోవ్ తమ దండు మీద దాడులకు ఆదేశించినట్లు ఆరోపించాడు. ఈ ఆరోపణను మిలిటరీ తిరస్కరించింది. ఉక్రెయిన్ లోని బఖుమత్ పట్టణాన్ని స్వాధీనం చేసుకోవటంలో వాగ్నర్ దళం కీలకపాత్ర పోషించింది.

అంతకు ముందు దేశ పౌరులనుద్దేశించి టీవీలో మాట్లాడిన పుతిన్ తిరుగుబాటును వెన్నుపోటుగా, విద్రోహంగా వర్ణిస్తూ దీనివెనుక ఉన్న వారిని శిక్షించాలని చెప్పాడు. ఈ కారణంగా ఉక్రెయిన్‌పై మిలిటరీ చర్య ఆగదన్నాడు. తిరుగుబాటు ప్రారంభం కాగానే బెలారస్ నేత లుకషెంకో ఒక ప్రకటన చేస్తూ పుతిన్‌కు మద్దతు ప్రకటించాడు. మరో ప్రైవేటు దండు చెచెన్ దళాల నేత కదరివ్ కూడా ఉక్రెయిన్‌లో ఉన్న మూడు వేల మంది తమ వారిని వాగ్నర్ దళం మీద పోరుకు పంపుతున్నట్లు చెప్పాడు. వాగ్నర్ దళాలు వస్తున్న మార్గంలో అనేక చోట్ల తనిఖీ కేంద్రాలు, భారీ ఎత్తున రష్యన్ మిలిటరీ సాయుధ శకటాలను రంగంలోకి దించారు, మాస్కో చుట్టూ భద్రతను పటిష్టం కావించారు.

అరవై రెండు సంవత్సరాల ప్రిగోజిన్ ఒక నేరగాడు. పదేళ్ల పాటు జైలులో ఉండి విడుదలైన తరువాత ఆహార సరఫరా కాంట్రాక్టరు అవతారమెత్తాడు. ఆ క్రమంలో పుతిన్ వంట వాడని ఎగతాళి చేసేంతగా దగ్గరయ్యాడు. మిలిటరీ అధికారులతో సంబంధాలు పెట్టుకొని వారి మద్దతుతో జైళ్లలోని నేరగాళ్లు, నిరుద్యోగులను చేరదీసి వాగ్నర్ కంపెనీ పేరుతో కిరాయి సాయుధ దళాన్ని ఏర్పాటు చేశాడు. మిలిటరీ అందచేసిన ఆయుధాలు, నిధులతో లిబియా, సిరియా తదితర దేశాల్లో అమెరికా వినియోగించిన ఐఎస్ కిరాయి మూకలను ఎదుర్కొనేందుకు పని చేశాడు. దాని కొనసాగింపుగానే ఉక్రెయిన్ లోని డాన్‌బాస్ ప్రాంతంలో ఉక్రెయిన్ మిలిటరీతో తలపడి ఆ ప్రాంతాలను పట్టుకోవటంలో, క్రిమియాను స్వాధీనం చేసుకోవటంలో కూడా కీలక పాత్ర పోషించాడు. 2016 ఎన్నికల్లో డోనాల్డ్ ట్రంప్‌కు వ్యతిరేకంగా కొంత మందితో కలసి సామాజిక మాధ్యమంలో ప్రచారం చేసినట్లు కూడా వెల్లడైంది. తమ దగ్గర పాతిక వేల మంది ఉన్నట్లు ప్రిగోజిన్ ప్రకటించాడు. మరో పాతిక వేల మంది కలుస్తారని, తిరుగుబాటులో కలసి వచ్చే వారందరినీ కలుపుకుంటామన్నాడు. తాము ఎందుకోసమైతే బయలు దేరామో అది ముగిసిన తరువాత మాతృదేశాన్ని కాపాడుకొనేందుకు తిరిగి వస్తామని చెప్పాడు. రక్షణ మంత్రి దేశాన్ని, పుతిన్‌ను కూడా తప్పుదారి పట్టించాడన్నాడు.

కిరాయి మిలిటరీ ఒక పెద్ద దేశంలో విఫల కుట్రకు పాల్పడటం ఇదే ప్రథమం. ప్రపంచంలో ఇలాంటి సంస్థలు 16 వేల వరకు ఉన్నట్లు అంచనా. వీటిలో ఓడలు, గనులు, చమురు బావుల వంటి వాటికి సాయుధ కాపలాతో పాటు ఎవరు డబ్బులిస్తే వారి తరఫున ఇతర దేశాలు మీద యుద్ధాలు చేసేందుకు కూడా జనాలను పంపుతాయి. కొంతమంది వర్ణించినట్లు పురాతన వృత్తులలో రెండవదిగా కిరాయి మిలిటరీ ఉంది. అధికారికంగా లేదా అనధికారికంగా మన దేశంతో సహా దాదాపు అన్ని దేశాలూ పిఎంసిలను కలిగి ఉన్నాయి. వివిధ దాడుల్లో అమెరికా సైనికులు మరణించటంపై తలెత్తిన నిరసన కారణంగా గడచిన మూడు దశాబ్దాలుగా అమెరికా కిరాయి మూకలను రంగంలోకి దించుతోంది. దీంతో సైనికుల మరణాలను తగ్గించుకోవచ్చు, పౌరుల నుంచి నిరసనలు ఉండవు. నిరంతరం మిలిటరీని పోషించాలంటే ఖర్చుకూడా ఎక్కువ. రాబోయే రోజుల్లో అధికారిక మిలిటరీ బదులు ఇలాంటి వారితోనే యుద్ధాలు జరిగే అవకాశాలు లేకపోలేదని నిపుణులు చెబుతున్నారు. 1990 దశకంలో ప్రతి 50 మంది మిలిటరీ సిబ్బందికి ఒకరు కాంట్రాక్టు ప్రైవేటు మిలిటరీ ఉండగా ఇప్పుడు పదికి ఒకరు ఉన్నట్లు అంచనా. ఆయుధాలతో పాటు పిఎంసిల నిర్వహణ పెద్ద లాభసాటి వ్యాపారంగా మారింది. లాటిన్ అమెరికాలో పోలీసుల కంటే కిరాయి సిబ్బంది ఎక్కువగా ఉన్నారని చెబుతున్నారు. 1990లో అమెరికా త్రివిధ దళాల్లో 21 లక్షల మంది సిబ్బంది ఉండగా ప్రస్తుతం 14 లక్షలకు కుదించారు. ఆఫ్ఘనిస్తాన్‌లో అధికారిక మిలిటరీ కంటే ఇలాంటి కిరాయి దళాలనే అమెరికా ఎక్కువగా దింపింది. అక్కడ అమెరికా 14 లక్షల కోట్ల డాలర్లు ఖర్చు పెట్టగా మూడో వంతు ప్రైవేటు మిలిటరీ కాంట్రాక్టర్లకే వెళ్లింది. 2001లో 140 బిలియన్ డాలర్లు చెల్లించగా 2019 నాటికి 370 బి. డాలర్లకు పెరిగింది. ఇరాక్ మీద దాడి చేసిన అమెరికా, దాని మిత్ర దేశాలు కూడా అదే చేశాయి. కొన్ని కంపెనీలు పిఎంసి కంపెనీల పేరుతో స్టాక్ మార్కెట్లో వాటాలను కూడా అమ్ముతున్నాయి.


సిరియా ప్రభుత్వాన్ని కూలదోసేందుకు అమెరికా పిఎంసిలను రంగంలోకి దింపగా వాటిని ఎదుర్కొనేందుకు రష్యా కూడా వాగ్నర్ వంటి కంపెనీలను మోహరించింది. చమురు సంపదలున్న అరేబియా దేశాలు ఇలాంటి వాటిని పెద్ద ఎత్తున వినియోగిస్తున్నాయి. ఎమెన్ వంటి చోట్ల అదే జరిగింది. లాటిన్ అమెరికాలో నిరంకుశ పాలకులు ఇలాంటి దళాలతో ప్రతిపక్షాల నేతలు, ఇతరుల మీద దాడులు, హతమార్చటం వంటి దారుణాలకు పాల్పడ్డారు. ఇప్పటికీ కొనసాగుతోంది. ఆఫ్రికాలో చాలా దేశాలు వాగ్నర్‌తో కాంట్రాక్టు కుదుర్చుకున్నాయి. ఏ ప్రైవేటు మిలిటరీ చరిత్రను చూసినా వారి వెనుక ప్రస్తుత, రిటైర్డు మిలిటరీ అధికారులు ఉంటారు. వారికి శిక్షణ ఇచ్చేది కూడా వారే. ప్రపంచ మిలిటరీ చరిత్రను చూసినపుడు క్రీస్తుపూర్వం నుంచి తరువాత కూడా కిరాయి సైనికుల ప్రస్తావన, వినియోగం కనిపిస్తుంది. ఆసియా దేశాలపై దండెత్తిన అలెగ్జాండర్ సేనలో ఐదువేల మంది వరకు ఉన్నారని చరిత్రకారులు చెప్పారు. అతన్ని ఎదుర్కొన్న పర్షియా మిలటరీలో పది వేల మంది గ్రీకులు ఉన్నారు. మన దేశంలోని పాలకులు కూడా కొందరు గ్రీకులను తెచ్చుకున్నట్లు వారిని యవనులుగా వర్ణించినట్లు చరిత్రలో ఉంది. రోమ్ పాలకులు తమ సామ్రాజ్యాన్ని కాపాడుకొనేందుకు, దానిపై దాడులు చేసేందుకు ఇతర దేశాలూ కూడా వేలాది మంది కిరాయి బంట్లను సమకూర్చుకున్నాయి. చైనా యుద్ధ ప్రభువులు కూడా ఇరుగుపొరుగు దేశాలకు చెందిన వారిని కిరాయికి తెచ్చుకున్నారు.

ఇక వర్తమాన అంశానికి వస్తే వాగ్నర్ కంపెనీ నేత తిరుగుబాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు అమెరికా గూఢచారులు పసిగట్టి జోబైడెన్‌కు సమాచారమందించినట్లు అమెరికా మీడియా పేర్కొన్నది. ఈ సమాచారం పుతిన్‌కు ఎందుకు అందలేదు అన్నది ప్రశ్న. ఒక వేళ తెలిసి ఉంటే తగిన జాగ్రత్తలతో రోస్టోవ్ నగరంలోని మిలిటరీ కేంద్రం వద్ద భద్రతా చర్యలెందుకు తీసుకోలేదు? అనేక ప్రశ్నలకు ప్రస్తుతం సమాధానాలు లేవు. తమకు చెల్లించాల్సిన మొత్తాలకు కోత పెట్టారని విమర్శించినట్లు, దళాన్ని మిలిటరీ ఆధీనంలో ఉంచేందుకు వాగ్నర్ తిరస్కరించినట్లు వార్తలు వచ్చినప్పటికీ జాగ్రత్తలు తీసుకోలేదు. నాటో నేతలతో ప్రిగోజిన్ సంబంధాల్లో ఉన్నట్లు కుట్ర తరువాత కొన్ని సూచనలు వెలువడ్డాయి. ఉక్రెయిన్‌పై అవసరం లేకున్నా దాడికి దిగినట్లు పుతిన్ మీద ఆరోపణే అందుకు నిదర్శనం. మూడు వారాలుగా జరుపుతున్న ఎదురు దాడుల్లో ఉక్రెయిన్ భారీగా నష్టపోతున్నట్లు వార్తలు వస్తున్న తరుణంలో తిరుగుబాటు జరిగింది. తిరుగుబాటు ఆశ్చర్యం కలిగించలేదన్నట్లుగా అమెరికా, పశ్చిమ దేశాల స్పందన ఉంది. బెలారస్ నేత లుకషెంకోతో వాగ్నర్ యజమాని జరిపిన రాజీ చర్చల్లో రష్యా రక్షణ మంత్రి షోయిగు, సైనిక అధికారి వాలెరీ గెరాసిమోవ్‌ను తొలగించేందుకు, వాగ్నర్ దళాన్ని ఆఫ్రికా పంపేందుకు అంగీకరించినట్లు నిర్ధారణ కాని వార్తలు వచ్చాయి. ప్రిగోజిన్‌పై దేశద్రోహ విచారణ కొనసాగుతుందని కూడా సోమవారం నాడు కొన్ని వార్తలు పేర్కొన్నాయి. తిరుగుబాటుకు తగినంత మద్దతు లభించక పోవటం, వాగ్నర్ దళంలోని కొందరు కమాండర్లు కూడా సిద్ధం కాలేదని వార్తలు వచ్చినందున నేత తోక ముడిచినట్లు చెబుతున్నప్పటికీ ఎక్కడా మిలిటరీ ఎందుకు ప్రతిఘటించలేదు, విఫలమైన తరువాత అణచివేయకుండా పుతిన్ రాజీకి ఎందుకు అంగీకరించాడు? ఒకవేళ శిక్షిస్తే ఇతర కిరాయి దళాలు తన పట్టు నుంచి జారతాయని భావించారా? పుతిన్ ఒక బూర్జువా, వాగ్నర్ కంపెనీని పెంచి పోషించటంలో అతగాడేమీ తక్కువ తినలేదు. పశ్చిమ దేశాలు చెబుతున్నట్లు పుతిన్-రక్షణ మంత్రి- మిలిటరీ అధికారుల మధ్య నిజంగానే సంబంధాలు సజావుగా లేవా? 'పుతిన్ మీద కాదు నా తిరుగుబాటు' అని చెబుతున్న ప్రిగోజిన్ ఎవరి మీద కుట్రకు తెర లేపినట్లు? ఏం జరుగుతోంది, ఏం జరగబోతోంది? ప్రస్తుతానికి సశేషమే.

★

అందరికీ ఆధునిక వైద్యం!

సందర్భం



డా॥. కొల్లా రాజమోహన్



ఈ మధ్యకాలంలో వైద్యం చాలా అభివృద్ధి చెందింది. జీవిత కాలాన్ని పొడిగించగలిగింది. ఇదివరకు అసాధ్యమైన వాటిని సాధించి మానవ జీవన విధానాన్ని సౌఖ్యంగా గడపటానికి మార్గం సుగమం చేసింది. డబ్బున్నవారు అత్యంత ఆధునిక వైద్యం కొనుక్కోగల్గుతున్నారు.

అయితే రోగం వచ్చి హాస్పిటల్లో చేరితే ఆస్తులు అమ్ముకోవాల్సిందే అనేది సామాన్య ప్రజల అనుభవం. వైద్య ఖర్చులు భరించలేక ప్రతి సంవత్సరం కోట్లాదిమంది పేదరికం లోకి జారిపోతున్నటువంటి అవస్థ అందరికీ తెలిసిందే. సంవత్సరానికి ఆరు కోట్ల మంది ప్రజలు వైద్య ఖర్చులు భరించలేక పేదరికంలోకి నెట్టబడుతున్నారని సర్వేలు చెప్తున్నాయి.

నూటికి 99 మందికి ఆధునిక వైద్యం అందుబాటులో లేదు. ప్రజలకు దగ్గరగా ఉండే డాక్టర్ కొత్తగా వస్తున్న పరికరాలు కొనకపోతే వెనకబడి పోతున్నాడు. రోగులు, అప్పో సొప్పో చేసైనా అనుభవం, టెస్టులు, పరికరాలు అన్నీ ఉన్న డాక్టర్ దగ్గరికి వెళ్ళక తప్పడం లేదు. ఆరోగ్య చికిత్సల వ్యవహారం రూ.లక్షలలో ఉంది. నూటికి ఒక్కరుగా ఉన్నటువంటి అత్యంత ధనవంతులు అత్యంత ఆధునిక వైద్యాన్ని తేలికగా అందుకోగలుగుతున్నారు. 99 మందికి ఆధునిక వైద్యం అందుబాటులో లేదు.

1990 తర్వాత పూర్తిగా అమెరికా సంస్కృతి, అమెరికా విధానాలు, అమెరికా వైద్యం ప్రవేశించిన తర్వాత ధర్మాస్పత్రి తీరులు మారిపోయాయి. భార్యాభర్తలు డాక్టర్లుగా ప్రైవేటు ప్రాక్టీస్ చేస్తున్న వారి ప్రైవేట్ వైద్యం క్షీణిస్తోంది. కార్పొరేట్ వైద్యం లోకి విదేశీ పెట్టుబడులు కూడా ప్రవేశించాయి. కార్పొరేట్ ఆసుపత్రి వారు చిన్న పట్టణాల్లో కూడా బ్రాంచీలు పెడుతున్నారు. స్వంతంగా ప్రాక్టీసు పెట్టుకోవడానికి డబ్బులు లేని డాక్టర్లను జీతానికి పెట్టుకుంటున్నారు. కోటి రూపాయలు ఖర్చు చేసి డిగ్రీ పొందిన డాక్టరుకి నెలకు రూ.20 వేల నుండి రూ.లక్ష వరకు జీతంతో ఉద్యోగం ఇస్తున్నారు. నెలకి ఇన్ని పరీక్షలు రాయాలి, ఇన్ని ఆపరేషన్లు చేయాలని టార్గెట్లు ఫిక్స్ చేస్తున్నారు. రోగులందరికి ఎక్కువ పరీక్షలు చేయకపోతే, ఎక్కువ ఆపరేషన్లు చేయకపోతే, ఎక్కువ మందులు రాయకపోతే కార్పొరేట్ హాస్పిటల్‌లో డాక్టర్ల ఉద్యోగాలకు గ్యారంటీ లేదు. కేసులు తెచ్చినవారికి పెద్ద మొత్తంలో కమీషన్ ఇస్తున్నారు. వైద్యంలో అంతర్లీనంగా ఉన్న మానవత్వం మంట కలిసిపోయింది. డాక్టర్‌కి రోగికి మధ్య డబ్బులు ప్రవేశించాయి.

ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితి అధ్వానంగా వుంది. ప్రభుత్వం ప్రజారోగ్యంపై పెట్టే శ్రద్ధ తగ్గిపోతున్నది. డాక్టర్ల పోస్టులు భర్తీ కావు. డాక్టర్లు వుండరు. అత్యవసర మందులుండవు. ఎక్సరే, స్కానింగ్ మెషిన్లు పనిచేయవు.

భారత రాజ్యాంగంలోని 21, 47 ఆర్టికల్స్ ప్రకారం ఆరోగ్యం ప్రాథమిక హక్కు. అయినా ప్రభుత్వం వైద్యం అందించలేక ప్రైవేటు ఆసుపత్రులు, కార్పొరేట్ ఆసుపత్రుల వైపు దారి చూపిస్తున్నది.

మన దేశంలో 1947వ సంవత్సరంలో సగటు జీవిత కాలం 32 సంవత్సరాలు వుండేది. 1951లో 37.2, ఇపుడు సగటున 70 సంవత్సరాలకు మించే వున్నది. చదువు, శుభ్రత, చైతన్యం, శాస్త్రీయ విజ్ఞానం, ఆహార లభ్యత, వైద్యం అభివృద్ధి చెందడం వలన మరణాలను వాయిదా వేయగల్గుతున్నారు.

వైద్య పరికరాల రేట్లను అడ్డగోలుగా పెంచుకుంటూ పోతున్న కంపెనీలపై ప్రభుత్వ నియంత్రణ లేదు. నాసిరకం మందులు, నకిలీ మందులను అరికట్టని ప్రభుత్వాన్ని ఏమీ చేయలేని స్థితిలో ప్రజలున్నారు. పేటెంట్ పేరున మందుల ధరలు విపరీతంగా పెంచుకుంటూ పోతున్న కంపెనీలను అదుపు చేసే వాళ్ళు లేరు. టన్నులలో ముడి మందును కొని మిల్లీ గ్రాములలో మందును తయారు చేసి భారీ లాభాలను సంపాదిస్తున్న కంపెనీలకు ప్రభుత్వం ప్రోత్సాహిలిస్తున్నది.

వైద్యంలో అశ్రద్ధ చూపించిన డాక్టర్లను విచారించాల్సిందే. సమర్థమైన వైద్య, సాంకేతిక బృందం ద్వారా విచారణ జరపాలి. నిర్లక్ష్యం నిరూపితమైతే తగిన శిక్ష విధించాల్సిందే. అయితే అశ్రద్ధ గురించి నిరూపణ కాక ముందే శిక్ష వేయటం న్యాయం కాదు. ప్రతి మరణానికి డాక్టర్‌ని బాధ్యుడిని చేయటం వలన వైద్య వృత్తిపై ప్రేమతో, రోగులను శ్రద్ధతో, గౌరవంతో, మానవత్వంతో చూసే వైద్యులు కూడా ప్రజలకు దూరం అవుతారు. మనకెందుకు రిస్క్ అని డిఫెన్సివ్ ప్రాక్టీస్ చేసినందువలన రోగులకు ఖర్చు మరింత పెరుగుతుంది. పేదరికానికీ, అనారోగ్యానికీ కారణమైన ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించి...అందరికీ ప్రభుత్వమే వైద్యం అందించేలా ప్రజలు పోరాడాలి.

ప్రజల ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత. కానీ 142 కోట్లకు పైగా జనాభా కలిగిన మన దేశంలో ప్రజారోగ్యానికి ఖర్చు పెడుతున్నది జిడిపిలో 1.35 శాతం మాత్రమే అంటే చాలా ఆశ్చర్యంగా ఉంటుంది. పేద దేశమైనటువంటి క్యూబా తన జాతీయ ఆదాయంలో 12 శాతం ప్రజారోగ్యం కోసం ఖర్చు పెడుతుంది. బ్రిటన్, అమెరికా, స్వీడన్, జపాన్, జర్మనీ తదితర దేశాలు తమ జిడిపిలో పది శాతానికి పైగా ఖర్చు పెడుతున్నాయి. మన దేశంలో అందరికీ ఆరోగ్యం అనేది అందని కలగానే మిగిలిపోతున్నది.

డాక్టర్లు , నర్సులు, సిబ్బంది, పరికరాలు, మందుల, కొరత తీవ్రంగా ఉంది. నర్సింగ్ విభాగంలో 86,000 మంది సిబ్బంది కొరత ఉందని భారత నర్సింగ్ మండలి అంచనా. రిటైర్ అయిన స్థానాలలో ఉద్యోగులను నియమించటంలేదు. సుదీర్ఘ పనిగంటలు వారికి మరింత భారం అవుతున్నాయి. అందువల్ల వైద్యంలో నాణ్యత లోపిస్తున్నది. 703 మెడికల్ కాలేజీలున్నాయి. ప్రతి సంవత్సరం 90,000 మంది డాక్టర్లవుతున్నారు. 733 ఆయుష్ మెడికల్ కాలేజీలలో 53,000 ఆయుష్ డాక్టర్లగా వస్తున్నారు. అయినా మనకు డాక్టర్ల సంఖ్య తక్కువగానే ఉంది.

మనకు వెయ్యి మంది జనాభాకి 2.6 అంటే ముగ్గురు కూడా లేరు. అదే క్యూబాలో వెయ్యి మంది జనాభాకి 8.4 దాదాపు 9 మంది ఉన్నారు. ఆ దేశంలో డాక్టర్లందరూ కూడా ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే పని చేస్తారు. వైద్యులంతా ప్రజలందరికీ అందుబాటులో ఉండటమే క్యూబా ప్రత్యేకత. బ్రిటన్‌లో కూడా డాక్టర్లందరూ ప్రభుత్వంలోనే పనిచేస్తారు. కానీ అమెరికాలోనూ, ఇండియాలోనూ, జపాన్ లోను డాక్టర్లు ఎక్కువ మంది ప్రైవేట్ ప్రాక్టీస్ లోనే వుండటం వలన పేద ప్రజలకి అందుబాటులో ఉండరు.

పట్టణాలలో ఎక్కువమంది డాక్టర్లు, స్పెషలిస్టులు ఉన్నారు. వీధివీధికీ డాక్టర్లు చాలా మంది ఉన్నారు. హాస్పిటళ్లు చాలా ఉన్నాయి. అయితే వైద్యం చేయించుకునే తాహతు ఎక్కువమంది ప్రజలకు లేదు. నూటికి 99 మంది దగ్గర ఆ స్థాయి వైద్యం చేయించుకోవడానికి డబ్బులుండవు. వ్యవసాయ కుటుంబ నెలసరి ఆదాయం రూ.10,218. పది వేల రూపాయల ఆదాయంతో వైద్య ఖర్చులు భరించే పరిస్థితి లేదు. కోటి రూపాయలు ఖర్చు చేసి డాక్టర్ పట్టా పొందిన డాక్టర్లు ఫీజు ఇవ్వకపోతే చూడరు.

డబ్బుల ప్రమేయం లేకుండా అత్యుత్తమ ప్రపంచ స్థాయి ఆధునిక వైద్యాన్ని ప్రజలందరికీ అందిస్తున్న దేశం క్యూబా. పైసలతో ప్రమేయం లేకుండా జనాభాకు వైద్యం అందించే దేశాలలో బ్రిటన్, కెనడా, జర్మనీ లాంటి దేశాలు కూడా వున్నాయి. అడవులు, కొండల ప్రాంతం-ఎక్కడైనా ప్రేమతో వైద్యం చేసే క్యూబా డాక్టర్లు వున్నారు. సీయరామేస్త్రా అడవులలో కూడా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రజల మధ్య డాక్టర్ నివసించటం ప్రత్యక్షంగా చూశాను. జీవన సూచికలలో అమెరికా లాంటి అభివృద్ధి చెందిన దేశాలకన్నా ముందుంది. దేశం చిన్నదైనా దృఢ దీక్షతో ఏ దేశ ప్రజలకు విపత్తు సంభవించినా తన డాక్టర్లను పంపి ప్రాణ సహాయం చేస్తున్నది. అంటువ్యాధి ఎబోలా సోకిన రోగులకు వైద్యం చేయటానికి అమెరికాతో సహా అందరూ నిరాకరించారు. అయినా క్యూబా డాక్టర్లు ధైర్యంగా ఎబోలా రోగ బాధితులను కాపాడి ఆదర్శంగా నిలిచారు. కరోనా వైరస్ నుండి రక్షణకు వైద్యం చేయటమే కాక వ్యాక్సిన్ కనుక్కొని లాటిన్ అమెరికా దేశాలకు చౌకగా అందించారు. ప్రపంచంలో ప్రజలకు డాక్టర్ అందుబాటులో ఉండే దేశాలలో క్యూబా ప్రథమం. సామాజిక కర్తవ్యంగా వైద్యం చేస్తున్న అక్కడి డాక్టర్లకు జేజేలు. అందుకు పునాదులు వేసిన డా. చే గువేరా మనందరికీ స్ఫూర్తిప్రదాత.

/ వ్యాసకర్త సెల్ : 9000657799 /
/ జులై1 'డాక్టర్స్ డే' /

జనవాక్యం

ఉద్యోగాల విప్లవం ఎక్కడ?

ఎప్పుడో 2021 జూన్‌లో ఉద్యోగాల విప్లవం పేరిట ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ని విడుదల చేసింది. ఇందుకోసం కోట్లు ఖర్చు పెట్టి ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా ద్వారా గొప్పగా ప్రచారం చేయించింది. ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా విడుదల చేసిన ఆ జాబ్ క్యాలెండరు చూసిన నిరుద్యోగులు నిర్ఘాంతపోయారు. ఉద్యోగాలు వేలల్లో ఉంటాయనుకున్నారు. కనీసం పదుల సంఖ్యలో కూడా లేవు. అది ఒక జాబ్‌లెస్ క్యాలెండర్‌గా మిగిలిపోయింది. నేటికీ ఆ జాబ్ క్యాలెండరులో ఉన్న ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వలేదు. గ్రూప్2 ఉద్యోగాలు 2021 ఆగష్టులోనే విడుదల కావాలి. కానీ ఇప్పటి వరకూ అవి విడుదల కాలేదు. కానీ ప్రభుత్వం మాత్రం ఆరు లక్షల ఉద్యోగాలు ఇచ్చినట్లు అసెంబ్లీలో ప్రకటించుకుంది. ఈ ప్రభుత్వంలో ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, పోలీస్ బోర్డు, డిఎస్‌సి ద్వారా ఇంత వరకు ఒక్క పోస్టు కూడా భర్తీ చెయ్యలేదు. మరి ఆరు లక్షల ఉద్యోగాలు ఎక్కడి నుంచి వచ్చాయో నిరుద్యోగులకు ఇప్పటి వరకు అర్థం కావడంలేదు!

- పాలేగార్ శ్రీరాములనాయుడు, పత్తికొండ, కర్నూల్.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @ gmail.com

జాతీయ హాకీకి బోయ హిమబిందు

ప్రజాశక్తి- కర్నూలు స్పోర్ట్స్

జాతీయ హాకీ పోటీలకు కర్నూలు జిల్లా గార్గయపురానికి చెందిన హిమ బిందు ఎంపికైంది. హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో యలమంచిలిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి హాకీ పోటీలలో అద్భుత ప్రతిభ కనపరచిన కర్నూలు గార్గేయపురం విద్యార్థి బోయ హిమబిందు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యిందని హాకీ సంఘం రాష్ట్ర కార్యదర్శి హర్షవర్ధన్ తెలిపారు. హిమబిందు ఈ నెల 28 నుండి జులై 7 వరకు , ఒరిస్సా రాష్ట్రంలోని రూర్కెట్లలో జరిగే 13వ హాకీ ఇండియా జూనియర్ ఉమెన్ జాతీయ స్థాయి పోటీలలో పాల్గొంటుందని జిల్లా కార్యదర్శి దాసరి సుధీర్ తెలిపారు.

15 ఏళ్లుగా నరకయాతన..!

- సా..గుతున్న పోలవరం నిర్వాసితుల పునరావాస కాలనీల నిర్మాణం
- నేటికీ పూర్తికాని పరిస్థితి
- నామమాత్రంగా మౌలిక వసతులు
- జీవనోపాధి లేక అవస్థలు
- అద్దె ఇళ్లల్లో మగ్గుతున్న పలు కుటుంబాలు
- అసంపూర్తిగా తాడువాయిలో నిర్మాణాలు


అసంపూర్తిగా ఉన్న పునరావాస కాలనీ

ప్రజాశక్తి- జంగారెడ్డిగూడెం

'పోలవరం ప్రాజెక్టు కోసం ఉన్నపళంగా గ్రామాలను ఖాళీ చేయమన్నారు.. లేకుంటే బలవంతంగానైనా తరలిస్తామని అధికారులు బెదిరించారు.. మా కోసం అన్ని వసతులతో పునరావాస కాలనీలు నిర్మించామని చెప్పారు.. కానీ ఇప్పటికి 15 ఏళ్లు అవుతుంది. మాకు కేటాయించిన ఇళ్లు ఎక్కడ ఉన్నాయో కూడా కొందరికి తెలియడంలేదు. ఏళ్ల తరబడి దిక్కుతోచని స్థితిలో పునరావాసం కోసం ఎదురు చూస్తున్నాం. పూర్తయిన ఇళ్లలోకి వస్తే కనీస వసతులేక నరకయాతన అనుభవిస్తున్నాం. కనీస వసతులైన రోడ్లు, డ్రైన్లు, వీధి దీపాలు పూర్తిస్థాయిలో నిర్మించలేదు. ప్రభుత్వం స్పందించి నిర్వాసితుల సమస్యలు పరిష్కరించండి' అంటూ పోలవరం నిర్వాసితులు వేడుకుంటున్నారు.

మండలంలోని తాడువాయి పంచాయతీ చల్లావారిగూడెంలో నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల ఆర్అండ్ఆర్ కాలనీ ఇళ్ల నిర్మాణంలో తీవ్ర జాప్యం నెలకొంది. ఇక్కడ 3905 ఇళ్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. ఇప్పటి వరకూ 2452 ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేశారు. మిగతా 411 ఇళ్లు బేస్‌మెంట్ పూర్తయ్యాయి. బేస్‌మెంట్ లెవల్‌లోపు 462, శ్లాబు వరకూ నిర్మించినవి 568, అసలు ప్రారంభం కాని ఇళ్లు 12 ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. మొత్తంగా 62 శాతం మాత్రమే నిర్వాసిత కాలనీ ఇళ్లు పూర్తయినట్లు వెల్లడవుతుంది. సుమారు 15 ఏళ్లుగా పునరావాస ఇళ్ల కోసం ఎదురు చూస్తున్న నిర్వాసితులు ముంపుప్రాంతాల నుండి ఎక్కడికి వెళ్లాలో తెలియక దిక్కుతోచని స్థితిలో సతమతమవుతున్నారు. అనేకమంది నిర్వాసితులు తమకు కేటాయించిన ఇళ్లు ఎక్కడున్నాయో తెలియని గందరగోళం నెలకొంది. వేలేరుపాడు, కుక్కునూరు, పోలవరం మండలాల నిర్వాసితులకు చల్లావారిగూడెం ఆర్అండ్ఆర్ కాలనీలో ఇళ్లను కేటాయించారు. ఈ క్రమంలో నిర్మాణాలు పూర్తయిన ఇళ్లలోకి వేలేరుపాడు, పోలవరం మండలాల నుండి సుమారు 500 కుటుంబాలు చేరుకున్నాయి. కానీ కాలనీవాసులకు మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పించకపోవడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అసంపూర్తిగా రోడ్లు, డ్రైనులు నిర్మించారు. ఇళ్ల చుట్టూ గ్రావెల్ నింపకపోవడంతో చిన్నపాటి వర్షానికే కాలనీలో నీరుచేరిపోతుంది. వీధి దీపాలు ఏర్పాటు చేయలేదు. జీవనోపాధి కల్పించకపోవడంతో నిర్వాసితులు దిక్కుతోచని స్థితిలో కాలంగడుపుతున్నారు. అలాగే మరుగుదొడ్ల నిర్మాణం కూడా అసంపూర్తిగానే చేపట్టారు. బలవంతంగా గ్రామాలను ఖాళీ చేయించి కాలనీకి పంపారని నిర్వాసితులు వాపోతున్నారు. ఏంతూరు మండల నిర్వాసితులకు కేటాయించిన ఇళ్లలో గందరగోళం నెలకొనడంతో పలువురు పేర్కొంటున్నారు. వారికి కేటాయించిన ఇళ్లకు సంబంధించి ఇంటి నెంబర్లు కూడిన పత్రాలున్నప్పటికీ మరోచోట ఇళ్లను చూపుతున్నారని అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతేడాది వచ్చిన గోదావరి వరద ముంపునకు గురైన తమ బంధువుల సర్వం కోల్పోయినప్పటికీ పునరావాస ఇళ్ల నిర్మాణం పూర్తి కాకపోవడంతో అద్దె ఇళ్లల్లో కాలం గడుపుతున్నామని మరికొందరు నిర్వాసితులు వాపోతున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వం కోల్పోయిన నిర్వాసితులకు ప్రభుత్వం సరైన పరిహారం అందించిందని, ఉపాధి కల్పన, మౌలిక వసతులు, విద్య, వైద్యం అందించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని వారు తీవ్రఅసహనం వ్యక్తం చేస్తున్నారు.

జీవనోపాధి కరువైంది
[illegible], పోలవరం నిర్వాసితురాలు

పునరావాస కాలనీలో నివాసం ఉంటున్న నిర్వాసితులకు జీవనోపాధి కరువైంది. ఏ పని చేసుకుని బతకాలో అయోమయంగా ఉంది. కాలనీ సమీపంలో వ్యవసాయ పనులు కూడా దొరకడం లేదు. మా పిల్లల భవిష్యత్తు ఆందోళనకరంగా ఉంది. ప్రభుత్వం దృష్టిసారించి కాలనీవాసులకు జీవనోపాధి కల్పించాలి.

రోడ్లు, డ్రైన్లు నిర్మించాలి
కె.రమణ, వేలేరుపాడు మండలం కరుటూరు నిర్వాసితుడు

పునరావాస కాలనీలో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలి. కొంతమేర మాత్రమే డ్రైనేజీ నిర్మాణం చేపట్టారు. వర్షం వచ్చినప్పుడు నడిచేందుకు ఇబ్బంది పడుతున్నాము.

వీధి దీపాలు ఏర్పాటు చేయాలి
బండి రాంబాబు, కుక్కునూరు మండల నిర్వాసితురాలు

పునరావాస కాలనీలో వీధి దీపాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయాలి. రాత్రి సమయంలో విషసర్పాలు సంచరిస్తున్నాయి. త్వరితగతిన వీధి దీపాలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయాలి.

ఇళ్ల ప్రాంగణంలో గ్రావెల్ నింపాలి
బి.వీరబాబు, కుక్కునూరు మండల నిర్వాసితుడు

పునరావాస కాలనీల ఇళ్ల చుట్టూ గ్రావెల్ మట్టిని నింపాల్సి ఉంది. ఇళ్లలోకి వచ్చి ఏడాది దాటింది. కానీ ఇప్పటివరకూ ఇంటి చుట్టూ మట్టిని నింపే చర్యలు చేపట్టలేదు. అధికారులను అడుగుతున్నా స్పందించడం లేదు.

18 ఏళ్లు నిండిన వారికి రూ.10 లక్షలు ఇవ్వాలి
ఎస్.కె.హుస్సేన్, వేలేరుపాడు మండల నిర్వాసితుడు

18 ఏళ్లు నిండిన వారికి రూ.10 లక్షలు చెల్లిస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలి. కాలయాపన చేయకుండా ప్రభుత్వం దృష్టిసారించి పరిహారం అందించాలి.

ఎంఎస్ఎంఇల కోసం కొత్త బీమా ప్లాన్లు

- ఐసిఐసిఐ లాంబార్డ్ వెల్లడి

ముంబయి : సాధారణ బీమా కంపెనీల్లో ఒక్కటైన ఐసిఐసిఐ లాంబార్డ్ కొత్తగా చిన్న, మధ్య తరహా సంస్థల (ఎంఎస్ఎంఇ)ల కోసం మూడు వినూత్న బీమా పథకాలను ఆవిష్కరించినట్లు ప్రకటించింది. అంతర్జాతీయ ఎంఎస్ఎంఇ దినోత్సవం సందర్భంగా ఎంఎస్ఎంఇ సురక్షా కవచ్ పాలసీ, ప్రాపర్టీ ఆల్ రిస్క్, ఐ- సెలెక్ట్ లయబిలిటీ పాలసీలను విడుదల చేశామని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజీవ్ మంత్రి తెలిపారు.

విపత్తులు, ప్రమాదాలు, ఆస్తి నష్టాల వల్ల కలిగే నష్టాలను ఇవి పూడ్చుతాయని పేర్కొన్నారు.

సరుకు రవాణానే సవాల్

- టెక్నాలజీలోనూ వెనుకబాటు
- పరిమితంగా మూలధనం లభ్యత
- ఎంఎస్ఎంఇలకు అడ్డంకులు



న్యూఢిల్లీ : దేశంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు (ఎంఎస్ఎంఇ) ప్రధానంగా సరుకు రవాణ, టెక్నాలజీ సమస్యలను ఎదుర్కొంటున్నాయి. ఈ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించడానికి పలు సంస్కరణలు అవసరమని నిపుణులు పేర్కొంటున్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ గణంకాల ప్రకారం.. దేశ జిడిపిలో ఎంఎస్ఎంఇలు 27 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ఈ రంగంపై దాదాపు 11.1 కోట్ల మంది ఆధారపడ్డారు. ఎంఎస్ఎంఇ అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా ఆ రంగం సమస్యలపై బిజినెస్ స్టాండర్డ్ ఓ కథనం వెలువరించింది. దేశంలో ఎంఎస్ఎంఇలు ఎదుర్కొంటున్న రవాణ సవాళ్లు చాలా కాలంగా ఆ రంగం వృద్ధికి అవరోధంగా ఉన్నాయి. కరోనా కాలంలో ఎంఎస్ఎంఇ రంగం తీవ్రంగా ప్రభావితమైందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఎంఎస్ఎంఇలకు మరో పెద్ద సవాలు ఇ-కామర్స్ పరిష్కారాలని అభిప్రాయపడుతున్నాయి.


"ఎంఎస్ఎంఇలకు మూలధనం, వనరుల లభ్యత పరిమితంగా ఉంది. ఈ రంగానికి వ్యయ సామర్థ్యం కీలకమైన అంశం. మార్కెట్ పోటీతత్వాన్ని బలోపేతం చేయడానికి, లాభదాయకతను పెంచడానికి చిన్న పరిశ్రమలు తమ థర్డ్ పార్టీ లాజిస్టిక్ పార్టనర్‌ల కార్యాచరణ సామర్థ్యంపై ఎక్కువగా ఆధారపడతాయి." అని గతి లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పిరోజ్‌షా సర్కారీ పేర్కొన్నారు. క్లిష్టమైన సరఫరా చెయిన్ సిస్టం, సరైన గిడ్డంగులు లేక, రవాణా అవస్థాపనలు తరచుగా వ్యయ సామర్థ్యాన్ని సాధించడంలో ఆటంకం కలిగిస్తున్నాయని సిఎబిటి లాజిస్టిక్ ఫౌండర్ శైలేష్ కుమార్ తెలిపారు.

"టెక్నాలజీలు, డేటా-ఆధారిత సాంకేతికతలు సరఫరా చెయిన్ నిర్వహణలో ఎక్కువ సామర్థ్యం, పారదర్శకతను తీసుకువచ్చాయి. ఈ డేటా అనలిటిక్స్ యుగంలో ఎంఎస్ఎంలు వృద్ధి మార్కెట్‌లను గుర్తించడానికి, డెలివరీ పనితీరును అంచనా వేయడానికి డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటున్నాయి. సాంకేతిక మౌలిక సదుపాయాలు, సాఫ్ట్‌వేర్, నైపుణ్యం కలిగిన సిబ్బందిలో పెట్టుబడి పెట్టడం పరిమిత వనరులతో చిన్న వ్యాపారాలకు ఆర్థికంగా సవాలుగా ఉంది." అని శైలేష్ కుమార్ పేర్కొన్నారు.

టాటా ఎఐఎ వినూత్న డిజిటల్ ప్రచారం

ముంబయి : ప్రయివేటు రంగంలోని జీవిత బీమా సంస్థ టాటా లైఫ్ ఇన్స్యూరెన్స్ (ఎఐఎ) వినూత్న డిజిటల్ ప్రచారాన్ని ప్రారంభించినట్లు పేర్కొంది. తమ పిల్లల కలలను నిజం చేయడానికి తండ్రులు పడే కష్టాన్ని 'జాదూ పాకెట్ కా సీక్రెట్' (మ్యాజిక్ పాకెట్ రహస్యం) పేరుతో నూతన క్యాంపెయిన్‌ను ఆవిష్కరించినట్లు పేర్కొంది. నటుడు రజత్ కపూర్‌తో రూపొందించిన ఈ చిత్రంలో టాటా ఎఐఎ ఫార్చ్యూన్ గ్యారెంటీ ప్లస్ సేవింగ్స్ ప్లాన్‌కు ప్రచారం కల్పించనున్నారని తెలిపింది.

ఈ పాలసీ వ్యవధిలో గ్యారంటీ రెగ్యులర్ ఆదాయాన్ని అందిస్తుందని వెల్లడించింది.



హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌లో హెచ్‌డిఎఫ్‌సి విలీనం

ముంబయి : గృహ రుణాల దిగ్గజ సంస్థ హెచ్‌డిఎఫ్‌సి జులై 1 నుంచి హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌లో విలీనం కానుంది. ఈ విషయాన్ని మంగళవారం హెచ్‌డిఎఫ్‌సి ఛైర్మన్ దీపక్ పరేక్ వెల్లడించారు. వీటి విలీనానికి జూన్ 30న ఇరు సంస్థల బోర్డులు సమావేశం కానున్నాయని తెలిపారు. కాగా.. జులై 13న స్టాక్ మార్కెట్‌లో డీలిస్టింగ్ కానున్నాయని హెచ్‌డిఎఫ్‌సి వైస్ ఛైర్మన్, సిఇఒ కెకె మిస్త్రీ వెల్లడించారు. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌లో హెచ్‌డిఎఫ్‌సి విలీనానికి గతేడాది ఏప్రిల్ 4న సూత్రప్రాయ ఆమోదం లభించింది. అనంతరం ఈ విలీనానికి సెబీ, సిసిఐ, ఆర్‌బిఐ తదితర రెగ్యులేటరీ సంస్థలు అంగీకారం తెలిపాయి. విలీన విలువ 40 బిలియన్ డాలర్లతో భారత కార్పొరేట్ చరిత్రలోనే రికార్డ్‌గా నమోదయ్యింది. విలీన అనంతరం ఇరు సంస్థల ఆస్తుల విలువ రూ.18 లక్షల కోట్లకు చేరనుంది. విలీనం అనంతరం హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్‌లో హెచ్‌డిఎఫ్‌సికి 41 శాతం వాటా ఉంటుంది.

ఎఎన్‌యు ఇంజనీరింగ్ ఎంట్రెన్స్ టెస్ట్

- దరఖాస్తులకు జూన్ 30 ఆఖరు తేదీ

ప్రజాశక్తి - ఎఎన్‌యు (గుంటూరు జిల్లా)

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశాల కోసం నిర్వహించనున్న ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు ఈనెల 30తో ముగియనున్నదని ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష కన్వీనర్ ఆచార్య డాక్టర్ జి అనిత వెల్లడించారు. రూ.750 అపరాధ రుసుముతో జులై ఏడు వరకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. హల్ టికెట్‌ల జారీ, ప్రవేశ పరీక్ష తేదీలను త్వరలో తెలియపరుస్తామన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలోని విద్యార్థులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్‌టిసికి రాబడి పెంచాలి

- ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రయాణికులకు నాణ్యమైన సేవలను అందిస్తూ ఆర్‌టిసి రాబడిని పెంచేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎపిఎస్‌ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావు అన్నారు. విజయవాడలోని విద్యాధరపురంలోని ట్రాన్స్‌పోర్టు అకాడమిలో ఆర్‌టిసిలోని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్క్వాడ్, రీజినల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ స్క్వాడ్ ఇన్‌ఛార్జులు, ఇతర తనిఖీ విభాగాల ఇన్‌ఛార్జులతో ఎమ్‌డి సమీక్షించారు. ఆర్‌టిసిలో తనిఖీలను పారదర్శకంగా చేయాలన్నారు. ఒక్క రూపాయి కూడా ఆర్‌టిసికి నష్టం రాకుండా చూడాల్సిన బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వర్తించాలని సూచించారు. సమీక్షలో ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు ఎ కోటేశ్వరరావు, సిటిఎం విజయగీతిక, అకాడమీ ప్రిన్సిపల్ సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

దళిత ద్రోహి చంద్రబాబే

- మంత్రి మేరుగ నాగార్జున

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అధికారంలో వున్నప్పుడు దళితులను అడుగడుగునా అవమానించిన చంద్రబాబే నిజమైన దళిత ద్రోహి అని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున ఆరోపించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఏ చిన్న ఘటన జరిగినా శాంతిభద్రతలకు ముప్పు అని టిడిపి దుష్ప్రచారానికి దిగుతోందన్నారు. చివరకు వ్యక్తిగత సమస్యలను కూడా రాజకీయం చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఏర్పడ్డాకే దళితులకు భద్రత పెరిగిందన్నారు. రాష్ట్రంలో అణగారిన వర్గాల కోసం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తుంటే.. దురహంకారంతో చంద్రబాబు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.

మనువాద ట్రోలింగ్ ముఠాల ఆటకట్టిస్తాం

- జర్నలిస్ట్ తులసిచందుకు అండగా నిలుస్తాం
- 'రౌండ్‌టేబుల్'లో పలు సంఘాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



వాస్తవాలను జీర్ణించుకోలేని మనువాద ట్రోలింగ్ ముఠాల ఆటకట్టించేందుకు ఎక్కడిదాకా వెళ్లేందుకైనా సిద్ధమని, పలు స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలు, జర్నలిస్టు సంఘాలు ప్రకటించాయి. ప్రభుత్వాలు ఆ ముఠాలపై కచ్చితంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. దుర్మార్గమైన అసభ్య భాషతో మహిళలను కించపర్చడం, ప్రగతిశీల ఆలోచనలపై అసహనాన్ని వ్యక్తం చేయడం వ్యవస్థాగతంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టియుడబ్ల్యుజె), ప్రెస్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ (పిసి హెచ్), నెట్‌వర్క్ ఆఫ్ ఉమెన్ ఇన్ మీడియా ఇండియా (ఎన్‌డబ్ల్యుఎం), తెలంగాణ స్టేట్ స్మాల్ అండ్ మీడియం పేపర్స్ అండ్ మేగజైన్స్ అసోసియేషన్ సంయుక్తాధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో 'జర్నలిజం-ట్రోల్ ముఠాలు' అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలోని వక్తలు మాట్లాడుతూ నిజాల్ని పరిశోధించి, పరిశీలించి ప్రగతిశీల భావజాలంతో నిర్భయంగా అనేక అంశాలపై విశ్లేషణాత్మకంగా మాట్లాడుతున్న జర్నలిస్టు తులసి చందుపై బిజెపి మనువాద ట్రోలింగ్ ముఠాలు వ్యక్తిత్వాన్ని కించపర్చేలా సోషల్ మీడియాలో రాతలు రాస్తున్నాయని, అలాంటి చేష్టల్ని ముక్తకంఠంతో ఖండిస్తున్నామని చెప్పారు. తులసి చందుకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. గౌరీ లంకేష్ సహా ప్రగతిశీలంగా ప్రశ్నించే మహిళల్నే ఈ ముఠాలు టార్గెట్ చేస్తున్నాయని, పెయిడ్ ట్రోలింగ్ ముఠాల ఏర్పాటును బిజెపి ప్రారంభిస్తే, ఆ దాడిని ఎదుర్కొనేందుకు అధికారంలో ఉన్న ప్రతి పక్షాలు కూడా ఇలాంటి చర్యలకే పాల్పడుతున్నాయని విమర్శించారు. అందుకే ఇలాంటి చిల్లర రాతలపై ఎవరూ చర్యలు తీసుకోవట్లేదని విశ్లేషించారు. పిరికితనంతో వ్యవహరించే ఇలాంటి ముఠాలు ఎక్కడా సొంతపేర్లు రాసుకోవని, తప్పుడు పేర్లు, చిరునామాలతో నిర్లజ్జ రాతలకు తెగబడుతున్నాయని ఈసడించారు. ప్రజా జర్నలిజం పెరుగుతోందన్నారు. కేంద్రప్రభుత్వం 'మేం చెప్పిందే రైట్-మీరు చెప్పేది తప్పు' అనే ధోరణిలో సోషల్ మీడియా మార్గదర్శకాలను రూపొందించిందని విమర్శించారు. నిజాల్ని నిర్భయంగా చెప్తున్న గొంతులపై కత్తులు స్వైరవిహారం చేస్తున్న రోజుల్లో ఉన్నామని తెలిపారు. ప్రశ్నించే ఆ గొంతుల్ని తప్పక కాపాడుకోవాలని ఆకాంక్షించారు. దానికోసం తులసిచందు వంటి వారికి సంపూర్ణ మద్దతు, సహకారం అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో తులసి చందు, ప్రొఫెసర్ హరగోపాల్, సీనియర్ జర్నలిస్టులు డాక్టర్ కె రామచంద్రమూర్తి, పాశం యాదగిరి, ఆంధ్రజ్యోతి సంపాదకులు కె శ్రీనివాస్, వీక్షణం సంపాదకులు ఎన్ వేణుగోపాల్, ఉస్మానియా యూనివర్సిటీ జర్నలిజం విభాగం మాజీ అధిపతి ప్రొఫెసర్ పద్మజాషా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మీడియా సలహాదారు దేవులపల్లి అమర్, సామాజిక కార్యకర్త సజయ, సీనియర్ జర్నలిస్టు రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌జైన్‌కు వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని గ్రామ, వార్డు సచివాలయాలశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌జైన్‌కు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. విజయవాడలోని గ్రామ, వార్డు సచివాలయ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో మంగళవారం ఉద్యోగుల సంఘం నేతలతో సమావేశం ఏర్పాటుచేశారు. సమావేశంలో తాము ప్రస్తావించిన అంశాల గురించి నేతలు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. ఏ ఉద్యోగికీ లేని యూనిఫాం సచివాలయ ఉద్యోగులకు ఉండటంతో సచివాలయ ఉద్యోగులను ద్వితీయ శ్రేణి ఉద్యోగులుగా పరిగణిస్తున్నారని, యూనిఫాం తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు గ్రామ, వార్డు ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్‌డి జానిపాషా తెలిపారు. విధుల్లో చేరిన రోజు నుంచి నోషనల్ ఇంక్రిమెంట్లు కల్పించాలని, జూనియర్ అసిస్టెంట్ పే స్కేలు వర్తింపజేయాలని, ఉద్యోగులందరికీ ప్రమోషన్ ఛానెల్ కల్పించాలని కోరినట్లు పేర్కొన్నారు. సచివాలయ ఉద్యోగులను రెగ్యులర్ చేసిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపేందుకు సభ ఏర్పాటుకు అనుమతిప్పించాలని స్పెషల్ చీఫ్ సెక్రటరీని కోరినట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి ఉన్నత స్థాయి కమిటీ

సచివాలయ ఉద్యోగులకు ప్రమోషన్ ఛానెల్ ప్రకటించి వాటిని సర్వీసు రూల్స్‌లో పొందుపరచాలని, ఒక ఉద్యోగిపై ఒక శాఖ అధికారుల అజమాయిషీ మాత్రమే ఉండాలని కోరినట్లు ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ అబ్దుల్ రజాక్, ప్రధాన కార్యదర్శి కూన వెంకట సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్‌జైన్‌కు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. వెల్ఫేర్, వార్డు ప్లానింగ్, అమెనిటీస్, వార్డు ప్లానింగ్ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని కోరినట్లు పేర్కొన్నారు.

శ్రీశైల ఆలయంలో రూ.75 కోట్లతో క్యూ కాంప్లెక్సు

- మూడు నెలలకోసారి ఆలయాల ఉద్యోగుల బదిలీలు
- దేవాదాయశాఖ మంత్రి కె సత్యనారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శ్రీశైలం మల్లికార్జున స్వామి ఆలయంలో రూ.75 కోట్లతో క్యూ కాంప్లెక్సులు నిర్మించనున్నట్లు దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. విఘ్నేశ్వరస్వామి ఆలయంలో రూ.3.60 కోట్లతో అన్నదాన భవనం, మరో రూ.4 కోట్లతో క్యూ కాంప్లెక్సు కూడా నిర్మించనున్నట్లు మంత్రి వెల్లడించారు. సచివాలయంలోని ఆయన ఛాంబర్‌లో దేవాదాయ, ధర్మాదాయశాఖ అధికారులతో మంగళవారం ఆయన సమీక్షించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆలయాల్లో ఎటువంటి అవినీతికి ఆస్కారం లేకుండా పటిష్టమైన అకౌంటింగ్ విధానాన్ని అమల్లోకి తెచ్చామన్నారు. ఆలయాల్లో ఇఒ మినహా మిగిలిన ఉద్యోగులను మూడు నెలలకోసారి రొటేషన్ విధానం స్థాన చలనం చేసే విధంగా నిబంధనలను మార్చినట్లు తెలిపారు. ఆలయాల్లో బంగారు ఆభరణాలు సురక్షితంగా ఉన్నాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రంలో నూతన ఆలయాల నిర్మాణానికి, పాత ఆలయాల పునరుద్ధరణకు వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రూ.450 కోట్లు వెచ్చించినట్లు పేర్కొన్నారు.

రూ.195 కోట్లతో దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులు

విజయవాడలోని దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధి పనులు రూ.195 కోట్లతో నిర్వహించనున్నట్లు మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. ఇందులో ప్రభుత్వ నిధులు రూ.70 కోట్లు కాగా, మిగిలిన రూ.125 కోట్లు దేవాలయ నిధులని తెలిపారు. నిధుల్లో ఇప్పటికే రూ.14.70 కోట్ల మేర పనులు పూర్తయ్యాయని, మిగిలిన రూ.55 కోట్లతో ప్రసాదంపోటు, అన్నదానం భవనాలను నిర్మించనున్నట్లు వెల్లడించారు. ప్రసాదంపోటు భవన నిర్మాణానికి ఈ వారంలోనూ, అన్నదాన భవానికి జులై రెండో వారంలోనూ టెండర్లను పిలవనున్నట్లు తెలిపారు. మరో రూ.125 కోట్ల దేవాలయ నిధులతో మల్టీ లెవల్ క్యూ కాంప్లెక్సు, క్యూ కాంప్లెక్స్ నుంచి అన్నదాన భవనానికి వెళ్లేందుకు బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

కారుణ్య నియామకాలపై స్పందించిన ప్రభుత్వం

- బొప్పరాజు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కోవిడ్‌లో చనిపోయిన ఉద్యోగుల కుటుంబాల్లోని ఒకరికి ఖాళీలు, రోస్టర్ పాయింట్లతో సంబంధం లేకుండా కారుణ్య నియామకాలు చేపట్టాలని తాము జిఎడి సెక్రటరీ పోలా భాస్కర్‌ను కోరిన వెంటనే సానుకూలంగా స్పందించారని ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ వలిశెట్టి దామోదరరావు పేర్కొన్నారు. మంగళవారం ఉద్యోగ సంఘాలతో జిఎడి సెక్రటరీ జరిపిన సమావేశంలో పలు అంశాలు ప్రస్తావనకు వచ్చాయన్నారు. గ్రూప్-1 ఆఫీసర్స్, ఆ పై హోదా కలిగిన వారందరికీ ఎసిఆర్‌ను ఆల్ ఇండియా సర్వీస్ ఉద్యోగుల మాదిరిగా ఆన్‌లైన్‌లో ఇకపై పెడతామని తెలిపినట్లు పేర్కొన్నారు. జిఎడి పరిధిలో పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నీ త్వరలోనే పరిష్కరిస్తామని, ఇకపై ఉద్యోగ సంఘాలు గ్రీవెన్స్‌లు జిఎడికి ఆన్‌లైన్‌లో పంపినా న్యాయం చేస్తామని జిఎడి సెక్రటరీ హామీ ఇచ్చినట్లు బొప్పరాజు వెల్లడించారు.

విఆర్‌ఒల సమస్యలు పరిష్కరించాలి : భూపతిరాజు రవీంద్రరాజు

విఆర్‌ఒల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ మంగళగిరి సిసిఎల్‌ఎ కార్యాలయంలో సిసిఎల్‌ఎ సెక్రటరీ ఇంతియాజ్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చినట్లు విఆర్‌ఒల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూపతిరాజు రవీంద్రరాజు, ఎం అప్పలనాయుడు పేర్కొన్నారు.

గతంలో ఉన్న 60:40 శాతం రేషియోను ప్రస్తుతం ఉన్న క్యాడర్ స్ట్రెంక్త్ ప్రకారం 30:70గా మారుస్తూ అన్ని అర్హతలున్న వారికి సీనియర్ సహాయకులుగా, రెవెన్యూ, ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతులు కల్పించడానికి జిఓ నెంబరు 154కు అమెండ్‌మెంట్ చేయాలని కోరినట్లు ఆయన తెలిపారు. గ్రేడ్-2 విఆర్‌ఒల ప్రొబేషన్ విషయంలో వెంటనే చర్యలు తీసుకోవాలని, గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న విఆర్‌ఒలకు సచివాలయంలో ప్రత్యేకంగా ఒక కంప్యూటర్ ఇవ్వడంతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరినట్లు తెలిపారు.

కాపు నేస్తం ద్వారా రూ.1,500 కోట్లు అందించాం

కాపు కార్పొరేషన్ ఛైర్మన్ శేషగిరి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కాపుల సంక్షేమం కోసం కాపునేస్తం కింద ప్రభుత్వం రూ.1,500 కోట్లను ఖర్చు చేసిందని కాపు కార్పొరేషన్ ఛైర్మన్ అడపా శేషగిరి తెలిపారు. తాడేపల్లిలోని కాపు కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం కాపుల సంక్షేమానికి పెద్దయెత్తున నిధులు ఖర్చు చేస్తోందని తెలిపారు. అన్ని ప్రాంతాల్లోనూ కాపు భవన్లు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్లు కిషోర్ కుమార్, ధూళిపూడి ఆంజనేయులు, లక్ష్మీరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రాబడికి గండి

సూర్యనారాయణపై ఎసిబి కేసులో పిపి వాదన

ప్రజాశక్తి-అమరావతి

వాణిజ్య పన్నులశాఖ ఉద్యోగి, ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కెఆర్ సూర్యనారాయణ ప్రభుత్వానికి కోట్ల రూపాయల నష్టం కలిగించారని హైకోర్టుకు రాష్ట్ర పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై నాగిరెడ్డి తెలియజేశారు. వ్యాపారులతో కుమ్మక్కయ్యారని, ఫలితంగా ప్రభుత్వ ఖజానాకు భారీ రాబడి రాకుండా చేశారని చెప్పారు. ఎసిబి నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు కింది కోర్టు నిరాకరించడంతో సూర్యనారాయణ దాఖలు చేసిన పిటిషన్‌ను మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె సురేష్‌రెడ్డి విచారణ జరిపారు. సంబంధం లేని కేసులో పిటిషనరును ఇరికించి వేధిస్తున్నారని సూర్యనారాయణ తరపున న్యాయవాది వాదించారు. దీనిపై హైకోర్టు స్పందిస్తూ.. ముందస్తు బెయిల్ పిటిషన్‌ను వారంలోగా పరిష్కరించాలని ఎసిబి కోర్టుకు గడువు నిర్ణయిస్తామని, అప్పటి వరకు పోలీసులు తొందరపాటు చర్యలు తీసుకోవద్దని ఉత్తర్వులు ఇస్తామని, దీనిపై పిపి వాదనలు బుధవారం వింటామని ప్రకటించింది.

జగన్ ఫొటోకు పాలాభిషేకం

లా నేస్తం కింద యువ న్యాయవాదులకు రూ.6 కోట్లను విడుదల చేసినందుకు మంగళవారం హైకోర్టు ప్రాంగణంలో వైసిపి లీగల్ సెల్ ఆధ్వర్యంలోముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫొటోకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సెల్ అధ్యక్షులు మలసాని మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ మాటలు బాధ్యతారాహిత్యం

- ఎమ్మెల్యే ఆళ్ల నాని

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో వాస్తవ పరిస్థితులను తెలుసుకోకుండా పవన్‌కల్యాణ్ బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే ఆళ్ల నాని విమర్శించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎవరైనా ప్రజల దగ్గరకు వెళ్లి మాకు అధికారం ఇస్తే మేలు చేస్తామని చెప్పుకుంటారని, కానీ అందుకు భిన్నంగా పవన్‌కల్యాణ్ చంద్రబాబును సిఎం చేసేందుకు, జగన్‌ను ధూషించేందుకు వారాహి యాత్ర చేస్తున్నారని అన్నారు. గత ఎన్నికల్లో తనను ఓడించారనే అక్కసుతో ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ప్రశాంతమైన గోదావరి జిల్లాల్లో అలజడి సృష్టించేలా ప్రసంగాలు చేయడం తగదన్నారు. పోలవరం ప్రాజెక్టు పురోగతి లేదని పవన్‌కల్యాణ్ మాట్లాడటం విడ్డూరంగా వుందన్నారు. తెలుగుదేశం హయాంలో స్తంభించిన పోలవరం పనులను జగన్ వచ్చాక పరుగులు పెట్టించారని అన్నారు. అమరావతి పేదలకు ఇళ్లు ఇస్తే టిడిపి నాయకులు తట్టుకోలేకపోతున్నారని ఎంపి నందిగం సురేష్ విమర్శించారు. పేదలకు టిడిపి హయాంలో ఒక్కరికైనా ఇంటి స్థలం ఇవ్వలేదని అన్నారు. జగన్ ప్రభుత్వం 30 వేల మందికి ఇస్తే అడుగడుగునా అడ్డుతగులుతున్నారని విమర్శించారు.

భారత్, కువైట్ మ్యాచ్ డ్రా

శాఫ్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్

బెంగళూరు: శాఫ్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో మంగళవారం భారత్-కువైట్ జట్ల మధ్య జరిగిన చివరి లీగ్ మ్యాచ్ డ్రా అయ్యింది. నిర్ణీత సమయం ముగిసే సరికి ఇరుజట్లు 1-1గోల్స్‌తో సమంగా నిలిచాయి. తొలి అర్ధభాగం ఇంజూరీ సమయంలో సునీల్ ఛెత్రీ ఒక గోల్ కొట్టాడు. దీంతో భారత్ 1-0 ఆధిక్యతలో నిలిచింది. 45+2వ ని.లో ఛెత్రీ ఈ గోల్‌ను కొట్టాడు. అంతకుముందు భారత్, కువైట్‌కు ఒక్కోసారి గోల్ చేసే సువర్ణావకాశాలు లభించినా ప్రయోజనం లేకపోయింది. కువైట్ తరఫున అన్వర్ అలీ(92వ ని.)లో ఒక గోల్ కొట్టాడు. మరో లీగ్ చివరి లీగ్ మ్యాచ్‌లో నేపాల్ జట్టు 1-0తో పాకిస్తాన్‌ను ఓడించి మూడో స్థానంలో నిలిచింది. దీంతో ఈ గ్రూప్ నుంచి కువైట్ ఒక గోల్ అంతరంతో అగ్రస్థానంలో భారత్ 2వ స్థానంలో నిలిచి సెమీస్‌కు చేరాయి.

ముగిసిన లీగ్ పోటీలు

ఐసిసి వన్డే ప్రపంచకప్ క్వాలిఫై టోర్నీ

హరారే: ఐసిసి వన్డే ప్రపంచకప్ క్వాలిఫై టోర్నీలో లీగ్ దశ పోటీలు ముగిసాయి. గ్రూప్-ఏ నుంచి జింబాబ్వే, నెదర్లాండ్స్, వెస్టిండీస్ జట్లు.. గ్రూప్-బి నుంచి శ్రీలంక, స్కాట్లాండ్, ఓమన్ జట్లు ఇప్పటికే సూపర్-6కు చేరాయి. మంగళవారం జరిగిన గ్రూప్-బి ఆఖరి లీగ్ మ్యాచుల్లో శ్రీలంక జట్టు 82పరుగుల తేడాతో స్కాట్లాండ్‌పై నెగ్గి అగ్రస్థానంలో నిలిచింది. శ్రీలంక 49.3 ఓవర్లలో 245పరుగులకు ఆలౌటైంది. నిస్సంక(75), అసలంక(63) అర్ధసెంచరీలతో రాణించారు. గ్రేవ్స్‌కు నాలుగు, వాట్‌కు మూడు వికెట్లు దక్కాయి. ఛేదనలో స్కాట్లాండ్ జట్టు 29 ఓవర్లలో 163పరుగులకు ఆలౌటైంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ తీక్షణకు లభించింది. మరో నామమాత్రపు మ్యాచ్‌లో ఐర్లాండ్ జట్టు 138పరుగుల తేడాతో యుఏఇపై విజయం గెలిచింది. ఐర్లాండ్ 50 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 349పరుగులు చేయగా.. యుఏఇ జట్టు 39 ఓవర్లలో 211పరుగులకు ఆలౌటైంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ స్టెర్లింగ్‌కు లభించింది. ఈ టోర్నీలో ఐర్లాండ్ జట్టుకు దక్కిన ఏకైక విజయం ఇదే.

పాయింట్ల పట్టిక

గ్రూప్-ఏ	మ్యా	గె	ఓ	పా	నె.ర.
జింబాబ్వే	4	4	0	8	+2.24
నెదర్లాండ్స్	4	3	1	6	+0.66
వెస్టిండీస్	4	2	2	4	+0.52
నేపాల్	4	1	3	2	-1.17
అమెరికా	4	0	4	0	-2.16
గ్రూప్-బి					
శ్రీలంక	4	4	0	8	+3.04
స్కాట్లాండ్	4	3	1	6	+0.54
ఓమన్	4	2	2	4	-1.22
ఐర్లాండ్	4	1	3	2	-0.06
యుఏఇ	4	0	4	0	-2.24

నోట్: మ్యా:మ్యాచ్‌లు; గె:గెలుపు; ఓ:ఓటమి; పా:పాయింట్లు; నె.ర.:నెట్‌రన్‌రేట్

ఆషాఢంలోనూ కూర'గాయాలు'

- పలు నగరాల్లో రూ.100 దాటిన టమాట
- పచ్చి మిరప, క్యారెట్, బీన్స్, క్యాప్సికం ధరలూ పైపైకే
- కోడి గుడ్డు రూ.ఏడు పైమాటే



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేశవ్యాప్తంగా కూరగాయల ధరలు సలసల మండుతున్నాయి. ప్రతి ఇంటా సాధారణంగా వినియోగించే అన్ని రకాల కూరగాయలు కిలో రూ.100కు చేరుకుంటున్నాయి. ఇప్పటికే టమాట ధర రూ.100కు మించిపోయి కిందకు దిగనంటోంది. క్యారెట్, బీన్స్, క్యాప్సికం ధరలు సైతం కొండెక్కాయి. ఒక ఉల్లి మాత్రమే ఊరటనిస్తోంది. బెంగళూరు, కర్ణాటక, హైదరాబాద్, కొల్‌కతా, ముంబయి ఇలా అన్ని ప్రధాన నగరాల్లోనూ కూరల ధరలు భగ్గుమంటున్నాయి. సాధారణంగా ఆషాఢం మాసంలో పెళ్లిళ్ల వంటి శుభకార్యాలు తక్కువగా ఉంటాయి. ఈ కాలంలో కూరగాయల ధరలు బాగా తగ్గిపోతాయి. కానీ ఈ ఏడాది మాత్రం కూరగాయలు సామాన్యులకు పెనుభారంగా మారుతున్నాయి. దక్షిణాది రాష్ట్రాల్లో రుతుపవనాల ప్రభావంతో కురవాల్సినంతగా వర్షాలు పడకపోవడం, ఉత్తరాది, ఈశాన్య రాష్ట్రాల్లో బిపర్‌జోయ్ తుఫాను కారణంగా పైర్లు దెబ్బతినడం వల్ల సరుకు తగ్గిపోవడం ఆషాడంలో కూరగాయల ధరాఘాతానికి ప్రధాన కారణంగా మార్కెట్ నిపుణులు తెలియజేస్తున్నారు.

విజయవాడలో ..

రాష్ట్రంలో సైతం పచ్చి మిరప, టమాట ధరలు ఆకాశాన్నంటాయి. విజయవాడ మార్కెట్‌లో మంగళవారం నాడు కిలో పచ్చి మిర్చి ధర రూ.120, అల్లం రూ.220, టమోటా కిలో రూ.50 నుంచి మేలు రకం టమాట రూ.100 వరకు పెరిగాయి. వంకాయ, బెండకాయ, క్యారెట్ తదితర కూరగాయల ధరలు కూడా రూ.80 వరకు పలికాయి.

బెంగళూరులో..

- కర్ణాటకలోని కోలార్ టోకు ధరల ఎపిఎంసి మార్కెట్‌లో 15 కిలోల క్రేట్ టమాటాల ధర ఈ నెల 26న రూ.1100 పలికింది. ఆ మరుసటి రోజు 27న రూ.1500కు ఎగబాకింది. గతేడాది బీన్స్ ధరలు ఆకాశాన్నంటడంతో రైతులు టమాట బదులుగా బీన్స్ సాగు వైపు మళ్లారని, దీంతో టమాట మార్కెట్‌లోకి రావాల్సినంత రావడం లేదని కోలార్‌కు చెందిన రైతు ఒకరు తెలిపారు. వర్షాలు కూడా తగినంత మోతాదులో కురవకపోవడం వల్ల పంటలు ఎండిపోయాయయని, దీంతో టమాట ఉత్పత్తి తగ్గిపోయి మార్కెట్‌కు రావడం లేదని, డిమాండ్ పెరిగి ధరలు పెరిగిపోయాయని సదరు రైతు విశ్లేషించారు. సాధారణ పరిస్థితులతో పోలిస్తే కేవలం 30 శాతం సరుకు మాత్రమే మార్కెట్‌కు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. బంగ్లాదేశ్ వంటి దేశాలకు ఎగుమతి చేసేందుకు మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, ఒడిశా రాష్ట్రాల నుంచి కర్ణాటక మార్కెట్‌కు కూరగాయలు వస్తాయి. ఈ ఏడాది వరదల కారణంగా ఆ రాష్ట్రాల నుంచి కూడా సరుకు నిలిచిపోయింది.
- కర్ణాటకలోని దాదాపు అన్ని నగరాల్లోనూ టమాట కిలో రూ.100, బీన్స్ రూ.120 నుంచి రూ.140, మేలిరకం క్యారెట్ రూ.100, క్యాప్సికం రూ.80 నుంచి రూ.100, కోడి గుడ్డు ఒకటి రూ.7 నుంచి రూ.8 వరకు పలుకుతున్నాయి.
- పాల ధర కూడా అన్ని ప్రధాన నగరాల్లో లీటరు రూ.5 చొప్పున పెరిగే వీలుంది. కర్ణాటక పాత సమాఖ్య (కెఎంఎఫ్) ఇప్పటికే లీటర్‌కు రూ.5 పెంచుకునేందుకు అనుమతి ఇవ్వాలని ఆ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ప్రభుత్వం అనుమతించిన వెంటనే నందిని పాల ధర లీటర్ రూ.5 చొప్పున పెరిగేవీలుంది.
- కూరగాయలు, పాలు, పౌల్ట్రీ ఉత్పత్తులు ఇలా అన్ని ధరలూ నింగినంటితో హోటళ్లలో కూడా ఆహార పదార్థాల ధరలు అమాంతం పెరిగే అవకాశముంది. కొద్ది రోజులు వేచిచూసి ధరల పెంపుపై నిర్ణయం తీసుకుంటామని బృహత్ బెంగళూరు హోటల్స్ అసోసియేషన్ (బిబిహెచ్ఎ) ప్రకటించింది.

మధ్యప్రదేశ్‌లోనూ మంటలు

మధ్యప్రదేశ్‌లోనూ ప్రధాన మార్కెట్లలో కూరగాయల ధరలు మండుతున్నాయి. బుర్హాన్‌పూర్ వ్యవసాయోత్పత్తుల మార్కెట్‌లో కొన్ని వారాల కిందట కిలో రూ.50 పలికిన కూరగాయలు ఇప్పుడు రూ.100 దాటేశాయి. ఇవి ఇంకా పెరిగే అవకాశముందని మార్కెట్ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో సగటున కిలో రూ.30కి విక్రయించిన టమాట ఇప్పుడు కిలో రూ.100 నుంచి రూ.150 కి ఎగబాకాయి. అలాగే మిరపకాయలు కూడా కిలో రూ.100కు చేరాయి.

- రాజస్థాన్‌లోని ముహాన మండిలోనూ పరిస్థితి ఇలానే ఉందని పలు వార్తా సంస్థలు పేర్కొన్నాయి. టమాట, అల్లం ధరలు ఆకాశన్నంటాయి. ముహాన మార్కెట్‌లో టమాట కిలో రూ.60 నుంచి రూ.65 పలుకుతోంది. అల్లం కిలో రూ.190 నుంచి రూ.200 వరకు పలుకుతోంది. నిమ్మకాయలు, కాకర కాయల ధరలు కూడా బాగా పెరిగిపోయాయని ముహాన కూరగాయల టోకు వ్యాపారుల సంఘం అధ్యక్షులు రాహుల్ తవార్ తెలిపారు.

కార్పొరేట్లకు ఎన్‌పిఎ రైటాఫ్ పేరిట రూ.172,800 కోట్లు మాఫీ



దేశ సంపదంతా కార్పొరేట్ల బొక్కసాల్లోకే !

- ఎన్‌పిఎ రైటాఫ్‌ల పేరిట దోచిపెడుతున్న మోడీ సర్కార్
- ఏడాది కాలంలో రూ.172,800 కోట్లు రైటాఫ్

న్యూఢిల్లీ : రైటాఫ్ ..కార్పొరేట్ కంపెనీలకు పెద్ద వరంగా మారింది. ప్రభుత్వ, ప్రయివేటు బ్యాంకుల్లో కార్పొరేట్ సంస్థలు రుణాలు తీసుకొని వాటిని ఎగ్గొట్టితే వాటి మాఫీ చేయడానికి పాలకులు పెట్టిన ముద్దుపేరు రైటాఫ్. సామాజిక భద్రత, సంక్షేమ పథకాలకు భారీగా నిధులను తెగ్గోస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఈ రైటాఫ్‌లు చేసిన సొమ్మును కేపిటిల్ ఫండ్ పేరుతో భర్తీ చేసేందుకు ఉదారంగా నిధులు వెచ్చిస్తోంది. దేశ సంపదను దొడ్డిదారిన ఎన్‌పిఎలో రూపంలో తన కార్పొరేట్ మిత్రులకు దోచిపెడుతోందన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ, ప్రయివేటు బ్యాంకుల్లో కార్పొరేట్ సంస్థలు తీసుకున్న రుణాలను నిరర్థక ఆస్తులు (ఎన్‌పిఎ)గా ప్రకటించి ఈ ఏడాది కాలంలోనే ఏకంగా రూ.172,800 కోట్ల సొమ్మును రైటాఫ్ చేశారు. అంటే ఆ మేరకు కార్పొరేట్ కంపెనీలు లాభపడినట్టే. బ్యాంకులకు ఎన్‌పిఎ రైటాఫ్‌లో జరిగిన నష్టాన్ని మోడీ సర్కార్ మూలనిధి ఫండింగ్ పేరుతో నింపుతోంది. ప్రజల పన్నులు రూపంలో కట్టిన సొమ్ము మొత్తాన్ని ఇలా కార్పొరేట్ కంపెనీలకు తరలుతోంది. విద్య, వైద్యం, ఉపాధి హామీ పథకాలకు నిధులను భారీగా తగ్గించిన మోడీ సర్కార్ రైటాఫ్ రూపంలో అత్యధిక సొమ్మును కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టడం గమనార్హం.

దిగ్భ్రాంతికరం : ఏచూరి

ఇది చాలా దిగ్భ్రాంతికర అంశమని సిపిఎం ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి ట్వీట్ చేశారు. వివిధ రంగాలకు కేటాయించిన నిధులను, ఎన్‌పిఎ రైటాఫ్ సొమ్మును పోల్చి వ్యత్యాసాన్ని పట్టిక రూపంలో ఆయన ట్వీట్ చేశారు. ప్రజాసంక్షేమాన్ని పణంగా పెట్టి కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టడాన్ని మోడీ సర్కార్ మానుకోవాలని ఆయన హితవు పలికారు.

ఆయుధాలు స్వాధీనం

నాగాలాండ్ : సరిహద్దు రాష్ట్రమైన నాగాలాండ్ నుంచి మణిపూర్‌కి తరలిస్తున్న ఆయుధాలను కోహిమా నగరంలో ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించి అస్సాం రైఫిల్స్ కోహిమా పోలీస్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు రక్షణ శాఖ ప్రజా సంబంధాల అధికారి మంగళవారం ఓ ప్రకటనను విడుదల చేశారు. స్వాధీనం చేసుకున్న వాటిల్లో రెండు పిస్టల్స్, నాలుగు మ్యాగ్‌జైన్స్, యుద్ధంలో ఉపయోగించే మందుగుండు సామాగ్రి, పేలుడు పదార్థాలు వంటివి ఉన్నాయి అని పేర్కొన్నారు. కాగా, మణిపూర్‌లో అల్లర్లను పెంచేందుకు నాగాపూర్ మీదుగా అక్రమంగా ఆయుధాలను తరలించేందుకు దుండగులు ప్రయత్నిస్తున్నట్లు రైఫిల్స్ బలగాలకు సమాచారం అందింది. ఈ సమాచారం మేరకు జూన్ 26న తెల్లవారుజామున 2 గంటల సమయంలో అస్సాం రైఫిల్స్, కోహిమా పోలీసులు సంయుక్తంగా స్పెషల్ ఆపరేషన్‌ని నిర్వహించాయి. ఓ ప్రయాణీకుల వాహనాన్ని గుర్తించి, దానిపై నిఘా పెట్టారు. ఈ తనిఖీల్లో మందుగుండు సామాగ్రి, పేలుడు పదార్థాలను పోలీసులు కనుగొన్నారని పిఆర్ఓ ప్రకటన పేర్కొంది.

మణిపూర్‌లో ఆపన్నులకు అందని సాయం

ఇంఫాల్ : ఘర్షణల కారణంగా సర్వం కోల్పోయి నిరాశ్రయులైన మణిపూర్ ప్రజలు సహాయ శిబిరాలలో బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. నిరాశ్రయులైన వారికి ఆహారం, ఇతర నిత్యావసరాలను సరఫరా చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నప్పటికీ వివిధ కారణాలతో అవి వారికి చేరడం లేదు. అధికారిక లెక్కల ప్రకారం రాష్ట్రంలోని 349 శిబిరాలలో యాభై వేల మంది నిరాశ్రయులు తలదాచుకుంటున్నారు. వీరికి ఆహార పదార్థాలు, ఇతర వస్తువులు సరఫరా చేసే వాహనాలపై దాడులు జరుగుతున్న సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. నిత్యావసరాలతో వెళుతున్న వాహనాలను దుండగులు దోచుకుంటున్నారని, తద్వారా ఆపన్నులకు సహాయం అందకుండా చేస్తున్నారని అధికారులు అంటున్నారు. దాడుల నేపథ్యంలో వాహనాలు నడపాలంటేనే డ్రైవర్లు భయపడుతున్నారు. మరోవైపు ఆందోళనల కారణంగా సహాయ కార్యక్రమాలకు అంతరాయం కలుగుతోంది. సహాయ సామగ్రితో వెళుతున్న వాహనాలు ఎక్కడివక్కడ నిలిచిపోతున్నాయి. రహదారుల దిగ్బంధనం కారణంగా పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది.

సన్నకారు రైతులను చిదిమేసేందుకే

- అమెరికా వ్యవసాయోత్పత్తుల దిగుమతులపై అదనపు సుంకం తగ్గింపు నష్టదాయకం
- కిసాన్‌సభ ఆందోళన


విజ్జు కృష్ణన్

న్యూఢిల్లీ : అమెరికా పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మన దేశ రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగించే అనేక ఒప్పందాలపై సంతకాలు చేశారు. ప్రత్యేకించి ఆపిల్, బఠానీలు, మెంతులుతో సహా 8 వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులపై ప్రస్తుతం ఉన్న అదనపు సుంకాలను ఎత్తివేస్తామని ప్రకటించి అమెరికాకు మోడీ సర్కార్ మోకరిల్లింది. దీనివల్ల దేశంలోని రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని అఖిల భారత కిసాన్ సభ ప్రధానకార్యదర్శి విజ్జు కృష్ణన్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యుటిఒ), అమెరికా ఒత్తిళ్లతో దేశ ప్రయోజనాలకు తీవ్ర విఘాతం కలిగించే ఆరు అంశాలపై మోడీ ప్రభుత్వం సంతకాలు చేసినట్లు పలువురు ఇప్పటికే ఆందోళన వ్యక్తం చేశారు. ఇందులో భాగంగానే 8 వ్యవసాయోత్పత్తులపై దిగుమతి సుంకాలను తగ్గించేందుకు అంగీకరించారు. భారత్ నుంచి ఉక్కు, అల్యూమీనియం ఉత్పత్తులను అమెరికాకు ఎగుమతి చేసేందుకు ప్రతిగా ఈ ఒప్పందానికి మోడీ సర్కార్ అంగీకరించినట్లు తెలుస్తోంది. అంటే ఇక్కడ అల్యూమీనియం, ఉక్కు వ్యాపారాలు నిర్వహిస్తున్న మోడీ కార్పొరేట్ మిత్రులకు మేళ్ళ చేసేందుకోసం దేశ వ్యసాయాన్ని సైతం కుంగదీసేందుకు మోడీ సర్కార్ పూనుకోవడం పట్ల సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. భారత్‌తో పోలిస్తే అమెరికా రైతులకు అందే రాయితీలు చాలా ఎక్కువ. వారు సాగు చేసే విస్తీర్ణం కూడా అధికమే. పూర్తిస్థాయి యాంత్రీకరణ మూలాన సాగు ఖర్చులు కలిసోస్తాయి. అంత భారీ స్థాయిలో ఉత్పత్తిదారుల నుంచి వ్యవసాయ పంటలను ఇక్కడకు దిగుమతికి తలుపులు బార్లా తెరిచేస్తే దేశంలో సన్నకారు రైతులు ఆ పోటీలో నిలిచి గట్టెక్కలేరు. తీవ్ర నష్టాలు చవిచూస్తారు. దీనివల్ల దేశ వ్యవసాయ రంగం సంక్షోభంలోకి కూరుకుపోతుందని విజ్జు కృష్ణన్ ఆందోళన వ్యక్తం చేశారు.

భారత్ నుంచి వచ్చే స్టీల్, అల్యూమీనియం ఉత్పత్తుల దిగుమతులపై 2019లో అమెరికా సుంకాలను పెంచిన నేపథ్యంలో అమెరికా నుంచి ఆపిల్ వంటి వ్యవసాయ ఉత్పత్తుల దిగుమతులపై భారత్ 20 శాతం అదనపు డ్యూటీ విధించింది. ఇప్పుడు దానిని ఎత్తివేసింది. అయితే మోస్ట్ ఫేవర్డ్ నేషన్ (ఎంఎఫ్ఎన్) డ్యూటీ (50శాతం) మాత్రమే మిగిలిన దేశాల ఉత్పత్తులతో సమానంగా కొనసాగనుంది.

అస్సాంలో ముస్లిం స్థానాలకు కత్తెర

- ఇసి ముసాయిదాపై నిరసన - 300 మంది అరెస్ట్

గువహతి : అస్సాంలో నియోజకవర్గాల పునర్విభజన పేరిట ముస్లిం జనాభా అధికంగా ఉండే అసెంబ్లీ స్థానాలను కుదిస్తూ కేంద్ర ఎన్నికల కమిషన్ (సిఇసి) ప్రతిపాదించిన ముసాయిదాను బారక్ లోయ ప్రజలు తీవ్రంగా నిరసించారు. సిఇసి నిర్ణయాన్ని తప్పుపడుతూ పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. దీంతో ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు 300 మందికి పైగా నిరసనకారులను అరెస్ట్ చేశారు. అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలతో పాటు స్థానిక సంస్థలలో వార్డులను కూడా పునర్విభజించేందుకు ఎన్నికల కమిషన్ ముసాయిదాను ప్రకటించింది. దీనిని వ్యతిరేకిస్తూ బారక్ ప్రజాస్వామ్య కూటమి బంద్‌కు పిలుపునిచ్చింది. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, ఆల్ ఇండియా యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ మద్దతు తెలిపాయి. లోయలో దుకాణాలు, వ్యాపార సముదాయాలను మూసివేశారు. అధికార బిజెపి అజెండాకు అనుగుణంగానే ఎన్నికల కమిషన్ ముసాయిదాను ప్రతిపాదించిందని ప్రతిపక్ష పార్టీలు విమర్శించాయి. ముస్లింల జనాభా ఎక్కువగా ఉన్న పలు అసెంబ్లీ స్థానాలను రద్దు చేయాలని, వాటిని హిందువులు అధికంగా నివసిస్తున్న వేర్వేరు కొత్త నియోజకవర్గాలలో కలపాలని ఎన్నికల కమిషన్ ప్రతిపాదించింది. బారక్ లోయలో 15 అసెంబ్లీ స్థానాలు ఉండగా వాటిని 13కు తగ్గించాలని ముసాయిదాలో ప్రతిపాదించారు. అలాగే బార్పేటలో స్థానాలను ఎనిమిది నుండి ఆరుకు తగ్గిస్తారు. ఇవన్నీ ముస్లింలు ఎక్కువగా నివసిస్తున్న స్థానాలే. అయితే ఎస్సీలు, ఎస్టీలకు రిజర్వ్ చేసిన స్థానాల సంఖ్యను పెంచుతారు. ముసాయిదా ప్రతిపాదన బారక్ లోయ ప్రజలకు, ముస్లింలకు వ్యతిరేకంగా పన్నిన కుట్ర అని కాంగ్రెస్ ఎమ్మెల్యే కమలాక్ష్య డీ పురుకాయస్థ విమర్శించారు.

బిజెపికి బిఆర్ఎస్ 'బి టీమ్' కాదు

- తెలంగాణ సిఎం కెసిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతు రాజ్యం స్థాపనే బిఆర్ఎస్ పార్టీ లక్ష్యమని తెలంగాణ సిఎం కెసిఆర్ అన్నారు. మహారాష్ట్రలో ఆయన పర్యటిస్తున్న సందర్భంగా విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. 'బిఆర్ఎస్ బిజెపికి బి టీమ్ అంటున్నారని, ఇలాంటి విమర్శ చేసే వాళ్ల అభద్రతాభావానికి, ఓర్వలేని తనానికి ఈ విమర్శ నిదర్శనం. నేను ఎవరి పేరు తీసుకోలేదు. ఎవరినీ విమర్శించడం లేదు. వీళ్లకు దేనికి బాధ? ఎందుకు ఆక్రోశం? ఏ పార్టీకి అధికారం ఇచ్చినా అది ప్రజలు ఇచ్చిందే. మేము ప్రజల దగ్గరికి వెళుతున్నాం. వారి తీర్పును కోరుతున్నాం. ఈ దేశంలో భిన్నమైన ఆలోచనలు చేయకపోతే.. మార్పు దిశగా ఈ దేశం పయనించకపోతే.. సంక్షేమం, అభివృద్ధి సాధ్యం కాదు' అని తెలిపారు.

చిత్రవధ చేసి చంపారు.. గో గూండాల అరాచకం

- అన్సారీ మృతదేహంపై అనేక గాయాలు

నాసిక్ : గో గూండాల దాడిలో చనిపోయిన అఫాన్ అబ్దుల్ అన్సారీ మృతదేహాన్ని చూసిన వారి హృదయం ద్రవిస్తోంది. ఆయనను చిత్రహింసలు పెట్టి చంపారని అర్థమైపోతోంది. దాడిలో అన్సారీ ముక్కు పగిలిపోయింది. నుదుటిపై పెద్ద గాయం కన్పిస్తోంది. ఆయన చేతి వేళ్లు వెనక్కి మెలితిప్పి ఉన్నాయి. చేతిపై కూడా గాయాలు ఉన్నాయి. చెవులపై ఏదో ఒక ఆయుధంతో కొట్టినట్లు కన్పించింది. మొత్తంమీద ఆయన శరీరంపై అనేక గాయాలు ఉన్నాయి. అయితే పోస్ట్‌మార్టం నివేదిక మాత్రం ఇందుకు భిన్నంగా ఉంది. పొత్తికడుపు పైన, తల పైన అయిన గాయాల కారణంగా అధిక రక్తస్రావం జరిగి చనిపోయాడని ఆ నివేదికలో తెలిపారు.

ముంబయికి చెందిన 32 సంవత్సరాల అన్సారీ ఇద్దరు ఆడపిల్లల తండ్రి. మహారాష్ట్రలోని నాసిక్‌లో కారులో మాంసాన్ని రవాణా చేస్తుండగా గో గూండాలు అతనిపై దాడి చేసి చంపారు. అతనితో పాటు ప్రయాణిస్తున్న స్నేహితుడు నాసిర్ ఖురేషీపై కూడా దాడి జరిగింది. అతను ఇప్పుడు చావుబతుకుల మధ్య ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే ఇక్కడ ఆశ్చర్యం కలిగించే విషయమేమంటే చట్ట విరుద్ధంగా జంతువును చంపారన్న అభియోగంపై అన్సారీ, ఖురేషీలపై పోలీసులు కేసు పెట్టారు. అది ఏ జంతువో తెలుసుకునేందుకు మాంసాన్ని ఫోరెన్సిక్ లేబొరేటరీకి పంపారు. మహారాష్ట్రలో ఆవులతో పాటు ఎడ్లను చంపడంపై కూడా నిషేధం అమలులో ఉంది. ప్రభుత్వం తీసుకున్న ఈ చర్యలు గో గూండాలు తమపై దాడి చేసేలా ప్రోత్సహిస్తున్నాయని మాంసం వ్యాపారులు, రవాణాదారులు అంటున్నారు. మాంసాన్ని ముక్కలుగా చేసిన తర్వాత అది ఏ జంతువుదో తెలుసుకోవడం కష్టమని వారు చెప్పారు. నాసిక్ ప్రాంతంలో గత పదిహేను రోజులలో ఇలాంటి సంఘటన జరగడం ఇది రెండోసారి. ఇలాంటి దాడులు జరిగినప్పుడు తమను ఎవరూ కాపాడడం లేదని రవాణా సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఆసియాలోనే అతిపెద్ద పశు వధశాలకు చెందిన షాహిద్ షేక్ వాపోయారు. మాంసాన్ని రవాణా చేయాలంటే డ్రైవర్లు భయపడుతున్నారని ఆయన అన్నారు.

మెరుగైన ఆదాయం కోసం వచ్చి...

అన్సారీ విషయానికి వస్తే నాలుగు నెలల క్రితం వరకూ ఆయన ముంబయిలో ఎయిర్ కండిషనర్లను మరమ్మతు చేస్తుండేవాడు. ఆ తర్వాత మెరుగైన ఆదాయం కోసం మాంసం రవాణా చేయడం ప్రారంభించాడు. సంఘటన జరిగిన 24వ తేదీన అతనికి ఓ ఆర్డర్ వచ్చింది. అహ్మద్‌నగర్ జిల్లాలోని సంగమ్‌నేర్ నగరం నుండి ముంబయికి మాంసాన్ని రవాణా చేయాలని అడిగారు. ఇందుకు అంగీకరించిన అన్సారీ తన స్నేహితుడైన ఖురేషీని వెంట తీసుకొని వెళ్లాడు. కారు టోల్‌ప్లాజా వద్దకు రాగానే కొందరు వ్యక్తులు అటకాయించారు. భయంతో కారును వేగంగా నడుపుతుండగా కార్లు, మోటారు సైకిళ్ల మీద వెంటపడ్డారు. చివరికి వారిద్దరినీ కారు నుండి కిందికి లాగి మరో కారులో ఎక్కించుకొని సమీపంలోని అడవిలోకి తీసికెళ్లారు. అక్కడ వారిని చెట్టుకు కట్టేసి రెండున్నర గంటల పాటు తీవ్రంగా హింసించారు. ఈ దారుణ ఘటనలో అన్సారీ చెంపల ఎముకలు బాగా నలిగిపోయాయి. బూట్లతో అనేక సార్లు అన్సారీ ముఖంపై కొట్టినట్లు అతని శవాన్ని చూసిన వారికి అర్థమవుతోంది. చిత్రహింసల అనంతరం వారిద్దరినీ తాళ్లతో కట్టేసి కారులో వదిలేశారు. ఆ తర్వాత అన్సారీ కుటుంబసభ్యులకు విషయం తెలిసి అక్కడికి వచ్చేసరికే అతను చనిపోయాడు.

పూజారుల నియామకంలో కులానికి పాత్ర లేదు

- మద్రాసు హైకోర్టు రూలింగ్

చెన్నై : ఆలయ పూజారుల నియామకాల్లో 'కులం ప్రాతిపదికగా వుండే పూర్వీకుల వంశ క్రమం' ఎలాంటి పాత్ర పోషించదని మద్రాసు హైకోర్టు సోమవారం తీర్పు చెప్పింది. వేదాల గురించి, వేద కర్మల గురించి బాగా తెలిసి వుండడమే ఇటువంటి నియామకాలకు వుండాల్సిన ఏకైక ప్రామాణికమని పేర్కొంది. సేలం లోని శ్రీ సుగవనేశ్వరర్ స్వామి ఆలయంలో అర్చక పదవుల ఖాళీల భర్తీకి చేసిన ప్రకటనను సవాలు చేస్తూ 2018లో ముత్తు సుబ్రమణియ గురుకుల్ రిట్ పిటిషన్ వేశారు. ఆలయంలో అనుసరించే ఆగమ సిద్ధాంతాలను నియామకాల్లో తప్పనిసరిగా పాటించాలని ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. పైగా ఈ విషయంలో పిటిషనర్, ఇతరుల వారసత్వపు హక్కును ఈ ఉద్యోగ ప్రకటన ఉల్లంఘిస్తోందని పేర్కొన్నారు. ప్రాచీన కాలం నుండి ఆలయంలో వారసత్వ సేవలను అందిస్తున్న తమకే ఈ పదవి రావాలని పిటిషనర్ భావించారు. దానిపై జస్టిస్ ఎన్.ఆనంద్ వెంకటేష్ తీర్పు చెబుతూ, ఆలయంలో పూజారుల నియామకం ఆగమ సిద్ధాంతం ప్రకారమే జరుగుతుందన్నారు. అయితే, సుప్రీం కోర్టు రూలింగ్స్‌ను ఉటంకిస్తూ, పూజారి కులం అనేది మతంలో అంతర్భాగం కాదని ఆ ఉత్తర్వు పేర్కొంది. కులం, జాతితో సంబంధం లేకుండా, ఏ వ్యక్తిని అయినా అర్చకుడిగా నియమించవచ్చునని ఆ ఉత్తర్వులు పేర్కొన్నాయి.


బిజెపి కుంభకోణాలపై విచారణ

- ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

బెంగళూరు : గత బిజెపి ప్రభుత్వ పాలనలో జరిగిన కుంభకోణాలపై విచారణ జరిపించాలని కర్ణాటకలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మంగళవారం అధికారికంగా ప్రకటించారు. బిట్‌కాయిన్ స్కాం, నీటి పారుదల ప్రాజెక్టులు, టెండర్లు, ప్రభుత్వ శాఖల్లో 40 శాతం కమిషన్, కోవిడ్-19 మహమ్మారి సమయంలో వైద్య పరికరాలు, ఔషధాలు కొనుగోలు.. వంటి స్కామ్‌లపై విచారణ జరిపేందుకు పలు ఏజెన్సీలను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. అలాగే మెడికల్ కాలేజీలకు కమిషన్ ఆధారంగా స్టేటస్‌లు ఇవ్వడం, పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ నియామకాల కుంభకోణంపై కూడా విచారణ చేస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు.

వాగ్నర్‌పై క్రిమినల్ కేసు ఉపసంహరణ

- ఎఫ్ఎస్‌బి వెల్లడి
- దేశ ప్రజలకు పుతిన్ కృతజ్ఞతలు



మాస్కో : వాగ్నర్ గ్రూపుపైపెట్టిన క్రిమినల్ కేసును రష్యాకి చెందిన ఎఫ్ఎస్‌బి సెక్యూరిటీ సర్వీస్ ఉపసంహరించుకుందని మంగళవారం రష్యన్ వార్తా సంస్థలు తెలిపాయి. "ప్రత్యక్షంగా నేరానికి పాల్పడేందుకు ఉద్దేశించిన చర్యలను భాగస్వాములు విడనాడినందున" కేసును తొలగించినట్లు రియా వార్తా సంస్థ తెలిపింది. శనివారం రాత్రి పొద్దు పోయిన తర్వాత కుదిరిన ఒప్పందం మేరకు ఈ తిరుగుబాటులో పాల్గొన్న వారిని ప్రాసిక్యూట్ చేయబోమని క్రెమ్లిన్ తెలిపింది. తిరిగి వారు వారి స్థావరానికి వెళ్ళేందుకు అనుమతిస్తామని తెలిపింది. తిరుగుబాటుకు పాల్పడిన వారిని పుతిన్ రాజద్రోహులుగా పేర్కొంటున్నప్పటికీ ప్రిగోజిన్‌ను, ఆయన అనుచరులను ప్రాసిక్యూట్ చేయరాదని క్రెమ్లిన్ నిర్ణయించింది. సాధారణంగా ప్రభుత్వ వ్యతిరేక నిరసనల్లో పాల్గొనే వారి పట్ల క్రెమ్లిన్ చాలా కఠినంగా వ్యవహరిస్తుంది. సుదీర్ఘకాలం జైలుశిక్షలను ఎదుర్కొంటున్న ప్రతిపక్ష నేతలు కూడా వున్నారు. కానీ ప్రిగొజిన్ మాత్రం ప్రాసిక్యూషన్‌ను తప్పించుకున్నారు.

సాయుధ తిరుగుబాటుకు ప్రయత్నం జరిగిన నేపథ్యంలో ఐక్యతను ప్రదర్శించినందుకు అధ్యక్షుడు పుతిన్ దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలియచేశారు. పరిస్థితిని మరీ అధ్వాన్నంగా మార్చి రక్తపాతానికి దారి తీయకుండా సహకరించిన కిరాయి సైనికులకు కూడా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దేశాన్ని కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని పునరుద్ఘాటించారు. కాగా తాను కుట్రకు పాల్పడాలని భావించలేదని, వాగ్నర్ విధ్వంసం కాకుండా నివారించాలన్నదే తన అభిమతమంటూ ప్రిగొజిన్ 11 నిముషాల పాటు గల ఒక ఆడియోను సోమవారం విడుదల చేశారు. "అన్యాయం జరుగుతున్నందున మేం మా ప్రదర్శన ప్రారంభించాం." అని చెప్పారు. తానెక్కడుందీ, తన ప్రణాళికలు ఏమిటి అన్న వివరాలు వెల్లడించలేదు.

భర్త ఆస్తుల్లో భార్యకు సమాన వాటా

- మద్రాస్ హైకోర్టు తీర్పును స్వాగతించిన ఐద్వా

ఇండియా న్యూస్ నెట్‌వర్క్ - న్యూఢిల్లీ

భర్త సంపాదించే అన్ని ఆస్తుల్లోనూ భార్యకు సగ భాగం ఉంటుందని మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును ఆల్ ఇండియా డెమోక్రటిక్ ఉమెన్స్ అసోసియేషన్ (ఐద్వా) స్వాగతించింది. కుటుంబం కోసం కష్టపడి, ఉద్యోగావకాశాలను త్యాగం చేసేది గృహిణి అని తీర్పు తెలిపిందని ఐద్వా పేర్కొంది. భర్త సంపాదిస్తున్న సమయంలో ఇంట్లో ఉంటున్నా. ఆయన సంపాదించిన అన్ని ఆస్తుల్లోనూ 50 శాతం వాటాకు భార్య అర్హురాలని, సంపాదించే భర్త ఇంటికి ఎంత అవసరమో.. గృహిణి కూడా అంతే అవసరమని జస్టిస్ కృష్ణ రామాస్వామి ఇచ్చిన తీర్పు గుర్తించిందని ఐద్వా హర్షం వ్యక్తం చేసింది.

మోడీ రాగం

(మొదటి పేజీ తరువాయి)

అసమతుల్యం చేస్తుంది." అని 1994 నాటి తీర్పు పేర్కొంది.

కేవలం ప్రభుత్వమే కాదు, రాజకీయ పార్టీలు కూడా తమ ఆలోచనా విధానంలో, కార్యాచరణలో లౌకికవాద ధోరణితో వ్యవహరించాల్సి వుందని రాజ్యాంగ ధర్మాసనం నొక్కి చెప్పింది. "అధికారాన్ని సాధించేందుకు లేదా పంచుకునేందుకు రాజకీయ పార్టీలనేవి ఏర్పడ్డాయి. అదే వారి లక్ష్యంగా వుంటుంది. రాజకీయ పార్టీలు లేకుండా ప్రభుత్వ ప్రజాస్వామ్య స్వరూపాన్ని ఎవరూ ఊహించలేరు. అవి రాజకీయ వ్యవస్థలో, రాజ్యాంగ పథకంలో భాగంగా వున్నాయి. లేదా ప్రజాస్వామ్య సమాజం యొక్క పాలనలో అంతర్భాగంగా వున్నాయి. ప్రభుత్వం తన ఆలోచనా తీరులో, కార్యాచరణలో లౌకికవాదంతో వుండాల్సి రావడం రాజ్యాంగానికి అవసరమైతే, అదే అవసరం రాజకీయ పార్టీలకు కూడా వుంటుంది." అని బొమ్మైకేసులో సుప్రీం స్పష్టంగా పేర్కొంది.

ఎస్‌సిఒలో 'న్యూఢిల్లీ హాల్' ప్రారంభం



బీజింగ్ : చైనా రాజధాని బీజింగ్‌లోని షాంఘై కో ఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సిఒ) సచివాలయంలో న్యూఢిల్లీ హాల్‌ను భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ మంగళవారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. న్యూఢిల్లీ హాల్‌ను మినీ ఇండియా అభివర్ణించిన ఆయన ఇది దేశ సంస్కృతిపై మంచి అవగాహనను పెంపొందిస్తుందని తెలిపారు. వచ్చే నెలలో ఎస్‌సిఒ సదస్సు మొదటిసారిగా భారత్ అధ్యక్షతన జరగనుంది. 8 దేశాలు సభ్యులుగా ఉన్న ఎస్‌సిఒ గ్రూప్ సచివాలయం బీజింగ్‌లో ఉంది. చైనా, రష్యా, కజకిస్థాన్, కిర్గి, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్, భారత్, పాకిస్థాన్ సభ్య దేశాలు. ఇప్పటి వరకూ 6 వ్యవస్థాపక దేశాలు చైనా, రష్యా, కజకిస్థాన్, కిర్గి, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్‌కు మాత్రమే ఎస్‌సిఒ సెక్రటేరియట్‌లో ప్రత్యేక హాళ్లు ఉన్నాయి. భారత్ తాజాగా తన ప్రత్యేక హాల్‌ను ప్రారంభించింది. భారత దేశ సంప్రదాయం, నిర్మాణ నైపుణ్యం ప్రతిబింబించేలా హాల్‌ను తీర్చిదిద్దినట్లు మంత్రి చెప్పారు. సమావేశాలతో పాటు వీడియో కాన్ఫరెన్స్‌లు, సినిమా ప్రదర్శనలు, యోగా తరగతులు, నృత్య, సంగీత తరగతులు వంటి వివిధ ప్రయోజనాలకు వీలుగా ఈ హాల్‌లో ఏర్పాట్లు కల్పించినట్లు మంత్రి తెలిపారు.

లిథియం బ్యాటరీ సహ సృష్టికర్త జాన్ గూడెనఫ్ కన్నుమూత



ఆస్టిన్ : నోబెల్ బహుమతి గ్రహీత, లిథియం-అయాన్ బ్యాటరీ సహ సృష్టికర్త జాన్ గూడెనఫ్ వందేళ్ల వయస్సులో మంగళవారం కన్ను మూశారు. ఈ విషయాన్ని టెక్సాస్ యూనివర్శిటీ ప్రకటించింది. పునర్వినియోగపరచదగిన విద్యుత్‌తో సాంకేతిక పరిజ్ఞానాన్ని మార్చిన లిథియం అయాన్ బ్యాటరీని అభివృద్ధిపరచడంలో గూడెనఫ్ కృషి చేసినందుకు 2019లో రసాయన శాస్త్రంలో నోబెల్ బహుమతిని అమెరికన్, జపాన్ శాస్త్రవేత్తలతో పంచుకున్నారు. ఆస్టిన్‌లో ఆదివారం ఆయన కన్నుమూశారని యూనివర్శిటీ ప్రకటించింది. దాదాపు 40ఏళ్ల నుండి టెక్సాస్‌లో ఆయన ఫ్యాకల్టీ సభ్యునిగా వున్నారు. జర్మనీలోని జెనాలో 1922లో జన్మించిన గూడెనఫ్ అమెరికాలో పెరిగారు. చికాగో యూనివర్శిటీ నుండి రసాయన శాస్త్రంలో పిహెచ్‌డి అందుకున్నారు. నోబెల్ అందుకున్న అతిపెద్ద వయస్కుడిగా ఆయన పేరుగాంచారు. '97 ఏళ్ళ వరకు జీవిస్తే మీరేదైనా చేయగలరు' అని ఆయన ఒక సందర్భంలో వ్యాఖ్యానించారు. 65 ఏళ్ళకే రిటైరవమని తనపై ఒత్తిడి రాలేదని అందుకు తాను సర్వదా కృతజ్ఞుడినని ఒకసారి చెప్పుకొచ్చారు. సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు, పేస్‌మేకర్లు నుండి ఎలక్ట్రిక్ కార్ల వరకు లిథియం బ్యాటరీని ఉపయోగించవచ్చు. రీచార్జ్ పోర్ట్‌తో ఈనాడు ఎక్కడికన్నా తీసుకెళ్ళగలిగలా ఫోన్లు, టాబ్లెట్లు, వున్నాయంటే అందుకు సాంకేతిక రంగంలో విప్లవాన్ని తీసుకువచ్చిన గూడెనఫ్ పరిశోధనలే కారణం. లిథియం అయాన్ బ్యాటరీలే మొట్టమొదటి పోర్టబుల్, రీచార్జిబుల్ బ్యాటరీలు. ఇవి అభివృద్ధి చెందడానికి దశాబ్ద కాలంపైగా పట్టింది.

మార్గదర్శి కేసు జులై 20కి వాయిదా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రయివేటు లిమిటెడ్‌పై ఎపి సిఐడి నమోదు చేసిన కేసు వివరాలను అధికారులు మీడియాకు వెల్లడించకుండా ఉత్తర్వులు ఇవ్వాలనే పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టు విచారణ జులై 20కి వాయిదా వేసింది. ఎపి సిఐడి కేసును తెలంగాణ హైకోర్టు విచారణ చేయవచ్చునో లేదో అనే అంశంపై సుప్రీంకోర్టులో ఉన్న కేసు విచారణ జులై 18న విచారణ జరగనుందని, అప్పటి వరకు ఇక్కడి కేసులో ఉత్తర్వులు జారీ చేయవద్దని సిఐడి కోరింది. మార్గదర్శి కేసు వివరాల్ని సిఐడి ఆఫీసర్లు మీడియాకు వెల్లడించకుండా ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ రామోజీరావు, శైలజ, మార్గదర్శి చిట్ ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ సివి భాస్కర్‌రెడ్డి విచారణ చేపట్టారు. మార్గదర్శి అక్రమ మార్గాలద్వారా చట్ట వ్యతిరేకంగా తరలించిన డబ్బంతా ఖాతాదారులదేనని ఎపి గవర్నర్‌మెంట్ స్పెషల్ ప్లీడర్ గోవిందరెడ్డి చెప్పారు. ఏవిధమైన మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయనక్కర్లేదన్నారు. ఇప్పటికే అనేక పిటిషన్లు వేసిన మార్గదర్శికి హైకోర్టు ఏవిధమైన ఉత్తర్వులు ఇవ్వలేదన్నారు. దర్యాప్తు కొనసాగించకుండా మీడియాకు వివరాలు ఎందుకు వెల్లడిస్తున్నరని, మీడియా ట్రయిల్ కరెక్టు కాదని సిఐడిని ఉద్దేశించి హైకోర్టు వ్యాఖ్యానించింది. మీడియాకు ఎందుకు వివరాలు వెల్లడిస్తున్నారో చెప్పాలని ప్రతివాదులను ఆదేశించింది. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించింది. విచారణను జూలై 20కి వాయిదా వేసింది.





మీకోసం

పచ్చి బఠానీలను ఉడికించేటప్పుడు చిటికెడు పంచదార కలిపితే రంగు మారకుండా ఉంటాయి.

జీవన సౌరభం

ఒక మేధావి శ్రమ ఫలితం కొన్ని లక్షల మంది సామాన్య ప్రజలకు ప్రయోజనకరంగా మారుతుంది.

వాన వచ్చింది !



వాన వాన వచ్చింది
వాకిట ముందు కురిసింది
చల్లని గాలి వీచింది
ఉక్కపోతను తరిమింది

చెట్టు నిండుగా తడిసింది
పచ్చని చిగురు వేసింది
ప్రకృతి పచ్చగా మెరిసింది
పుడమికి కాంతిని తెచ్చింది

నాగలి దున్నుతూ పోయింది
చేను సాగును చేసింది
విత్తులు వత్తుగా విత్తింది
మొక్కకు ప్రాణం పోసింది

చెరువు నిండుగా తొణికింది
కాలువ బాగా పారింది
పడవ నీటిలో పరిగెత్తింది
మనసుకు హాయిని తెచ్చింది

చిటపట చినుకు కురిసింది
వడగళ్ళు దోసిలి నింపింది
శీతల బల్బులు వెలిగించింది
తొలకరి గురుతుకు తెచ్చింది

నేలకు తాపం పోగొట్టింది
ఎండమావిని తరిమేసింది
భూమిని తడిగా వుంచింది
ఆహ్లాదాన్ని కలిగించింది

మేఘాల గుంపు చేరింది
చినుకు చినుకుగా రాలింది
వాగు వంకలై పొర్లింది
చివరికి సంద్రంలో కలిసింది!

- నరెద్దుల రాజారెడ్డి
96660 16636

లెక్క తేల్చండి



చిన్నారులూ... ఇక్కడున్న పట్టికలో రకరకాల బొమ్మలున్నాయి. వాటిని నెంబర్లు గా గుర్తించి గణించాము. చివరి లైన్లో ఉన్న బొమ్మల అంకెల ఆధారంగా మీరు జవాబు రాబట్టండి.

నేను గీసిన బొమ్మ



- సాయి సృష్టి,
2వ తరగతి,
మౌంట్ లెటర్స్ స్కూలు,
హైదరాబాద్.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

కెమెరాతో పర్యావరణ పరిరక్షణ

కీర్తి ... ఓ ప్రైవేట్ కళాశాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్. కరోనా సమయంలో ఖాళీగా ఉండలేక మొదలు పెట్టిన ఫొటోగ్రఫీ తనకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చి పెట్టింది. అందుకు కారణం... ఆమె ప్రకృతిపై జరుగుతున్న వినాశనాన్ని, జీవావరణంపై మనుషులు చేస్తున్న విపరీత చర్యలను తన ఫొటోల ద్వారా వెల్లడించింది. ఓ వైపు విద్యార్థులకు పాఠాలు చెబుతూనే... పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తోంది.



తమిళనాడులో కళ్లకురిచికి చెందిన కీర్తి సెల్వరాజ్ సివిల్ ఇంజనీర్ పూర్తి చేశారు. ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. లాక్‌డౌన్ సమయంలో ఇంట్లో ఖాళీగా ఉండటం ఇష్టం లేక అలా పొలాల వెంట, చెరువు గట్ల మీద తిరుగుతూ ప్రకృతిని ఆస్వాదిస్తూ ఉండసాగింది. ఈ క్రమంలో ఓ కెమెరా చేత పట్టుకుని నచ్చిన పక్షులను, సరస్సులను, నదులను ఫొటోలు తీసి తన సోషల్ మీడియాలో పోస్టు పెడుతూ ఉండేది. అది చూసిన స్నేహితులు ఇటువంటి పక్షులు అంతరించిపోతున్నాయి. చాలా తక్కువ సంఖ్యలో ఉన్నాయంటూ కామెంట్లు చేయసాగారు. అవి చదివిన కీర్తి... వీటిపై అధ్యయనం చేయాలనుకుంది. చుట్టుపక్కల గ్రామాల్లో, జిల్లా వ్యాప్తంగా తిరుగుతున్న సుమారు 155 రకాల పక్షుల గురించి వివరాలు సేకరించి పుస్తకాన్ని ముద్రించింది. అంతేకాదు; వాటి పూర్తి వివరాలను అంతర్జాతీయ డేటా సర్వే ప్లాట్‌ఫారమ్ అయిన 'ఎబర్డ్'లో రికార్డ్ చేసి ఉంచింది. అలా ప్రకృతి ప్రేమికురాలిగా మారింది.

సమస్యను తెలియజేస్తూ ...

సాధారణంగా ఎవరైనా చేతిలో కెమెరా ఉంటే ప్రకృతిలో అరుదుగా కనిపించే దృశ్యాలు, వింతలను, మనసుకు ఆహ్లాదాన్నిచ్చే వాటిని వెంటనే క్లిక్ చేస్తూ ఉంటారు. కాని కీర్తి మాత్రం తన కెమెరాతో ప్రకృతిని నాశనం చేసే దృశ్యాలు కనిపిస్తే చాలా ఆమె కెమెరా క్లిక్ మంటుంది. నీటి వనరులను ప్లాస్టిక్ వ్యర్థాలతో కాలుష్యం చేయడాన్ని ఫొటోలు తీసి స్థానిక అధికారులకు పంపించింది. ఇలా జిల్లా వ్యాప్తంగా నీటి వనరుల్లో జరుగుతున్న ప్లాస్టిక్ బాటిళ్లు, న్యాప్‌కిన్లు, ఇతరత్ర కాలుష్యాన్ని కలిగించే దృశ్యాలు, విశాలమైన సముద్రంలో వదిలేసిన ఫిషింగ్ వలలు, ప్లాస్టిక్ చెత్తలో చిక్కుకున్న తాబేళ్లను, వాటిల్లో చిక్కుకుని చనిపోయిన జీవరాశులు... ఇలా ఎన్నో ఫొటోలను కలెక్టర్ వరకూ తీసుకెళ్లి పరిష్కారం దిశగా ప్రయత్నించింది.

ఆయా ప్రాంతాల్లో విద్యార్థులతో కలిసి ప్రకృతి పరిరక్షణ కార్యక్రమాలు నిర్వహించింది. దానితో పాటు 'నేను– నా పక్షి', ప్రకృతి వినాశనం చేస్తున్న ఛాయాచిత్రాలను ప్రతి ఒక్కరికీ పంచి ఇచ్చి, వారిలో పర్యావరణ ప్రాముఖ్యత దిశగా ఆలోచన కలిగించింది. అలా తన ఫొటోల ద్వారా పర్యాపరిక్షణకు కృషి చేసింది. కళ్లకురిచిలోని కీలకమైన నీటి వనరు అయిన గోముఖి డ్యామ్ వ్యూ పాయింట్ వద్ద ఐదు వేల మంది విద్యార్థులతో ఆమె చేసే క్లీన్ అప్ కార్యకలాపాల్లో భాగస్వామ్యం అయ్యారు. అలాగే భూగర్భ జలాలు పెంచే దిశగా మొక్కలను పెంచే ప్రయత్నం ప్రారంభించింది. డ్యామ్ సమీపంలో విద్యార్థులతో కలిసి వెయ్యికి పైగా తాటి విత్తనాలను నాటారు.

ఉద్యోగం వదిలి ...

మానవ తప్పిదాల వల్ల తరిగిపోతున్న అడువులు, జలవనరులను చూసి భవిష్యత్తులో ముప్పు పొంచి ఉందని కీర్తి గ్రహించింది. అందుకే తన ప్రొఫెసర్ ఉద్యోగాన్ని వదిలి పూర్తిగా పర్యావరణ పరిరక్షకురాలిగా బాధ్యతలు చేపట్టింది. ప్రకృతి పట్ల ప్రేమను కనబరచాలంటూ జిల్లా వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఏవియన్ జాతులను రక్షించాలని ఆమె అన్వేషణలో భాగంగా అటవీ శాఖతో కలిసి పని చేస్తోంది. ఆమె సేవలను గుర్తించిన అధికారులు గ్రీన్ ఛాంపియన్ అవార్డు 2022 అందించి, అభినందించారు.





పిల్ల కొంచెం.. రాత ఘనం ...

పట్టుమని పదేళ్లు కూడా లేని ఆ పిల్ల.. అక్షరాల తోటలో పుస్తకాల పువ్వులను పెంచుతోంది. గొప్ప సృజన, భావోద్వేగం, ఆలోచనా సరళితో రచనలు వెలువరిస్తోంది. జూన్ 19న జాతీయ పఠనా దినోత్సవం రోజున 'అప్పూప్పంథదికల్' అనే పేరుతో తన రెండో పుస్తకాన్ని వెలువరించింది. ఇంత చిన్న వయసులో గొప్ప గొప్ప సాహిత్యవేత్తలను సైతం ఆశ్చర్యానికి గురిచేసే రచనా సరళిని సొంతం చేసుకున్న ఆ బాలిక పేరు భద్ర.

కేరళకు చెందిన భద్ర లాక్‌డౌన్ సమయంలో దొరికిన విరామ సమయంలో చిన్న చిన్న కథలతో తొలి పుస్తకాన్ని వెలువరించింది. సాహిత్యలోకంలో ఆ పుస్తకం ఓ సంచలనం సృష్టించింది. 'కుంజుమేఘం' పేరుతో వెలువరించిన ఆ పుస్తకానికి దొరికిన ప్రోత్సాహం ఆమెను మరిన్ని సంకలనాలు చేసే దిశగా ప్రేరేపించింది.

చిన్న పిల్ల ఏం రాస్తుంది? అంతలా ఆ పుస్తకంలో అబ్బురపరిచే సంగతులేమి ఉంటాయి అన్న అనుమానం చాలామందికి రావొచ్చు.. 'భద్రకు చదవడం, రాయడం చాలా ఇష్టం. వాటితో గడుపుతూ తనను తాను ఆ ప్రపంచంలోకి తీసుకుపోతుంది. అక్కడ తనకు ఎదురైన అనుభవాలు, భావోద్వేగాలతోనే రాయడం మొదలుపెడుతుంది' అని చెబుతున్నారు భద్ర తల్లిదండ్రులు సుమేష్, సుభ. 'మాకు పుస్తకాలు చదవడం ఇష్టం. ఆ అభిరుచితో తరచూ లైబ్రరీకి వెళ్లేవాళ్లం. మాతో పాటు భద్రను కూడా తీసుకెళ్లేవాళ్లం. అక్కడే ఆమె పుస్తకాలు చదవడం ప్రారంభించింది. వాక్యాలు చదవడం, చాలా శ్రద్ధగా వాటి అర్థాలు తెలుసుకుంటూ ఎప్పుడూ పుస్తకాలతోనే గడిపేది. అప్పుడే ఆమెలో రచయిత దాగుందని కనిపెట్టాను' అంటోంది తల్లి సుభ.

తొలి అడుగు..

కోవిడ్ సమయంలో భద్ర ఉంటున్న అవనీర్ ప్రాంతంలో గల 'ప్రతిభా లైబ్రరీ' పుస్తకపఠనంపై ఓ ఛాలెంజ్ ప్రవేశపెట్టింది. అయితే అందులో భద్ర చుట్టుపక్కల ఉన్న ఏ పిల్లలూ పాల్గొనలేదు. భద్ర ఒక్కత్తే ఆ ఛాలెంజ్‌ను తీసుకుంది. ఆరు నెలల్లో 75 పుస్తకాలు చదవడమే కాక, వాటిని ప్రశంసిస్తూ లేఖలు కూడా రాసింది.

'నేను ఆమెకు ఓ పాత డైరీని ఇచ్చాను. రోజువారీ పనులు రాసుకుంటుందనుకున్నాను. కానీ భద్ర దాన్ని తన ఊహలు, ఆలోచనలతో నింపేసింది. తన అనుభవాలు రాయడం మొదలుపెట్టింది. ఉదాహరణకు తను చూసిన పిల్లి లేదా పిల్లలు ఏదైనా కావొచ్చు.. తన దృష్టిలో పడిన దేని గురించైనా రాస్తూ ఉండేది. ఇప్పుడు తన రెండో పుస్తకంలో చివరి కవితలో కొన్ని రోజుల క్రితం మా ఇంటి ఆవరణలో కదలకుండా పడి ఉన్న కాకి గురించి రాసింది. ఇలా ఆమె రచనలన్నీ పిల్లల ఆలోచనల నుండే పుట్టుకొస్తాయి' అని చెబుతున్నారు తండ్రి సుమేశ్.

'భద్ర మా స్కూల్లో చదవడం మాకు చాలా గర్వ కారణంగా ఉంది' అంటూ వరదియమ్ ప్రభుత్వ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న భద్ర గురించి స్కూలు యాజమాన్యం చెబుతోంది. ఆ చిన్నారి రాసిన రెండో పుస్తకాన్ని ఇటీవలె స్కూలు ఆవరణలో స్థానిక ప్రజా ప్రతినిధితో ఆవిష్కరింపజేశారు. తన తోటి పిల్లలందరి మధ్య నుంచి కరతాళ ధ్వనులు మిన్నంటుతున్న వేళ భద్ర ఆ పుస్తకాన్ని పైకెత్తి చూపుతూ.. 'ఇది మనందరి ఆలోచనలు, అనుభవాలతో రాసిందే.. మీలో ప్రతి ఒక్కరిలో ఏదో ఒక శక్తి దాగుంది. దాన్ని బయటికి తీయండి. బాల్యం మనకు లభించిన గొప్ప వరం. ఈ సమయాన్ని వృధా చేసుకోకండి' అంటూ ఎంతో స్ఫూర్తివంతంగా మాట్లాడింది. అందుకే పిల్ల కొంచెం.. రాత ఘనం.. అన్నది.



'బ్రో' కొత్త పోస్టర్

మేనల్లుడు సాయిధరమ్‌తో కలిసి పవన్ 'బ్రో' మూవీ చేస్తున్నాడు. తమిళంలో సూపర్ హిట్టయిన 'వినోదయ సిత్తం'కు రీమేక్‌గా ఈ సినిమా తెరకెక్కుతుంది. ఒరిజినల్ వెర్షన్‌ను తెరకెక్కించిన సముద్రఖని రీమేక్ వెర్షన్‌ను కూడా తెరకెక్కిస్తున్నాడు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం ప్యాచ్ వర్క్‌ను కంప్లీట్ చేసుకుంది. ఈ నేపథ్యంలో ఓ పోస్టర్ విడుదల చేశారు మేకర్స్. టీజర్ అప్‌డేట్‌ను త్వరలోనే ప్రకటించబోతున్నారు. పోస్టర్‌లో పవన్, సాయిధరమ్ లుంగీలు కట్టుకుని, మెడల ఎర్ర కండువా వేసుకుని కూలీ గెటప్‌లో కనిపించారు. ఒక యాక్సిడెంట్‌లో చనిపోయిన ఓ వ్యక్తి.. తాను చేయాల్సిన పనుల కోసం తిరిగి భూమి మీదకు రావడం, వాటిని పూర్తి చేయడం వంటి కథాంశంతో ఈ సినిమా సాగుతుంది. తెలుగు నెటివిటీకి తగ్గట్లు త్రివిక్రమ్ పలు మార్పులు చేర్పులు చేశారు. పీపుల్ మీడియా సంస్థ నిర్మిస్తున్న ఈ సినిమాకు థమన్ సంగీతం అందిస్తున్నాడు.

దర్యాప్తు జరపండి..




హీరో యంగ్ టైగర్‌కి కోట్లాది మంది అభిమానులు ఉన్నారు. వారి అభిమాని అయిన శ్యామ్ ఈ మధ్యకాలంలో అనుమానాస్పదంగా మరణించారు. ఈ వార్త ఇప్పుడు బయటకు వచ్చింది. దాంతో అతని అభిమానులతో సహా ఇతర స్టార్ హీరోస్ అభిమానులు కూడా శ్యామ్ మరణానికి న్యాయం జరగాలని సోషల్‌మీడియా వేదికగా డిమాండ్ చేస్తున్నారు. మరి క్రమంలో ఈ విషయం ఎన్టీఆర్‌కు తెలిసింది. దాంతో తన స్పందనను అధికారులకు తెలియజేశారు. 'శ్యామ్ మరణం అత్యంత బాధాకరమైన సంఘటన. శ్యామ్ తల్లిదండ్రులకి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. శ్యామ్ ఎటువంటి పరిస్థితుల్లో ఎలా చనిపోయి ఉంటాడో తెలియకపోవడం అనేది నా మనసును కలచివేస్తుంది. ప్రభుత్వ అధికారులు ఈ విషయంపై తక్షణమే దర్యాప్తు జరపాలని విజ్ఞప్తి చేస్తున్నాను' అని ఓ ఎమోషనల్ ప్రెస్ నోట్‌ని విడుదల చేశారు.

పోలీస్ పాత్రలో ...



వక్కంతం వంశీ దర్శకత్వంలో నితిన్ హీరోగా ఓ సినిమా రూపుదిద్దుకొంటోంది. శ్రీలీల ఈ చిత్రంలో కథానాయిక. ఇందులో నితిన్.. పోలీస్‌గా కనిపిస్తాడని టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాలో పోలీస్ పాత్రకూ, అందులో భాగంగా వచ్చే సన్నివేశాలకూ చాలా ప్రాధాన్యం ఉందని తెలుస్తోంది. ఈ పాత్ర కోసమే నితిన్ తన బాడీ లాంగ్వేజ్‌నీ, గెటప్‌నీ మార్చేస్తున్నాడని సమాచారం. 'జూనియర్', ఎగ్‌స్ట్రా ఆర్డినరీ మెన్' టైటిళ్లు పరిశీలిస్తున్నారు. త్వరలోనే ప్రకటించే అవకాశం ఉంది.

తిరిగి షూటింగ్‌లోకి...



టాలీవుడ్ యువ హీరో వరుణ్ తేజ్ ప్రస్తుతం నటిస్తున్న చిత్రం 'విటి13'. వార్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రానికి శక్తి ప్రతాప్ సింగ్ హడ డైరెక్ట్ చేస్తున్నాడు. ఈ మూవీలో వరుణ్ తేజ్ ఫైటర్ పైలట్‌గా నటిస్తున్నాడు. మాజీ మిస్ యూనివర్స్ మానుషి ఛిల్లార్ ఫీ మేల్ లీడ్ రోల్ పోషిస్తోంది. కొన్ని రోజులుగా నిశ్చితార్థం, ఇతర పనులతో బిజీగా ఉన్న వరుణ్‌తేజ్ ఈ సినిమా షూటింగ్‌తో మళ్లీ బిజీ అయ్యాడు. వరుణ్‌తేజ్ పైలట్ పాత్ర కోసం షార్ట్ హెయిర్ లుక్‌లో ఐఎఎఫ్ ఆఫీసర్‌గా స్టైలిష్ అవతార్‌లోకి మారిపోయిన స్టిల్స్‌ను మేకర్స్ షేర్ చేశారు. యథార్థ సంఘటనల ఆధారంగా వస్తోన్న ఈ చిత్రాన్ని భారత వైమానిక దళానికి అంకితం చేస్తూ, తెరకెక్కిస్తున్నారు. సోనీ పిక్చర్స్–రెనాయ్‌సెన్స్ పిక్చర్స్ బ్యానర్లపై సందీప్ ముద్ద, నందకుమార్ అబ్బినేని తెరకెక్కిస్తున్నారు.

రీమేక్ కాదు ...



పవన్ కళ్యాణ్, హరీష్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంపై ఎప్పటినుండో ఒక టాక్ నడుస్తోంది. ఈ సినిమా తమిళ సినిమా 'తేరి'కి రీమేక్ అని గతంలో వచ్చిన వార్తలు బాగా వైరల్ అయ్యాయి. అయితే 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాకు రచయితగా పని చేస్తున్న దశరథ్ తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తేరి సినిమా నుంచి కేవలం బేస్ లైన్‌ను మాత్రమే హరీష్ శంకర్ తీసుకున్నారని, పూర్తిగా సొంత కథతోనే ఈ సినిమా తెరకెక్కుతోందని చెప్పినట్లు సమాచారం. ఈ సినిమాలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది.

మలయాళ దర్శకుడు మృతి



మలయాళ సినీ దర్శకుడు బైజు పరవూర్ (42) మంగళవారం మృతిచెందారు. మూడు రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురైన ఆయన కేరళలోని కొచ్చి సిటీలోగల ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఫుడ్ పాయిజన్ కారణంగానే ఆయన మరణించి ఉంటారని కుటుంబ సభ్యులు, బంధువులు భావిస్తున్నారు. బైజు పరవూర్ ఇప్పటివరకు 45 చిత్రాలకు దర్శకుడిగా పనిచేసినట్లు సమాచారం.

అహ్మదాబాద్‌లోనే భారత్Xపాక్ మ్యాచ్

అక్టోబర్ 5న ఇంగ్లండ్ × న్యూజిలాండ్ మ్యాచ్‌తో షురూ • ఉప్పల్‌లో మూడు మ్యాచ్‌లు

వన్డే ప్రపంచకప్ షెడ్యూల్‌ను విడుదల చేసిన ఐసిసి



వన్డే ప్రపంచకప్ ట్రోఫీని ఆవిష్కరిస్తున్న ఐసిసి–బిసిసిఐ ప్రతినిధులు

దుబాయ్: ఐసిసి వన్డే ప్రపంచ కప్ షెడ్యూల్ విడుదలైంది. భారత్ వేదికగా అక్టోబర్‌లో జరిగే ఈ మెగా టోర్నీలో మ్యాచ్‌ల షెడ్యూల్‌ను అంతర్జాతీయ క్రికెట్‌మండలి(ఐసిసి) మంగళవారం విడుదల చేసింది. అక్టోబర్ 5న అహ్మదాబాద్ వేదికగా ఇంగ్లండ్–న్యూజిలాండ్ జట్ల మధ్య జరిగే తొలి మ్యాచ్‌తో 13వ ఐసిసి వన్డే ప్రపంచకప్ టోర్నీ సమరం మొదలుకానుంది. టైటిల్‌కై మొత్తం 10జట్లు తలపడనున్నాయి. ప్రతి జట్టు లీగ్ దశలో 9మ్యాచ్‌లు ఆడనుంది. లీగ్ దశ ముగిసిన తర్వాత టాప్–4లో ఉన్న జట్లు సెమీఫైనల్స్ ఆడనున్నాయి. అక్టోబర్ 8న ఆస్ట్రేలియాతో భారత్ తన తొలి మ్యాచ్‌లో తలపడనుంది. అహ్మదాబాద్ వేదికగా అక్టోబర్ 15న భారత్–పాకిస్తాన్ జట్ల మధ్య హై–టెన్షన్ మ్యాచ్ జరగనుంది. నవంబర్ 15, 16న ముంబయి, కోల్‌కతా వేదికగా సెమీఫైనల్, అహ్మదాబాద్ వేదికగా నవంబర్ 19న ఫైనల్ మ్యాచ్ ఉంటుంది. రెండు సెమీఫైనల్స్‌తో పాటు ఫైనల్ మ్యాచ్‌కు రిజర్వ్ డే(నవంబర్ 20) ఉంది. హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో మూడు మ్యాచ్‌లు జరగనున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ స్టేడియంకు ఒక్క మ్యాచ్‌నూ కేటాయించలేదు. ధర్మశాల, ఢిల్లీ, లక్నో, పుణె, ముంబయి, అహ్మదాబాద్, హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, కోల్‌కతా వేదికలుగా మొత్తం 48 మ్యాచ్‌లు జరగనున్నాయి. పాకిస్తాన్ రెండు వేదికలు (చెన్నై, బెంగళూరు) తమకు అనుకూలంగా లేవంటూ అభ్యంతరం వ్యక్తం చేసినా.. ఐసిసి ఆ ప్రతిపాదనను త్రోసిపుచ్చి షెడ్యూల్ ప్రకారమే టోర్నీ జరగనున్నట్లు ప్రకటించింది. 1987లో భారత్–పాకిస్తాన్, 2011 లో భారత్, శ్రీలంక, బంగ్లాదేశ్‌లు కలిసి సంయు క్తంగా ప్రపంచకప్ టోర్నీలకు ఆతిథ్య మివ్వగా.. తొలిసారి ప్రపంచకప్ టోర్నీ మ్యాచ్‌లన్నీ భారత్‌లోనే జరగడం చరిత్రలో ఇదే తొలిసారి.

వన్డే ప్రపంచకప్‌లో టీమిండియా షెడ్యూల్

అక్టోబర్8(ఆది)	ఇండియా × ఆస్ట్రేలియా	చెన్నై
11(బుధ)	ఇండియా × ఆఫ్ఘనిస్తాన్	ఢిల్లీ
15(ఆది)	ఇండియా × పాకిస్తాన్	అహ్మదాబాద్
19(గురు)	ఇండియా × బంగ్లాదేశ్	పూణే
22(ఆది)	ఇండియా × న్యూజిలాండ్	ధర్మశాల
29(ఆది)	ఇండియా × ఇంగ్లండ్	లక్నో
నవంబర్ 2(గురు)	ఇండియా × క్వాలిఫయర్–2	ముంబయి
5(ఆది)	ఇండియా × దక్షిణాఫ్రికా	కోల్‌కతా
11(శని)	ఇండియా × క్వాలిఫయర్–1	బెంగళూరు

వేదికల కేటాయింపుల్లోనూ తెలుగు రాష్ట్రాలపై చిన్నచూపే..

ఐసిసి వన్డే ప్రపంచకప్ టోర్నీలో మ్యాచ్‌లకు కేటాయించిన వేదికల్లోనూ బిసిసిఐ తెలుగు రాష్ట్రాలపై చిన్నచూపు చూపింది. మొత్తం 48 మ్యాచ్‌లు జరగనుండగా.. ఇందులో 9వేదికలకు ఐదేసి మ్యాచ్‌లు చొప్పున కేటాయించిన బిసిసిఐ.. తెలుగు రాష్ట్రాల్లో ఒక్కటైన తెలంగాణకు మూడు మ్యాచ్‌లను మాత్రమే కేటాయించింది. అక్టోబర్ 6న పాకిస్తాన్–క్వాలిఫయర్–1, 9న న్యూజిలాండ్–క్వాలిఫయర్–1, 12న పాకిస్తాన్–క్వాలిఫయర్–2 జట్ల మధ్య జరిగే మ్యాచ్‌లకు ఉప్పల్ స్టేడియంలో జరగనున్నాయి. ఇక ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో వైఎస్ఆర్ ఇంటర్నేషనల్ స్టేడియం ఉన్నా.. ఒక్క మ్యాచ్‌నూ కేటాయించలేదు. ఈ వివక్షను బిసిసిఐ వన్డే ప్రపంచకప్‌లోనే కాదు.. ఇటీవల ముగిసిన ఇండియన్ ప్రిమియర్ లీగ్(ఐపిఎల్)లోనూ చూపించింది.

భారత్, కువైట్ మ్యాచ్ డ్రా

శాఫ్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్



బెంగళూరు: శాఫ్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా మంగళవారం జరిగిన గ్రూప్–ఏ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో భారత్–కువైట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రా అయ్యింది. రెండు అర్ధభాగాల సమయం ముగిసే సరికి ఇరుజట్లు 1–1గోల్స్‌తో సమంగా నిలిచాయి. తొలి అర్ధభాగం ఇంజూరీ సమయంలో సునీల్ ఛెత్రీ ఒక గోల్ కొట్టాడు. దీంతో భారత్ 1–0 ఆధిక్యతలో నిలిచింది. 45+2వ ని.లో ఛెత్రీ ఈ గోల్‌ను కొట్టాడు. అంతకు ముందు భారత్, కువైట్ జట్లకు ఒక్కోసారి గోల్ చేసే సువర్ణావకాశాలు లభించినా ప్రయోజనం లేకపోయింది. కువైట్ తరఫున అన్వర్ అలీ(92వ ని.)లో ఒక గోల్ చేశాడు. మంగళవారం జరిగిన మరో లీగ్ మ్యాచ్‌లో నేపాల్ జట్టు 1–0తో పాకిస్తాన్‌ను ఓడించి మూడో స్థానంలో నిలిచింది. దీంతో ఈ గ్రూప్ నుంచి కువైట్ టాప్‌లో, భారత్ 2వ స్థానంలో నిలిచి సెమీస్‌కు చేరాయి. భారతజట్టు పాకిస్తాన్‌పై 4–0తో, నేపాల్‌పై 2–0తో గెలిచింది. కువైట్ జట్టు ఒక్క గోల్ అంతరంతో అగ్రస్థానంలో నిలిచింది. ఇక ముఖాముఖి పోరులో భారత్ 1–2తో కువైట్ కంటే వెనుకబడి ఉంది. ఇక ఫిఫా ర్యాంకింగ్స్‌లో భారత్ 101, కువైట్ 143వ ర్యాంకుల్లో ఉన్నాయి. కువైట్‌తో చివరిసారిగా 2010లో జరిగిన మ్యాచ్‌లో భారత్ 1–9గోల్స్ తేడాతో చిత్తుగా ఓడింది. నేడు జరిగిన గ్రూప్–బి చివరి లీగ్ మ్యాచ్‌లో లెబనాన్ జట్టు మాల్దీవులతో, బూటాన్ జట్టు బంగ్లాదేశ్‌తో తలపడనున్నాయి. సెమీస్ శనివారం, ఫైనల్ జులై 4న జరగనుంది.

నేటినుంచి యాషెస్ సిరీస్ రెండోటెస్ట్



లార్డ్స్: ఐదు టెస్ట్ మ్యాచ్‌ల యాషెస్ సిరీస్‌లో భాగంగా లండన్‌లోని లార్డ్ వేదికగా బుధవారం నుంచి రెండో టెస్ట్ ప్రారంభం కానుంది. తొలి టెస్ట్‌లో ఆస్ట్రేలియా చేతిలో అనూహ్య ఓటమితో ఆతిథ్య ఇంగ్లండ్ జట్టు ఈ మ్యాచ్‌కు సిద్ధమైంది. గాయపడ్డ మొయిన్ అలీ స్థానంలో రేహాన్‌కు చోటు కల్పించినట్లు ఇంగ్లండ్–వేల్స్ క్రికెట్‌బోర్డు మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. తొలిటెస్ట్‌లో ఆస్ట్రేలియా జట్టు 2వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను చిత్తుచేసి ఐదు టెస్టుల యాషెస్ సిరీస్‌లో 1–0 ఆధిక్యతలో నిలిచింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68